



జ్ఞాన యోగం


విచారణ

బ్రహ్మ ధర్మ శిక్ష









సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement


సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020050018895

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!



ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

బ్రాహ్మధర్మశిక్ష.

శ్రీ సీతానాథతత్త్వభూషణ
విరచితము.

వంగభాషనుండి యాంధ్రీకరింపఁబడినది.

౧౯౧౩

మచిలీపట్టణము.

కృష్ణా స్వదేశీముద్రాక్షరశాల యందు
ముద్రింపఁబడి ప్రకటింపఁబడెను.

1000 ప్రతులు.

విషయసూచిక.

బ్రహ్మకృపాహి కేవలం

బ్రాహ్మధర్మశిక్ష

ప్రథమపాఠము — వివేకము.

“బ్రాహ్మధర్మము” అను శబ్దార్థమును మీరు క్రమక్రమముగ గ్రహింపఁ గలుగుదురు. కాని ప్రథమమున “ధర్మము” అనుమాటకు నర్థమును గ్రహించుటకుఁ బ్రయత్నింపుఁడు. చేయఁదగిన కార్యముపేరు “ధర్మము”. చేయఁదగని కార్యము పేరు “అధర్మము”. ఎప్పుడును సత్యమును బలుకుట యుచితము. అసత్యమును బలుకుట యనుచితము. ఇందువలన సత్యమును బలుకుట ధర్మము. అసత్యమును బలుకుట యధర్మము. పరులకు నుపకారము చేయుట యుచితము. పరులకు నపకారము చేయుట యనుచితము. ఇందువలనఁ బరోపకారము ధర్మము. పరాపకారమధర్మము. ఇదేవిధముగ నీశ్వరునియందు భక్తి గలిగి యుండుట ధర్మము. ఈశ్వరునియందు భక్తి లేకుండుట యధర్మము. ఈకార్యము ధర్మము ఈకార్య మధర్మమని తెలిసికొనుచున్నప్పుడు, ధర్మాధర్మములను దెలిసికొను శక్తి మనయందుఁ గలదని స్పష్టమగుచున్నది. మనము ధర్మాధర్మముల భేదమును గ్రహించుటయే కాక ఇది ధర్మ మది యధర్మమని నిర్ధారణచే

యుచున్నశక్తినే, ధర్మాధర్మవివేకమని చెప్పుదుము. లేకసంగ్రహముగ వివేకమని చెప్పినను జాలును. ప్రతిమనుష్యుఁడును వివేకమును గలిగియున్నాఁడని సహజముగ మనము గ్రహింపవచ్చును. నీ కలమును గాని, కాగితమును గాని, దొంగిలించిన బాలుని హేయముగఁజూతువు. మఱియును, అన్యాయమున్యాయమని చెప్పుదువు. దొంగతనము నన్యాయమని, లేక యధర్మమని, నిరూపించు శక్తినే వివేకమందురు. తినుటకు నన్నము లేని కడుబీదవానికి దమ్మిడీ యీయమని నిన్నుఁగోరినప్పుడు నీతల్లియొద్దకు నీవు పరుగిడి వెళ్లుటకుఁ గలకారణమేమి? బీదవానికి దమ్మిడీయిచ్చుట యుచితమని నీవు స్పష్టముగ గ్రహించుటవలననే కదా నీవు నీతల్లియొద్దకుఁ బరుగిడి వెళ్లుటకుఁగల కారణము. ఈ తెలిసికొను శక్తినే వివేకమందురు.

కొంచెము విచారించి చూచినచో, వివేక మనవస్తువస్మృత శక్తిగలిగియున్నదని గ్రహింపఁ గలుగుదువు. ఈ వివేకము మన యిచ్ఛగాదు. మన యనిచ్ఛయునుగాదు. ఆఁకలి గలిగినప్పుడు భుజింపవలయునని యిచ్ఛగలిగిన భుజించెదవు. ఆఁకలి లేనప్పుడు భుజింపవలయునను నిచ్ఛయును లేదు. భుజించుటయును లేదు. మామిడిపండును జూచినప్పు డాఁకలి లేకున్నను, తినవలయునను నిచ్ఛగలుగును. దగ్గఱ డబ్బున్నచోఁ గొని తిందువు. కాని, కుళ్లిపోయిన పండయినచోఁ బాఱవేయుదువు. కనుక నిట్టికార్యము లిచ్ఛయున్నఁ జేయుదుము. ఇచ్ఛ లేనిచో మానుదుము. కావున నీవిషయమందు ధర్మాధర్మభేదము లేదు. ఈ పక్షమగు, కార్యములను జేయుమని కాని, చేయవలదని కాని వివేకము కొంచెమైనను జెప్పదు. నీకు జ్వరమువచ్చినమొదల నన్న

ముఁ దినవలదనియును, సగ్గుబియ్యపుజావఁ ద్రాగవలయునని యును వైద్యుఁడు చెప్పినప్పుడు, నీవన్నమును దినినయెడల నీకు జ్వరము తగ్గదు గదా! కాని నీకు సగ్గుబియ్యపు జావత్రాగవల యునను నిచ్ఛ లేదనుకొనుము. అన్నముఁ దినవలయునను నిచ్ఛ గలదనుకొనుము. ఈ సందర్భమున నీ యిచ్ఛానుసారముగఁ జేసినయెడల, ననఁగా సగ్గుబియ్యపు జావను ద్రాగక యన్నమును భుజించినచో నీ వధర్మమును జేసినవాఁడ వగుదువు. కనుక నిట్టి సమయములయందు సగ్గుబియ్యపుజావ త్రాగుట ధర్మమనియును, నన్నమును దినుట యధర్మమనియును, నీవు దెలిసికొనుచున్నా వు. అనఁగా వివేకము చెప్పుచున్నది. భావించి చూచినయెడల నిట్టి సమయములలో వివేకము నీయిచ్ఛకు వ్యతిరేకముగ బోధించుచున్నది. అనఁగా నీకేది యనిష్టమో, దానిని జేయు మని చెప్పుచున్నది. వివేకము మనలోనే యున్నది. ఇచ్ఛయును మనలోనే యున్నది. ఇట్టి సందర్భములలో వివేకమునకును, నిచ్ఛకును నెట్టికలహము సంభవించుచుండునో చూడుము. ఇందు వలననే వివేకమను వస్తువున కద్భుతశక్తి గలదని చెప్పి యున్నాను. నీవు యిచ్ఛాప్రేరణను విననియెడల, ననఁగా సుం దరమగు బంతిని గొనవలయు ననుకొని కొనకున్నను నీవు మంచి వాఁడవనికాని చెడ్డవాఁడవనికాని యిచ్ఛ చెప్పదు. ఇచ్ఛపూర్ణ ముగానిచో నీ మనస్సునకుఁ గష్టముగలుగు ననుమాట సత్య మే యయిన నందువలన నీవు దుష్టబాలుఁడవని, లేక దుష్టబాలిక వని, తలంచు కొనఁగూడదు. కాని వివేకముయొక్క ప్రేరణను విననియెడల నీవు క్రమక్రమముగ దుష్టబాలుఁడవు లేక దుష్ట బాలికవని తెలిసికొనుము. వివేకముయొక్క ప్రేరణను విని

వానిని దుష్టుఁడని సహజముగ గ్రహింతువు. జ్వరము వచ్చిన ప్పుడు మందుఁదినక సగ్గుబియ్యపుజావ త్రాగక వైద్యుఁడు నిషేధించిన వస్తువులను దినినచో, దుష్టబాలుఁడు లేక దుష్టబాలిక యని పరులనుటయే కాక, నీవును దుష్టుఁడనని తలంచెదవు. ఇది యద్భుత వ్యాపారముగదా? మనయిచ్ఛ మనలను మెచ్చుకొనదు, నిందింపదు. వివేకము ప్రకారము ప్రవర్తించినచో "బాగుగఁ బ్రవర్తించితివి, నీవు మంచివాఁడవు" అని వివేకము మెచ్చుకొనును. వివేకము ప్రకారము ప్రవర్తింపనిచో "అన్యాయముగఁ బ్రవర్తించితివి. మంచివాఁడవుగావు" అని వివేకము నిందించును. మనము ధర్మము నాచరించువానిని మెచ్చుకొనుటకును నధర్మము నాచరించువానిని నిందించుటకును మనలోని వివేకమేకదా కారణము. ఇందువలన వివేకము మనలోని వస్తువయినను మనపై నెట్టియధికారమును గలిగియున్నదో చూడుము. వివేకము మనయిచ్ఛానిచ్ఛలకు లోఁబడియుండునది కాదు. అనేకసమయములయందు వివేకము మన యిచ్ఛానుసారముగఁ జేయఁ దలచిన కార్యములను నిషేధించును. అనిష్టములగు కార్యములను జేయనాజ్ఞాపించును. ఉదయమున నిదుర లేచుట కిచ్ఛలేకున్నను, వివేకము నిదురలెమ్మని చెప్పును. చదువుట కిచ్ఛలేనప్పుడు చదువుమని చెప్పును. చదువుకొను సమయమున నాడుకొనవలయునని యిచ్ఛగలిగినచో, నాడుకొనవలదు, చదువుకొనుమని చెప్పును. చేసినతప్పును దాచుటకు నబద్ధము చెప్పనిచ్ఛగలిగినచో నబద్ధము చెప్పఁగూడదని నిషేధించును. మఱియు నబద్ధమును బలికినయెడల నన్యాయమని చెప్పును. ఎవరినైనను గోపమునఁ దిట్టినచోఁ దప్పనిఁ

చేసితివని వివేకము చెప్పును.

ఇందువలన ధర్మాధర్మములను నిరూపించు శక్తియగు వివేకము మనలోని వస్తువయినను, దీనిని నా వస్తువని చెప్పుటకు వీలు లేదని గ్రహించుచున్నాము గదా? ఈ వస్తువు మనపై బాధ్యతను గలిగియున్నది. కనుకనే వివేకము మనకుం గర్తయు బూజ్యమును నైయున్నది. ఇంకను విచారించి చూచిన యెడల మనకుం బూజ్యులును మనపై నధికారముగల వారు నగు తల్లి, తండ్రి, గురువు, మొదలగు వారును, వివేకాధీనులని బోధపడంగలదు. వివేకముయొక్క ప్రేరణవలననే, వారు మనలను ధర్మకార్యములం జేయవలసినదనియుం నధర్మకార్యములం జేయంగూడదనియును జెప్పుటయే కాక ధర్మకార్యములను జేసినప్పుడు మెచ్చుకొందురు. అధర్మకార్యములను జేసినప్పుడు నిందింతురు. వివేకము ప్రేరేపించినటుల వారు మనకుం జెప్పుచుండుట వలన వారును వివేకాధీనులు. కనుక వివేక మందఱకు నధికారి.

ప్రశ్నలు.

౧ దేనిని ధర్మమందురు? దేనిని నధర్మమందురు?

౨ ధర్మాధర్మముల కుపమానములను రెంటిని జూపుము.

౩ దేనిని వివేకమందురు? ఉపమానములతో బోధింపుము.

౪ ఇచ్ఛానిచ్ఛలకును వివేకమునకును గలభేదమేమి?

౫ "వివేకము మనపై నధికారమును గలిగియున్నది." అనంగా నర్థమేమి?

౬ "వివేకము మనలను మెచ్చుకొనును నిందించును" దీని నుపమానముల మూలముగ బోధింపుము.

౭ "వివేకమందఱకు నధికారి— మనకుఁ బూజ్యులయిన వారికి నధికారి" ఈ వాక్యమును మనసునకుఁ దెలియునట్లు బోధింపుము.

ద్వితీయపాఠము-బ్రాహ్మము. (లోపల)

వివేకము మనలోని వస్తువయినను మనవస్తువని చెప్పుటకు వీలు లేదనియును, వివేకము మనపై నధికారమును గలిగి యున్నదనియును ప్రథమపాఠమునఁ జదివియున్నాము. ఈ వాక్యార్థమును బాగుగ బోధపఱచుకొనుఁడు.

నీ వేదో యొక చీఁకటియింటిలోనికి వెళ్లితి వనుకొనుము. ఇంటియం దెవరును లేరను విశ్వాసము కలిగి యింటిలోఁ బ్రవేశించిన తర్వాతఁ జీఁకటివలన నేమియును జూడఁజాలవు గదా? రెండు మూఁ డడుగులు వేసి వేయక ముందే నీయిచ్ఛానుసారము నడకసాఁగనిచో నీ వేమని తలంతువు? నీవడకసాఁగకుండుటయే కాక నీయిచ్ఛకు వ్యతిరేకముగ నడవవలసి వచ్చినప్పు డేమని భావింతువు? ఇది నిర్జనగృహముగాదనియును ఇంకొకఁ డిచ్చటగలఁ డనియును, నీతఁడే నీయిచ్ఛానుసారముగ నడువనీయక నీయిచ్ఛకు వ్యతిరేకముగ నడిపించుచున్నాఁ డనియును దలంతువు. విచారించిచూచినచో నీయనుభవమున ఇట్టిచర్య జరుగుచున్నదని నీకుఁ దెలియుటలేదా?

ప్రథమమున మన మనస్సునందు మనస్సుతప్ప నింకేమి యు లేదని మనము భావింతుము. కాని, వివేకముయొక్క చర్యలను జూచిన నాశ్చర్యము బొందుదుము. వివేక మనేకసమయములయందు మనయిచ్ఛకు నాటంకమును గలిగించును. అనిష్ట కార్యములఁ జేయఁ బ్రేరేపించును. అనేక సమయములయందు మనకుఁ బ్రియములగు కార్యములను నిందించును. అప్రీతికరములగువానిని మెచ్చుకొనును. ఇందువలన మన మనోగృహమున మనస్సొక్కటియే వాసము చేయుటలేదనియును, మనస్సుతోఁగూడ నింకొకఁడు నివసించుచున్నాఁడనియును దెలిసికొనుచున్నాము. ఆయనను మన కన్నులతోఁ జూడఁజాలమనుట వాస్తవమే కాని, ఆయన కార్యములను జూచి యాయన యున్నాఁడని గ్రహింపఁ గలుగుదుము. మనుష్యుఁడు కనుపడని చీఁకటి గృహమునందుఁ గార్యమునుబట్టి మనుష్యుఁడున్నాఁడని గ్రహించు విధముననే, మనోగృహమునం దెవరిని జూడఁజాలకున్నను, కార్యములవలన నిచ్చట నొకఁడున్నాడనియును, నాయన వివేకము వలన మనపైని యధికారమును గలిగియున్నాఁడనియును, దెలిసికొనుచున్నాము.

ఆయన జ్ఞానమయుఁడనియును మన్ను, నీళ్లు, గాలి మొదలగు నచేతన వస్తువులవంటివాఁడు గాఁడనియును, విచారించిన కొలఁదిని స్పష్టముగఁ గ్రహింపఁ గలుగుదుము. దొంగతనము చేయుటకును నబద్ధమాడుటకును, వ్రతసమయమున నన్నముఁ దినుటకును, బ్రయత్నించినప్పు డాయన వివేకము వలన నీకార్యములు చేయుట యన్యాయమని చెప్పును. ఇందువలన నాయనకు జ్ఞానము గలదనుట విస్పష్టముగదా. చతురులకు

నిచ్ఛ లేనపుడు చదువుమని చెప్పును. మిఠాయికై నీయొద్ద నున్న డబ్బును బీదవానికి యిచ్చినయెడలఁ బ్రశంసించును. ఎవరినైనను గోపమునఁ దిట్టినచో నన్యాయమని నిందించును. కాన నీదృష్టాంతముల వలన నాయన మహాజ్ఞానియని చెప్పుట కణుమాత్రమైనను సందేహముండునా? మనోగృహమందుండు జ్ఞానస్వరూపుని మనము బ్రహ్మమనియు నీశ్వరుడనియుఁ బరమేశ్వరుఁడనియును బిలుచుచున్నామని తెలిసికొనవలయును. మనము కన్నులతో నీశ్వరుని జూడఁజాలము. చెవులతో నీశ్వరుని వాక్యములను వినఁజాలము. హస్తములతో నీశ్వరుని ముట్టుకొనఁజాలము. ఏయింద్రియముతోడను నీశ్వరుని దెలిసికొనఁజాలము. అయినను ఆయన యున్నాఁడని గ్రహించుచున్నాము. అందువలన నేవస్తువు నింద్రియముల మూలమునఁ దెలిసికొనుటకు వీలు లేదో, యేవస్తువును మన మతీంద్రియవస్తువని చెప్పుచున్నామో, యట్టివస్తువును దెలిసికొనుశక్తి మనలోఁ గలదని తేలుచున్నది. అతీంద్రియవస్తువును దెలిసికొను శక్తిని "ప్రజ్ఞ"యని చెప్పుదురు. ఈ "ప్రజ్ఞ" మన మనస్సుతోడనే జన్మించినది. అనఁగాఁ బరమేశ్వరుఁడు మన మనస్సును సృష్టించినప్పుడే యీ "ప్రజ్ఞ"ను సృష్టించి యున్నాఁడు. ఇందువలననే కొందరు "సహజజ్ఞాన"మని చెప్పుచున్నారు. మన మనస్సుతోడ నిది జన్మించుటవలన సహజజ్ఞాన మనుచున్నారు. వివేకమునకువలె సహజజ్ఞానమునకును నద్భుతశక్తి గలదని మనము సులభముగ గ్రహింపఁ గలుగుదుము. మనకీశక్తియుండుటవలననే యింద్రియాతీతమగు వస్తువును దెలిసికొనుచున్నాము. ఈ శక్తివలననే "వివేకము" మనవస్తువు గాదనియును, మన నిజ

శక్తియనుగాదనియును, బరమేశ్వరుని శక్తియనియును గ్రహించుచున్నాము. "ప్రజ్ఞ" లేక "సహజజ్ఞానము" వలన మనమెట్టి విషయములను గ్రహింపఁగలుగుదుమో క్రమక్రమముగఁ జూడఁగలము. ఎవఁడు వివేకముచే మనస్సుపై నధికారమును గలిగి యున్నాఁడో, వానినే బ్రహ్మమని చెప్పుచున్నారు. ఆయన జ్ఞానవంతుఁడు. ఆయన మన యిచ్ఛానిచ్ఛల నెరుగును. మనకోరికలను గ్రహించును. కొంచెము విచారించినచో నాయన సంబంధము నింకను దెలిసికొనఁ గలుగుదుము. వివేకముయొక్క కార్యములనుజూచి యీశ్వరుని స్వభావమును నీశ్వరుని యిచ్ఛలను మనముదెలిసికొనఁ గలుగుదుము. వివేకమెప్పుడును దుష్టకార్యములను జేయఁబ్రేరేపింపదు. సర్వదా మంచికార్యములే చేయుమని ప్రేరేపించుచుండును. దుష్టయోజన చేసినప్పుడుగాని, యేపిల్లవాని నయినను గొట్టదలచినప్పుడుగాని, వివేకము పాపమని చెప్పును. కఠినమగు మాటలనుగాని యబద్ధపు మాటలనుగాని, పలుకుటఁ బాపమని వివేకము చెప్పును. పోట్లాడుట, వెక్కిరించుట మొదలగు పనులను జేయవలదని వివేకము చెప్పును. వివేకము చెడుచింతలను జెడువాక్కులను జెడుకార్యములను నిషేధించును. మంచి తలంపులను, మంచి వాక్కులను, మంచికార్యములను జేయఁ బ్రేరేపించును.

ఇందువలన మన మీశ్వరుని యిచ్ఛా స్వభావములను సులభముగ గ్రహింపఁ గలుగుదుము. ఈశ్వరుఁడు చెడుయోజనకుఁ జెడువాక్కులకు జెడుకార్యములకు విరోధియనియును, మంచి తలంపులయు, మంచిమాటయు, మంచికార్యములయుఁ బక్షమందుండుననియును దెలిసికొనుచున్నాము. అనఁగా సంక్షేపముగ

నీశ్వరుఁడు పాపరహితుఁడు పవిత్రుఁడునని చెప్పినఁజాలును. నిర్దయుని ప్రేమవిహీనుని, బవిత్రుడని చెప్పుటకు వీలు లేదుగదా? ఇందువలన నీశ్వరుఁడు దయాళుఁడనియు, నెల్లరను బ్రేమించువనియును, మనముసులభముగ గ్రహింపవచ్చును. నిష్ఠురమగు యోచనలను. మాటలను, గార్యములను ద్వేషించువాఁడను గాననియును, సమస్త జనులయొక్క మంగళమును గోరుచు, సమస్త జనులయందు దయనుజూపుచు, సమస్త జనులయెడ దయతో వర్తించు చుండుటయె, న్యాయిచ్ఛయని, మనము వివేకముచేఁ బ్రేరేపింపఁ బడుచున్నప్పు డీశ్వరుని దయాళుఁడని చెప్పుటకణుమాత్రమైనను, సందియము లేదు. ఈశ్వరుని దయాళుత్వమునుగూర్చి విపులముగఁ బిమ్మటఁ జెప్పబడును. మనము ప్రజ్ఞావివేకములచేఁ బ్రహ్మమును దెలిసికొనుచున్నామో యాబ్రహ్మము దయామయుఁడు, పవిత్ర స్వభావుఁడునని గ్రహింపుఁడీ.

ప్రశ్నలు.

౧ అంధకారగృహమున నీవుగాక నింకొకఁడు గలఁడని గ్రహింపఁగలుగు విధమెద్ది?

౨ మన మనోగృహమునందు మనస్సుగాక, యింకొకఁడు గలఁడని గ్రహింపఁగలుగు విధమెద్ది?

3 "వివేకము మనవస్తువుగాదు, మనశక్తియునుగాదు" ఈవాక్యమునకు నర్థమేమి?

౪ జ్ఞానస్వరూపుఁడగు నీశ్వరుఁడు మన మనోవాంఛల దెలిసికొనుచున్నాఁడని గ్రహించుటెట్లు?

౫ ఈశ్వరుని దెలిసికొనుశక్తికిఁ బేరేమి?

౬ దీనిని సహజజ్ఞానమని యేల చెప్పుదురు?

౭ "అతీంద్రియ వస్తువు" అనఁగాఁ నర్థమేమి?

౮ ఈశ్వరుని స్వభావమేమి?

౯ ఈశ్వరుఁడు దయామయుఁడు పవిత్రుఁడునని తెలిసికొనుటకు మార్గమెద్ది?

తృతీయ పాఠము. బ్రాహ్మము. (వెలుపల)

ఈశ్వరుఁడు మనలోపల నున్నాఁడని గ్రహించితిమి. ఇప్పుడు మన వెలుపలనుగూడ నీశ్వరుఁ డున్నాఁడని మనము గ్రహింపవలయును. కార్యముండఁగనే కర్తయుండవలయును. కార్యము తనంతటఁ దానుగఁ గాదు. కనుకఁ గార్యమునకుఁ గర్తయుండితీరవలయునను సంగతిని మనము సహజముగనే గ్రహింపఁ గలుగుదుము. మనమేదయిన కార్యమును జూచినప్పుడు, కర్త గనుపడకున్నను, నీకార్యమునకుఁ గర్తయొకఁడున్నాడని నిశ్చయించుకొందుము. నీవు గృహమునందు గూర్చుండి కిటికీలోనుండి చూచునప్పుడు గదలుచున్న యొక కఱ్ఱచివర మాత్రమే కనుపడుననుకొనుము. కఱ్ఱచివర మాత్రమే కనుపడుచున్నను గఱ్ఱ తనంతటఁ దానుగఁ గదలుచున్నదని నమ్ముదువా? ఈకార్యమునకుఁ గర్త లేదనుకొనెదవా? కర్తను జూడకున్నను నీకార్యమునకుఁ గర్తయొకఁడున్నాఁడనియును, నెవఁడో యొకఁడు చాటున దాఁగి కఱ్ఱనాడించుచున్నాఁడనియును సులభముగఁ దెలిసికొనఁ గలుగుదువు.

"కర్త లేక కార్యముగాదు" అను సంశయమును మనము "ప్రజ్ఞ" లేక "సహజజ్ఞానము" వలన స్పష్టముగఁ దెలిసికొనుచున్నాము. మనము ప్రతిముహూర్తమును జగత్తునందు జరుగుచున్న గణనాతీతములగు కార్యములను జూచుచున్నాము. మన శరీరమునందు రక్తము నదీప్రవాహమువలె సర్వదా పాఱుచున్నది, మనముతినుపదార్థము లుదరమునందు జీర్ణమై రక్తము మాంసము, మొదలగు రూపములను ధరించి శరీరాభివృద్ధియును శరీరరక్షణమును జేయుచున్నవి. సర్వదా గాలివీచుచుండుట వలన మనప్రాణములు నిలుచుచున్నవి. మేఘములు వర్షించుచున్నవి. ఇందువలన భూమి శీతలమగుచుండుటయేగాక నదులు పుట్టుచున్నవి. భూమినుండి సస్యములు ఫలవృక్షములు పుట్టి పెరుగుచున్నవి. సస్యములధాన్యములను, ఫలవృక్షములపండ్లను దిని మనముజీవించుచున్నాము. అగ్ని మండుచున్నది. అందువలన భోజనపదార్థములు పక్వమగుచున్నవి. సూర్యుఁడు వెలుతురును వేఁడిమి నిచ్చుచున్నాఁడు. భూమి బంతివలె దనచుట్టు దాను దిఱుగుచు సూర్యునిచుట్టు దిఱుగుచున్నది. ఇందువలన రాత్రిం బవళ్లు లను భేదమును, హేమంతము గ్రీష్మము, మొదలగు ఋతువుల పరివర్తనములును గలుగుచున్నవి. ఈవిధముగ గణనాతీతకార్యములు ప్రపంచమునందుఁ గలుగుచున్నవి. ఈగణనాతీతకార్యములన్నిటికిని గర్తయొకఁడున్నాఁడని చెప్పుట కణుమాత్రమైనను సందియము లేదు. ఎందువలన ననఁగా గర్త లేక కార్యము జరుగుటకు వీలులేదు.

కాని పైన చూపించిన యుదాహరణముల వలన నాకకముగా నచేతన వస్తువుల వలన నీకార్యములు జరుగు

చున్నవని తోఁపవచ్చును. శరీరమునందు రక్తప్రవాహము ప్రవహించుచున్నదని చెప్పినప్పుడు రక్తము తనంతటఁ దానుగఁ దిరుగుచున్న దనియును, నెవఁడును జ్ఞానపూర్వకముగ రక్తమును బ్రవహింపఁ జేయుచుండుట లేదనియును దోఁచవచ్చును. "వాయువు వీచుచున్నది" అనునప్పుడు, వాయు వచేతన వస్తువనియును దనంతటఁ దాను వీచుచున్నదిగాని యెవఁడును గాని, తెలిసికొని, గాలిని వీచునటులు చేయుచుండ లేదనియును దోఁచవచ్చును. మనకన్ను లచేతనవస్తువులను మాత్రమే చూడఁగలవు. మనయింద్రియము లచేతనవస్తువులను మాత్రమే, తెలిసికొనఁగలవు. 'అందువలననే మన మచేతన వస్తువుల మఱుఁగున నేమియు లేదని కొందరగ భావింతుము. కాని, పరిశీలించి చూచినచో నిటులు భావించుట శుద్ధభ్రమయని స్పష్టపడును. రక్తము మొదలగునవి తమంతటఁ దాము తిరుగుచున్నవను శంక దోఁచవచ్చునని చెప్పియున్నానుగాని, విచారించి చూచిన యెడల రక్తము వాయువు నగ్ని మొదలగునవి తమంతటఁ దాముగఁ బనిచేయుచుండుట లేదనియును, జ్ఞానమయుఁడగు నొక పురుషుఁడు వీనిని నడిపించుచున్నాఁడనియును దెలిసికొనఁగలుగుదుము. జగత్తునందుజరుగు సకలకార్యముల స్వభావములను జూచినచో నీ సకలకార్యములకు నచేతన వస్తువు కర్తగాదనియును, జ్ఞానమయుఁడగు మహాపురుషుఁ డొకఁడీకార్యము లన్నిటికిని గర్తయైయున్నాఁడనియును గ్రహించెదము. కొన్నికొన్ని కార్యములను జూచినప్పుడీ సకలకార్యములకును గర్తయగు వాఁడు జ్ఞానవంతుఁడని విస్పష్టముగ గ్రహింపఁ గలుగుదుము. ఆ విధమగు కార్యోపమానములఁ గొన్నిటిని జూపించెదను.

జ్ఞానవస్తువును జూడఁజాలవుగాని, నీకుఁగల జ్ఞానమును నీ మనస్సుచే గ్రహింప గలుగుదువు. కాని యితరుల జ్ఞానము నెటుల గ్రహింపఁ గలుగుదువు? నీవు నీతలిదండ్రులను జూడఁగలవు గాని, వారిజ్ఞానమును జూడజాలవు. అటులయినచో వారికి జ్ఞానముగలదని యెటులు గ్రహించుచున్నావు? వారికార్యముల మూలమున వారిజ్ఞానమును దెలిసికొనుచున్నావు. నీ తల్లి యన్నము, కూర, పళ్లెరమునందుఁ బెట్టుకొని నీయొద్దకువచ్చి యాపళ్లెరమును నీయొద్దఁ బెట్టినప్పుడు నీవుకార్యమును మాత్రమే చూచుచున్నావు. ఈకార్యమునుబట్టి నీవు బాగుగ భావించి చూచినయెడల నీవు భోజనమును భుజించుటవలన నీయాఁకలి దీరుననియును, శరీరమునకు బలముగలుగుననియును భావించి నీయొద్ద భోజనముఁ బెట్టినదని స్పష్టముగ గ్రహింపఁగలుగుదువు. ఇచ్చటఁ గార్యమువలనఁ గర్తయొక్క జ్ఞానమును, నిచ్ఛయు, విస్పష్టముగ నెటులు తెలిసికొనుచున్నావో చూడుము! నీతల్లి యీవాక్యములను జెప్పినచో, నా చెప్పుటయును, గార్యమేకాని జ్ఞానముగాదు. శబ్దసమూహము జ్ఞానముగాదు. శబ్దసమూహ మిచ్ఛయునుగాదు. కాని, శబ్దములను వినునప్పుడు శబ్దముల నుచ్చరించువానికి జ్ఞానమును నిచ్ఛయును గలవని గ్రహింతుము. ఈస్థలమునందుఁ గార్యమువలనఁ గర్తయొక్క జ్ఞానమును దెలిసికొను విధముననే, బాంధవులు, చుట్టపక్కములు తోడిబాలురు మొదలగు వారల కార్యముల వలననే వారిజ్ఞానమును దెలిసికొనుచున్నాము. కొన్నివిధములగు కార్యములయందు జ్ఞానమును నభిప్రాయమును ప్రకాశమానమగుచుండును.

ఏకార్యములు మనుజులవలనఁగాని, యితర జంతువుల వలనఁగాని నెఱవేఱుట లేదో, యట్టికార్యముల యందును నీ విధమగు జ్ఞానప్రకాశము గలదో లేదో విచారించి చూచిన యెడలఁ దెలియును. తల్లిగర్భమునుండి శిశువు పృధివికి వచ్చుటకు నావశ్యముగఁ గర్త యొక్కఁడుండి తీరవలయును. ఈకర్తను గన్నులు చూడఁజాలవు. కాని, వాని కార్యస్వభావములను యోజించి చూచినయెడల నాయనకు జ్ఞానముగలదో లేదో స్పష్టమగును. శిశువుయొక్క నేత్రముల విషయమును భావింపుము. శిశువుయొక్క నేత్రములు చూచుటకునిర్మింపఁబడినవి. అనఁగానలుదిక్కుల నుండు సమస్త వస్తువులను బాగుగఁ జూచునటుల నిర్మింపఁబడినవి. కానఁ గన్నులు చూడఁగలందులకుఁ గాను నుద్దేశింపఁబడి నిర్మింపఁబడినవని బాగుగ దెలిసికొను చున్నాము. అటులయినచో "చూడఁగలందులకు" నను శబ్దమున కర్థమేమి? "చూడ గలందులకు" అనఁగా "చూడవలయునను నభిప్రాయము" లేక "చూచునని మనమునఁదలఁచి" అని తేలుచున్నది. ఎవరికీ యభిప్రాయము? ఎవఁడీవిధముగ మనమునఁ దలఁచెను? "ఈ కన్నుల తోడ శిశువుచూచును." అను నీవాక్యమెవరి మనములోనిది? శిశువున కీయభిప్రాయము లేదనియును, శిశువేవిధముగఁ దలంప లేదనియును మనము సహజముగ గ్రహింపఁ గలుగుదుము. శిశువుతల్లిదిగూడ నీయభిప్రాయము గాదనియును దేలుచున్నది. ఎందువలననఁగా శిశువుతల్లి శిశువుచూచునను దలంపున శిశువుయొక్క కనులను నిర్మించియుండలేదు. ఎవఁడు శిశువును సృష్టించియున్నాఁడో యాయనచే యీయభిప్రాయమని స్పష్టముగఁ దేలుచున్నదిగదా? కన్నుల మూలమునఁ జూచుఁగాక

యనితలంచి యాయనే శిశువునకుఁ గన్నుల నిచ్చియున్నాఁడు. ఇందువలన శిశువును సృష్టించినవాని యభిప్రాయమును జ్ఞానమును మనము విస్పష్టముగఁ దెలిసికొనుచున్నాముగదా. శిశువును నిర్మించిన వానిని మనము చూడలేనిమాట వాస్తవమె. కాని యాయన కార్యములయందు జ్ఞానప్రకాశమును స్పష్టముగఁ జూచుచున్నాము.

శిశువుయొక్క చెవులు ముక్కు నోరు మొదలగువాని విషయములను భావింపుము. కొంచెము వయసు వచ్చునప్పటికి దంతములు వెలుపలికి వచ్చును. కాళ్ళ, దంతముల విషయమును భావింపుము. ఉదరమునందుండు సక్భృతయంత్రమునందు మనము భుజించు పదార్థములు జీర్ణమై, రక్తము, మాంసము వెండ్రుకలు, గోళ్ళు, ఎముకలు మొదలగునవిగా మారుచుండును. ఈ యుదరమందుఁగల యంత్రముయొక్క విషయమును భావింపుము. ఈ సమస్త కార్యములయందును కర్తయొక్క యభిప్రాయమును, జ్ఞానమును బ్రకాశమానమగుచుండుటను జూచుచున్నాము. సమస్తవస్తువుల నీయన సృష్టించియున్నాఁడు. మఱియును, శరీరమునకు జీవమునిచ్చి సముదాయ వస్తువులను రక్షించుచున్నాఁడు. ఆయనకుఁగల జ్ఞానమును స్పష్టముగఁ దెలిసికొనుచున్నాము. ఈ జ్ఞానమయుని మనము, బ్రహ్మము, ఈశ్వరుఁడు పరమేశ్వరుఁడునని పిలుచుచున్నామని యెఱుఁగునది. ఈయన వివేకము వలన మనకు ధర్మము, నధర్మమును దెలుపుచున్నాఁడు. ఈయన మనశరీరముల నిర్మించి ప్రాణము నొసంగి యాహార పదార్థములను, వాయువును, నిచ్చి రక్షించు

చున్నాఁడు. ఈయనయే జగత్తునందలి సమస్త వస్తువులను నడిపించుచున్నాఁడు.

గాలి తనంతటఁ దానే వీచుచున్నదిగాని, వీచుటకు నేవిధమగు జ్ఞానప్రకాశమును బొందుటలేదని ప్రథమమున దోఁచవచ్చును. కొంచెము భావించిచూచినచో, నభిప్రాయము జ్ఞానమును బొందియె, గాలివీచుచున్నదని తెలిసికొనఁ గలుగుదుము. గాలివీచుటవలన నలుదిక్కుల యందలి దుర్గంధము దూరమగును. రోగనివారణమగును. మఱియును గాలి మన ముక్కులలోనుండి శరీరమునందుఁ బ్రవేశించి చేయు కార్యము లత్యద్భుతములు. గాలి మన శరీరమునందుఁ బ్రవేశించుట వలననే మనము బ్రతుకుచున్నాము. ఒక ముహూర్తకాలము మన నిశ్వాస మాఁగిపోయినచో మనము చచ్చిపోదుము. ఇందువలన గాలి సర్వదా యెందుకువీచుచున్నదో గాలిసర్వదా మన శరీరమునం దెందుకుఁ బ్రవేశించుచున్నదో స్పష్టముగ బోధపడుచుండుటలేదా! మనము బ్రతుకుట కొఱకుఁగాను గాలి యనుక్షణమును వీచుచు సర్వదా మనశరీరమునందుఁ బ్రవేశించుచు, మనలను బ్రతికించుచున్నది. ఇచ్చట "కొఱకు" అను మాటకు నర్థమును భావింపుము. "కొఱకు" అనగా నిచ్చట "నభిప్రాయము" అనియేకదా యర్థము? ఇదెవరి యభిప్రాయము? ఇదిమనయభిప్రాయముగాదు. కారణము మన యిచ్ఛవలన గాలికొంచెమైనను వీవదు. వాయు వచేతన వస్తువగుటవలన నీయభిప్రాయము వాయువునకు లేదు. ఎవఁడుగాలిని వీచునటులు చేయుచున్నాఁడో యాయనదే యీ యభిప్రాయము. ఆయన ప్రాణికోటి గాలిని పీలిచి బ్రతుకుచుండునుగాక యను

నిశ్చయము గలిగి గాలిని బ్రసరింపఁ జేయుచున్నాఁడు. అట్లయినచో నిపుడు గాలి తనంతటఁ దానుగ వీచుచున్న దనియును వీచుటకు నేవిధమగు జ్ఞానప్రకాశమును బొందుట లేదనియును మన కాకస్మికముగ దోఁచిన సంగతి కేవలము భ్రమయని విస్పష్టముగ దెలిసికొనుచున్నాము. ఇఁకను నిపుడు జగత్తునందలి యితర కార్యముల విషయములను భావించి చూతము. అగ్ని, సూర్యుఁడు, వర్షము, నదులు మొదలగు వాని విషయములను భావించిచూచినచో సమస్త కార్యముల యందును నీశ్వరుని యభిప్రాయమును జ్ఞానమును బ్రకాశమానములగుచున్నటులు సులభముగఁ దెలిసికొందుము.

ఈశ్వరుని మనము కన్నులతోఁ జూడఁజాలము. అన్యేంద్రియములవల నైనను గ్రహింపఁజాలము. అయినను నాయన యున్నాఁడనియును నాయనసర్వదా చేయుకార్యములను, నాయన దెలిసికొనువానిని నాయన యిచ్ఛలను మనము దెలిసికొనుచున్నాము. ఈ తెలిసికొనుశక్తినే ప్రజ్ఞ యని చెప్పియున్నాను. ప్రజ్ఞయెట్టి శక్తిని గలిగియున్నదో చూతుము? ఇదిమన యింద్రియముల ద్వారమున దెలిసికొనుటకు వీలుగాని వస్తువును దెలిసికొనుచున్నది.

ప్రశ్నలు.

౧ కార్యముండగనే యేదియుండవలయును? ఏది లేనియెడల గార్యముగాదు?

౨ ఏదయిన కార్యమునుజూచినపుడు కర్తకనుపడనిచో

ఏ కార్యమునకుఁ గర్త లేఁడనియే భావించెదవా? ఉపమానములఁ జూపుము.

3 జగత్తునందు జరుగు కార్యములలో పది యుపమానములఁ జూపింపుము.

౪ అచేతన వస్తువులు తమంతటఁ దాముగనే పనులను చేయునా? ఇది భావ్యమేనా?

౫ కర్తకు జ్ఞానముగలదని యెటులు గ్రహింపనగును?

౬ నీకు జ్ఞానముగలదని నీ వెటులు గ్రహించుచున్నావు?

౭ తలిదండ్రులు మొదలగు వారలకు జ్ఞానము గలదని యెట్లు గ్రహించుచున్నావు?

౮ "కార్యముల మూలమునఁ గర్తజ్ఞానమును దెలిసికొనవచ్చును" దీని నయి యుపమానముల ఋజువుపఱుపుము.

౯ మన శరీరమునందు జరుగు నయిదు కార్యముల పేరులను జెప్పుము. దేనివలన నీశ్వరుని జ్ఞానము నభిప్రాయము ప్రకాశమానము లగుచున్నవి?

౧౦ శరీరమునకు వెలుపల జరుగు పదికార్యముల పేరులను జెప్పుము. దేనివలన నీశ్వరుని జ్ఞానము నభిప్రాయము ప్రకాశమాన మగుచున్నది?

చతుర్థపాఠము. ఈశ్వరుఁడొకఁడు.

గాలి మన వెలుపలనుండువస్తువు. ఇది లేనియెడల నొక ముహూర్తమయినను జీవింపఁజాలము. క్రమక్రమముగ మనము గాలిని పీల్చుచుందుము. ఈ పీల్చినగాలి మన ప్రాణరక్షణమును చేయుటయేకాక, శరీరమునందలి మలిన పదార్థములను దీసికొని క్రమక్రమముగ బయటకు వచ్చుచుండును. మన శరీరమునకును, గాలికిని నెట్టి నికటసంబంధము గలదో చూడుము. ఇందువలన మన శరీరరక్షణార్థముగాలి సృష్టింపఁబడినదని మనము బాగుగ గ్రహించియున్నాము. శరీరము గాలి భిన్నవస్తువులనుమాట సత్యమే యయినను నొక్కే యభిప్రాయమున నీరెండు వస్తువులును జతకూర్పఁబడియున్నవి. ఏవఁడు శరీరమును సృష్టించియున్నాఁడో యతఁడే శరీరమున కుపయోగమగునట్లు గాలిని గూడ సృష్టించి యున్నాఁడు. మన శరీరమెక్కడ? నదులు, చెఱువులు, మేఘములు, మొదలగునవియెక్కడ? జలములు లేనియెడల మన ప్రాణములు నిలువఁజాలవు. జలమునకు శరీరము దూరమందున్నది. శరీరమునకు జలము దూరమందున్నది. జలము లేనియెడల జీవించుటకు వీలులేనట్లుగ శరీరము నిర్మింపఁబడినది. దాహమును దీర్చుచు, శైత్యము నొసంగుచు ప్రాణములను రక్షించుటను నభిప్రాయమున జలములు నిర్మింపబడినవి. శరీరమును జలమును నొకదాని నొకటి దూరమందున్న వనుమాట సత్యమేకాని యొక సూత్రమునసే యీ రెండువస్తువులును నెట్లు బంధింపఁబడియున్నవో చూడుము. జలము శరీరముకొఱకు సృష్టింపఁబడినది. శరీరమెప్పుడును జలమును గోరుచుం

దును. ఒక యభిప్రాయముననే యొక కర్తయొక్క యిచ్ఛచేతనే యీ రెండువస్తువులకును జతగలుపఁబడియున్నది. మఱియును ఫలసస్యములసంగతిని భావింపుము. ఇచ్చటనున్న శరీరమునకును భూములయందు ఫలించుధాన్యములకును, ఫలవృక్షముల ఫలించు పండ్లకును నెట్టి నికటసంబంధము గలదో చూడుము. భోజనము భుజింపనిచో నాఁకలివలనఁ దల్లడిల్లుటయే కాక మనము చనిపోవుదుము. పొలములఁ బండుధాన్యములు వృక్షముల బండుఫలములు మనయాఁకలిని నివారించుచున్నవి. భుజించు పదార్థముల సారము రక్తమాంసములుగ మారి శరీరమునకు బలమును గలిగించుచున్నది. ఇది యెటువంటి యాశ్చర్యకరమగు సంబంధమో చూడుము. ఎవఁడు శరీరమును సృష్టించియున్నాఁడో యతఁడే శరీర రక్షణార్థము ఫలధాన్యములను ఫలింపఁజేయుచున్నాఁడు. మఱియును భుజించిన పదార్థములు పక్వమగునటులుచేసి శరీరరక్షణము చేయుచున్నాఁడు. సూర్యునకును భూమికి నెంతదూరమో గమనింపుఁడు! సూర్యుఁడు మనకుఁ దొమ్మిదికోట్ల క్రోసులదూరముకంటె నెక్కుడు దూరమందున్నటులు తెలుచున్నది. ఇంత దూరమందున్న సూర్యుని వెలుతురును వేడిమియును లేనియెడల నొక్క నిముసమైనను మనపని సాఁగదుగదా! సూర్యుని వెలుతురులేని యెడల వెంటనే సమస్తప్రాణులు నశించును. సమస్త వస్తువులు నొక యాకారమునే పొందును. సూర్యుఁడు భూమిని నాకర్షించుచున్నాడు. భూమియును సూర్యుని నాకర్షించుచున్నది. ఈ యాకర్షణమువలననే సూర్యుఁడును భూమియును దమ తమ స్థానములఁ దప్పకుండనున్నవి. పృథివియొక్క దైనికగతివలన రాత్రిం బవ

ళ్లను, పృథివియొక్క వార్షికగతివలన ఋతుపరివర్తనములును గలుగుచున్నవని తెలిసికొనుఁడు. అనేకకోట్ల మైళ్లదూరమందున్న సూర్యునకును భూమికి నెట్టి నికటసంబంధముగలదో చూడుఁడు? వీనిని యేశక్తి బంధించుచున్నది? ఈసంబంధమువలనఁ బృథివిని సూర్యుని, సృష్టించిన వాఁడొకఁడనియు నతఁడే సూర్యునకును భూమికిని గలసంబంధములకుఁ బ్రాపగుచున్నాఁడనియును దెలిసికొనుచున్నాము. వెలుతురు వేఁడిమి యాకర్షణము సలుప్రక్కలఁ దిరుగుట మొదలుగాఁగల బాహ్యసంబంధములను జూచి సృష్టికర్తయొక్క యభిప్రాయముల నిచ్ఛలను మనము గ్రహించుచున్నాము. "సూర్యునియొక్క వెలుతురువలనను వేఁడిమిని నాకర్షణమువలన భూమి రక్షణమును బొందుఁగాక" అనునదియే యాయన యిచ్ఛయైయున్నది. ఈయొకయిచ్ఛలో సూర్యుఁడు భూమియు నిమిడియున్నవి. కొన్ని కొన్ని కార్యములను భావించినచోఁ బ్రపంచమున నీకార్యములు వేఱువేఱుకర్తల కార్యములని తోఁచవచ్చును. కాని యీ తోఁచుటసత్యముగాదు. బ్రతికించుట చంపుట యను నీరెండు కార్యములకును విస్తారము భేదముగలదు. ఇందువలన బ్రతికించువాఁడొకఁడనియును జంపువాఁడొకఁడనియును దలంపవచ్చును. కాని యిది సత్యముగాదు. మన మాహారమును దిని బ్రతుకుచున్నాము. ఆహారమును మిక్కుటముగఁ దినిన యెడల రోగము గలుగును. రోగమువలన మరణము గలుగవచ్చును. తీపిపదార్థములు తినుటకు బాగుగనుండును. కనుక మితముగఁ దీపిపదార్థములను దినిన యెడల శరీరమునకు నుపకారము గలుగును. కాని మితము తప్పి తినినయెడల రోగమును

మరణమును గలుగును. స్నానము శరీరమునకు నారోగ్యమును గలిగించును. కాని మితిమీఱి స్నానముచేసినచో, జ్వరమును, దగ్గును, గలిగి మరణము సంభవించును. కనుక నొక వస్తువు నందే శరీరమును రక్షించుగుణమును నాశనముచేయు గుణము ను నిమిడియున్నవి. ఒకవస్తువునే నియమితముగ వాడుకొనిన నుపకారమును, నియమముదప్పి వాడుకొనినచో నపకారమును, గలుగును. ఇందువలన నొక యీశ్వరుఁడు బ్రతికించి రక్షించు చున్నాఁడనియును నింకొక యీశ్వరుఁడు రోగములు గలిగించి చంపుచున్నాఁడనియును భావించుట కేవిధమగు కారణముగా స్ఫురింపదుగదా? ఏవస్తువు తనంతటఁ దానుగఁ బనిచేయదనియు ను నీశ్వరుఁడు సమస్తవస్తువులను నడిపించుచున్నాఁడనియును మీఁదివఱకే గ్రహించియున్నారు. ఒక వస్తువును మితముగ వాడుకొనినయెడల శరీరరక్షణమును, మితము దప్పివాడుకొనిన యెడల రోగమును మృత్యువును గలుగుననియును దెలిసికొని యున్నాము. ఇందువలన నాయన మనలను బ్రతికించుచున్నాఁ డనియును, అనియమముగఁ బ్రవర్తించినచో నాయనయే రోగ మును మృత్యువును గలిగించుచున్నాఁడనియును దెలిసికొనవల యును. నిప్పువలనమన మెట్టియుపకారమును బొందుచున్నార మోచూడుఁడు. నిప్పునందుఁదగులఁబెట్టు గుణముగలదు. నిప్పు నందుఁ దగులఁబెట్టు గుణముండుటవలననే భోజనపదార్థములను పచనము చేసికొనుచున్నాము. కాని కొంచెమజాగ్రత్తగ నుం డినచో నీతగులఁబెట్టుశక్తి వలననే మన శరీరమంతయును దగులఁ బడిపోవును. కాని నీశ్వరు లిద్దఱని, లేక, దేవతలిద్దఱని తలం చుటవలనఁ బ్రయోజనము లేదుగదా? ఎందువలన ననఁగా,

నేఁడు నిప్పుతోడఁ గార్యములను జేయుచున్నాఁడో యాతఁడే భోజనపదార్థముల నుడుకునట్లు చేయుచున్నాఁడు. అజాగ్రత్తగనుండినచో మన శరీరమును గృహమును గ్రామమును బట్టనములను గూడఁ దగులఁబెట్టుచున్నాఁడు. "నిప్పువేసి నఁదగులఁబడుము" అను నియమము నెప్పుడును నాయన భంగపఱుపఁడు.

ఇంకను జూడుము! బద్ధకము నొందినావనుకొనుము. అందువలన నెక్కువ నిదురను బోయియుందువు. కనుక నీవు ప్రాతఃచదువులయందు మనసు పోనుగదా! ఇందువలన మనసు చెడుటయే కాక శరీరముకూడఁ జెడును. ఉదయముననే నిదురలేచుటకు బద్ధగించినావనుకొనుము. ఈబద్ధకించుటయే మనోదోషము. ఈ మనోదోషమునకే నీవు లోఁబడినయెడల నెనిమిది గంటలకు నిదుర లేచెదవు. ఎనిమిది గంటలకు నిదుర లేచుట వలన మనోమాంద్యముగలుగును. మఱియును, ప్రాతఃకాలమందలి నిర్మలవాయు సేవనము లేనందు వలనను, బయలుఁ గొంచెము దూరమైనను నడువనందువలనను నీ శరీర మనారోగ్యమును బొందును. ఇందువలనఁ జదువుకొనుటకుఁ గాలముచాలక చదువు వెనుకఁబడును. తిన్నగాఁ జదువనిచో దల్లి, తండ్రియు, నుపాధ్యాయుఁడు మొదలగువారు తిరస్కరింతురు. తోడి విద్యార్థులలోఁ దలవంపులగును. కనుక యోజించి చూచినయెడల మనలోపలనున్న మన తెలివికి నెట్టి సంబంధము గలదో తెలిసికొనఁ గలుగుదువు. మనస్సునందొక పాపమును వృద్ధిబొందించుకొనుటవలనఁ బయటకూడ నెంతకష్టమును బొందుచున్నామో చూడుము. ఎవఁడు వివేకము వలన

మనలను శాసించుచున్నాఁడో యాయనయే బయటి కార్యములనుగూడఁ జేయుచున్నాఁడని ద్వితీయపాఠమునఁ జదివిన వాక్యములను మఱింత స్పష్టముగఁ దెలిసికొనుటకుఁ బ్రయత్నింపుఁడు. మనస్సునందలి యాయన యిచ్ఛనువినిన మొదలనాయన మనకులోపలను వెలుపలను దగు ఫలమును గలిగించును. మనస్సునందు లోభమునకు స్థానమిచ్చినను కోపమును వృద్ధిఁబొందించుకొనినను, నసత్యమును బలుకవలయునను కోరిక గలిగిన కొలఁది నసత్యమాడినను జనువుట కశ్రద్ధచేసిన నేమగునో భావించిచూడుము. ఎవఁడు పాపకార్యములు చేయఁగూడదని మనస్సునందు నిషేధించియున్నాఁడో యెవఁడు పుణ్యకార్యములు చేయ నాజ్ఞాపించియున్నాఁడో యాతఁడే పాపపుణ్యములకుఁ దగుఫలములను బయటనే యిచ్చుచున్నాఁడనియును విస్పష్టముగఁ దెలిసికొనుఁడు.

దూరమునను, సమీపమునను, లోపలను వెలుపలను నీశ్వరుఁడొకఁడే కార్యములను జేయుచున్నాఁడని యోజించి చూచినకొలఁదిని స్పష్టముగఁ దెలిసికొనుచుందుము. సూర్యుఁడు, చంద్రుఁడు, పృథివి, మేఘములు, వాయువు, అగ్ని, జలము, వృక్షములు, లతలు, ప్రాణులు, ధనము, విద్య, సుఖము, దుఃఖము, జీవితము, మరణము, మొదలగున వన్నియును బరమేశ్వరుని యధీనములు. ఆయన యొకఁడే జగత్తునకు రాజు, నేత, కర్తయయియున్నాఁడు.

ప్రశ్నలు.

౧ శరీరమునకును వాయువునకునుగల సంబంధమెట్టిది? ఈ సంబంధమువలన మనమేమి తెలిసికొనుచున్నాము?

౨ మనశరీరమును పొలముల యందలి సస్యములును నొక్కనియొక్క కార్యములేయని గ్రహింపనగు విధమెద్ది?

౩ సూర్యునకును భూమికిని సృష్టికర్త యొకఁడని గ్రహించుటెట్లు?

౪ ఈశ్వరుఁడు జన్మమరణములకుఁ గర్తయని తెలిసికొను విధమెద్ది?

౫ ఎవఁడు మనమనస్సునందుఁ బాపములు చేయఁగూడదని నిషేధించి యున్నాఁడో యతఁడే పాపకార్యములకు మనవలననే దండనను విధించుచున్నాఁడను దానిని సయుక్తి ప్రమాణముల వలన ఋజువుపఱుపుము.

౬ ఎవఁడు పుణ్యకార్యములు చేయ నాజ్ఞాపించి యున్నాఁడో యతఁడే పుణ్యకార్యములకుఁ బ్రతిఫలము నిచ్చునను నంశము సయుక్తి ప్రమాణముల వలన బోధపఱుపుము.

పంచమ పాఠము — ఈశ్వరుఁడు నిరాకారుఁడు

నీవీపుస్తకమును జూచుచున్నావు. కనుక నీవు చూచువాఁడవును (ద్రష్టవు) పుస్తకము చూడఁదగినది, (దృశ్యము) నగుచున్నది. ఇందువలన నీవు పుస్తకముగావు. పుస్తకము నీవును గాదు. అని స్పష్టముగఁ దెలిసికొనుము. నీవు నీయొక్క కాలు ముక్కు ముఖమును జూచుచున్నావు. ముట్టుకొనుచున్నావు. కనుక నీవు జ్ఞాతవు. వస్తు సముదాయము జ్ఞేయము. ఇందువలనఁ గాలు ముక్కు ముఖమును నీవుగావనియును నీవు కాలు ము

క్కు ముఖమును గావనియును దెలిసికొనుము. నీశరీరమును నీవు దెలిసికొనుచున్నావు. గాని నీ శరీరము నీవుగాదు. నలుదిశల యందలి వస్తువులను నీ శరీరము నెవఁడు చూచుచున్నాఁడో వాఁడేనీవు. ఏవస్తువులను నీవుదెలిసికొనుచున్నావో యవి నీవు గావు. ఏది దెలిసికొనుచున్నదో యదినీవు. తెలిసికొనుటకు నీకు ముక్కు ముఖము కన్నులు మొదలగునవి యంత్రముల వంటివి. ఎవఁడు వినుచున్నాడో యెవఁడు చూచుచున్నాడో యెవఁడు ముట్టుకొనుచున్నాఁడో యెవఁ డాస్వాదనము చేయుచున్నాఁడో యెవఁడు పీల్చుచున్నాఁడో వానిని జూడఁజాలము. ముట్టుకొనఁ జాలము.

నీవు, పొడుగు, వెడల్పు, మందము, పెద్ద, చిన్న, వస్తువులను జూచుచున్నావు. కాని, శరీరములోపల నుండు నీవు పలువిధము లగు నాకారములు గల వస్తువులను చూచుచున్నను శరీరములోపల నుండు నీవు పొడుగునుగావు. పొట్టిదియునుగావు. ఏవస్తువున కాకారము లేదో యావస్తువును నిరాకారమందురు. చూచుదానిని, వినుదానిని, గ్రహించుదానిని నాత్మయని చెప్పుచున్నాము. "ఆత్మ" యనగా "నేను" నని యర్థము. అందువలన "నాయాత్మ" యనువాక్యము భ్రమతోఁ గూడుకొన్నది. ఏదువలన ననగా, "నాయాత్మ" యనగా "నా యొక్కనే"ని యర్థమగును. అందువలన నాయాత్మయని చెప్పినచో నసంగతశబ్దమును జెప్పినవారమగుదుము. సకల జీవుల శరీరములయందున్న యాత్మవస్తు వెట్టిదియో భావించిచూడుడు. ఏది చూచుచున్నదో వినుచున్నదో గ్రహించుచున్నదో పనిచేయుచున్నదో శరీరమును నడపించుచున్నదో దానినే మన

మాత్మయని చెప్పుచున్నాము. ఆత్మ యచేతన వస్తువులవలెఁ బొందుగుగాదు. పొట్టియునుగాదు. పెద్దదిగాదు. చిన్నదియును గాదు. ఎఱ్ఱనిదిగాదు. నల్లనిదియునుగాదు. అనఁగా నీవస్తువునకు నాకారము లేదనియును "నిరాకారము" అనియునుఁ జెప్పినఁ జాలును. కాని కన్నులతోడఁ జూచుటకును జెవులద్వారమున వినుటకును, నేయింద్రియము ద్వారముననయినను దెలిసికొనుటకు వీలుగాని "ఆత్మ"ను మనము స్పష్టముగఁ దెలిసికొనఁ గలుగుచున్నాము. దీనిని జూడలేనిమాట సత్యమేకాని యిది చూచుచున్నది. ఇదియే చూచుట యనుక్రియకుఁ గర్త్రియై యున్నది. దీనిని వినలేనిమాట సత్యమే కాని యిది వినుచున్నది. ఇందువలన నిదివినుట యనుక్రియకుఁ గర్త్రియై యున్నది. ఇది కాళ్లు చేతులువలె నడచుట కదలుట లేదుగాని, యిదియే కాళ్లు చేతులను నడిపించుచున్నది, కదలించుచున్నది. ఇదియే సకార్యములకుఁ గర్త్రియై యున్నది. ఇందువలన నాత్మను జూడఁజాలము, వినఁజాలము, పట్టుకొనఁజాలమను మాట వాస్తవమేకాని యాత్మచూచునప్పుడు వినునప్పుడు పట్టుకొనునప్పుడు తన్నుఁదానే తెలిసికొనుచున్నది. ఆత్మనింద్రియముల ద్వారమునఁ దెలిసికొనఁజాలని మాట వాస్తవమేకాని, ప్రజ్ఞద్వారమునఁ గాని, యాంతరదృష్టి వలనఁగాని, దెలిసికొనఁ గలుగుదుము. అనఁగా వాత్మతన ప్రజ్ఞద్వారమునఁ దన్నుఁ దెలిసికొనుచున్నది. తాను జ్ఞాతయనియును గర్త్రియనియును దెలిసికొనుచున్నది.

ఈశ్వరుఁ డెటువంటి యాత్మయో దానిని మనము సహజముగ గ్రహింపఁగలుగుదుము. ఆయన మనలనెప్పుడు దెలిసికొనుచున్నాఁడో ప్రపంచములోని వస్తుసముదాయము నెప్పుడు

తెలిసికొనుచున్నాడో యెవ్వఁడు జగత్సముదాయమును సృష్టించి నడిపించుచున్నాఁడో యెవ్వఁడు జ్ఞాతయును గర్తయునగుచున్నాఁడో యప్పుడాయన యాత్మయని చెప్పుట కణుమాత్రమైనను సందియము లేదుగదా? ఎప్పుడాయాత్మ నిరాకారమో యప్పుడీశ్వరుఁడును నిరాకారుఁడని తెలిసికొనుచున్నాము. ఈశ్వరుఁడు చెట్టుపుట్ట శరీరములవంటి వాఁడుగాఁడు. రాయి లేక మట్టిబొమ్మలవంటి వాఁడునుగాఁడు. ఆకాశమువలె శూన్యుఁడునుగాఁడు. ఆయన జ్ఞానవంతుఁడును దయావంతుఁడును బవిత్రుఁడును గర్మశీలుఁడును నగు నాత్మ. ఆయనయన్నిటికంటె శ్రేష్ఠుఁడు. ఆయనకు సమస్తము దెలియును. మఱియు నాయన జగత్తునకుఁ గర్త. ఇందువలననే యాయనను "పరమాత్మ"యని చెప్పుదుము. లేక శ్రేష్ఠాత్మయని చెప్పినను జాలును. జ్ఞానమును బలము నల్పముగఁ గలిగిన నీవు నేను వాఁడు మొదలుగాఁగల యాత్మలను జీవాత్మలని చెప్పుదురు. జీవాత్మయును బరమాత్మయును నిరాకారమనుమాట సత్యమేకాని యొకవిషయమున మాత్రము రెంటికిని కొంచెము భేదముగలదు. మనమీభేదమును దెలిసికొనుట యావశ్యకము. ఏ మనుజుని పేరు చెప్పినను వెంటనే యామనుజుని శరీరమును భావించుటయేకాక, శరీరమును భావించుటతోఁగూడ శరీరాంతర్గతమైన యాత్మనుగూడ భావించుచుందుము. ఇందువలన వాని శరీరమాత్మగాదనుట స్పష్టమేకదా? ఎందువలన ననఁగాఁ జూచుట వినుట గ్రహించుట పనులుచేయుట మొదలగు కార్యములను శరీరము చేయఁజాలదు. ఆత్మయే యీ కార్యములన్నిటిని చేయును. కనుక జీవాత్మ వినుటయును జూచుటయును గ్రహించుటయును

కార్యములఁ జేయుటకును శరీరమును యొక్క సహాయమును బొందుచున్నది. కన్నులు చూడలేవు. గాని, కన్నులద్వారమున జీవాత్మ చూచుచున్నదనుట నిస్సంశయము. మరణించినప్పుడు జీవాత్మ శరీరము వదలును. అప్పుడు కన్నులు కొంచెమైనను జూడఁజాలవుగదా? చెవులు వినఁజాలవుగదా? ఇందువలన జూచుట, వినుట, ముట్టుకొనుట, పనిచేయుట, కన్నులయుఁ జెవులయుఁ జేతులయుఁ గార్యములు గావనియు నాత్మచేయుచున్న కార్యములనియును స్పష్టపడుచున్నది. ఆత్మ శరీరమునం దెంత కాలముండునో యంతకాలమును గన్నులద్వారమునఁ జూచును. చెవులద్వారమున వినును. చేతులద్వారమున స్పృశించును, పని చేయుచుండును. అనగా జీవాత్మ శరీరము ద్వారమున ననేక కార్యములను చేయుచున్నదని చెప్పఁజాలును.

జీవాత్మకు శరీరము లేనిమాటసత్యమే కాని యొక్కొక జీవాత్మ యొక్కొక శరీరముద్వారమున నెప్పుడు పనిచేయుచున్నదో యప్పుడు మనుష్యుని యొకయర్థమున సాకారుఁడని చెప్ప వచ్చును. సాకారమగు శరీరము నాశ్రయింపక నిరాకారజీవాత్మ యనేక కార్యములను జేయఁజాలదు.

కాని యీశ్వరుని సాకారుఁడని చెప్పుటకు వీలులేదు. ఎందువలన ననఁగా, నాయన చూచుచున్నాఁడుగాని, యాయనకుఁ గన్నులు లేవు; కన్నులు లేకుండఁగనే యాయన చూడఁ గలఁడు. ఆయన వినుచున్నాఁడుగాని యాయనకుఁ జెవులు లేవు. చెవులు లేకుండఁగనే యాయన వినఁగలడు. ఆయన మనలోపలను వెలుపలను గార్యములను జేయుచున్నాఁడు. కాని యాయనకుఁ జేతులు లేవు? యాయన చేతులు లేకుండఁగనే సమస్తకా

ర్యములను జేయఁగలఁడు. ఆయనకు శరీరమే యున్న పక్షమున దప్పక దానిని మనము చూడఁగలిగియే యుందుము. ఎప్పుడు మనమాయన శరీరమును జూచుటకు వీలు లేదో యప్పుడాయనకు శరీరము లేదనుట స్పష్టము. ఆయన మన మనస్సులోని మాటలను గ్రహించుచున్నాఁడనియును రక్తము మాంసము జీర్ణయంత్రము మొదలగు మనలోని యంగములను గూడఁ జూచుచున్నాఁడనియును మీరు ప్రథమ ద్వితీయ పాఠముల యందుఁ జదివియున్నారు. ఈసమస్త వస్తువులను జూచుటకు నాయనకుఁ గన్నులే యావశ్యకమయిన యెడల నప్పుడీ సమస్తవస్తువుల వెంట నాయనకన్నులు కనుపడవలయును. ఎప్పుడాయన కన్నులను మనము చూచుటలేదో యప్పుడాయనకుఁ గన్నులు లేవనియును నాయనకుఁ గన్నులయొక్క ప్రయోజనము లేదనియును జెప్పుటకు నిస్సంశయము. ఆయన గాలిని వీచునటులు చేయుచున్నాఁడు. అగ్నిని మండునటులు చేయుచున్నాఁడు. ఈ కార్యములు చేయుటకాయనకుఁ జేతులావశ్యకమయినచో నీవస్తువుల వెనువెంట నాయనచేతులును గనుపడుచుండెడివి. కాన నాయనచేతుల నెప్పుడు చూచుటలేదో యప్పుడాయనకుఁ జేతులు లేవనియును నాయనకుఁ జేతులవలనఁ బ్రయోజనము లేదనియును, జేతులు లేకుండఁగనే యీ సకల కార్యములను జేయఁగలిగి యున్నాఁడనియును దెలిసికొనుచున్నాము.

ఆయన కాళశరీరముగలదనియు నాశరీరమును మనము చూడలేమనియు నెవరయినను జెప్పవచ్చును. శరీరమున్నచో నాశరీరమునకు వెడల్పు పొడవు పొట్టి మొదలగు పరిమాణము

లును, హద్దునుండవలయును. నీ శరీరము నీ యింటియందున్నప్పుడు పాఠశాలయందుండదుగదా. ఇందువలన నీశ్వరుఁడు భూమియందున్నప్పుడు సూర్యునియందు లేఁడనియును, సూర్యునియందున్నప్పుడు భూమియందు లేఁడనియును, జెప్పవలసివచ్చును. ఈశ్వరున కొక శరీరముగలదని భావించినచో యీశ్వరుఁడొక పరిమితవస్తువయగును. మనకంటె బాలపెద్దవస్తువయనుమాటయేకాని, యనంతుఁడుగాఁడు పోవును. బాగుగ విచారించి చూచినచో మనలోనున్న, నీశ్వరుని భావమనంత భావమని స్పష్టముగఁ దెలియును. ఎవఁడనంతుఁడో వానికి నాకారము సంభవింపదు.

మనము మనుష్యుని భావించుటకు మొదలిడి వాని శరీరమును భావింతుము. ఈశ్వరుని భావించుటకు మొదలిడి వాని శరీరమును భావించుట యుచితముగాదు. ఎందువలన ననఁగా, నాయనకు శరీరము లేదు. కాని యాయనను భావించుటకు మొదలిడి మనము సమస్త ప్రపంచమును భావింతుము. ఏల యన నీ సమస్త ప్రపంచమునందును నాయన కార్యములను జేయుచున్నాఁడుగదా. ఆయన విషయములను భావించుటకు మొదలిడి మన రక్తప్రవాహవిషయమును భావింపవలయును; మన శరీరముయొక్క రక్షణవిషయమును భావింపవలయును; మన శరీరాభివృద్ధి విషయమును భావింపవలయును; సూర్యుని విషయమును భావింపవలయును మేఘముల విషయమును భావింపవలయును; గాలి విషయమును భావింపవలయును. ఏలయన నీశ్వరుఁడీ సముదాయ కార్యములలోఁ బనిచేయుచున్నాఁడు. కాని యీ సకలవస్తువుల సహాయముసొందక యీశ్వరు

ము పనిచేయఁజాలఁడని భావింపఁగూడదు. ఆయన నిరాకారాత్మ యనియును సమస్త వస్తువులయం దున్నాఁడనియును సమస్తమును దెలిసికొనుచున్నాఁడనియును సమస్తమును నడిపించుచున్నాడనియును దెలిసికొనవలయును.

ప్రశ్నలు.

౧. శరీరమునకు నాత్మకును గలభేదమును దెలిసికొనువిధ మెద్ది?

౨. సాకార మన నేమి? నిరాకార మన నేమి?

౩. ఆత్మ యని దేనినందురు?

౪. ఆత్మను జూడఁజాలనప్పు డాత్మగలదని తెలిసికొనువిధ మెద్ది?

౫. ఈశ్వరుఁడు నిరాకారుఁడని తెలిసికొనువిధ మెద్ది?

౬. ఈశ్వరుని పరమాత్మయని యేల పిలువవలయును?

౭. జీవాత్మ యనఁగా నర్థమేమి?

౮. మనుష్యుని నేయర్థమున సాకారుఁడని చెప్పనగును?

౯. ఆయర్థమున నీశ్వరుని సాకారుఁడని చెప్పవచ్చునా? చెప్పగూడదా?

౧౦. ఈశ్వరుఁడు సాకారుఁడు గాఁడని బోధపఱచుము.

పక్షపాతము. ఈశ్వరుఁడు దయామయుఁడు.

మీరు ప్రథమపాఠమునం దీశ్వరుని దయాసంబంధమున జదివియున్న దానిని జ్ఞప్తికిఁ దెచ్చికొనుఁడు. ఈశ్వరుని దయామయుఁడని యెటులు తెలిసికొనఁ గలుగుదుము? ఆయన మనుష్యులను ప్రేమించునా? ఈశ్వరుఁడు మనకొసంగినను వివేకము మూలమున "మనుష్యులను ప్రేమించుట యుచితము" అని తెలియఁ జేయుచున్నాఁడు. ఆయన మన మనస్సునందు సర్వదా దయమీఁద శ్రద్ధను నిర్దయమీఁద నశ్రద్ధను గలిగించుచున్నాఁడు. తలిదండ్రులు మనలను ప్రేమింతురు. అందువలన దల్లిదండ్రులమీఁద మనకు శ్రద్ధయుండును. వారు చాల మంచి కార్యములను జేయుచున్నారని మనకు వివేకము చెప్పును. ఎవఁడు సర్వదా యితరులమీఁదఁ గోపమును గలిగియుండునో, ఇతరులను దిట్టుచుండునో యితరుల కపకారము చేయుచుండునో వానిమీఁద మన మశ్రద్ధను జూపుదుము. వివేకము మనుష్యుఁడు గొప్ప యన్యాయకార్యమును జేసినాఁడని చెప్పును. బీదవాండ్రకును బిచ్చగాండ్రకును దయతో నిచ్చువానిని మంచివాఁడని చెప్పుదుము. బీదవాండ్రను, బిచ్చగాండ్రను నిర్దయతో వెళ్ళఁగొట్టువానిని దుష్టులని చెప్పుదుము. మనము తలిదండ్రులను ప్రేమతోఁ జూచుచు, వారితో మృదుమధుర వాక్యములఁ బల్కుచు, సంతోషముతోడ వారి వాక్యములను వినుచు రోగసమయములందు వారికి సేవాకృతజ్ఞతలను జూపుచుండినచో వివేకము బాగు, బాగని చెప్పును. ఇదేవిధముగఁ దమ్ములను జెలియండ్రి నాదరముతోడఁ జూచుచు, భోజనముఁ

బెట్టి స్నానము చేయించి, పూలనిచ్చి, పాఠములు చెప్పుచుండు నప్పుడు, దయతోఁగూడిన నీకార్యములు, బాగున్నవి బాగున్న వని వివేకము నుడువును.

అప్పుడప్పుడు మనమనస్సు చెడుచుండును. అట్టిసమయమునఁ దలిదండ్రులతోఁ గోపమున మాట్లాడుదుము. వారి మాటలను వినము. వారికి శుశ్రూషలు చేయక యామోదములగు విషయములయందు, లేక మాటలయందు బ్రవేశింతుము. ఇంతియకాక, తమ్ములతోడను జెలియండ్రతోడను గఠినముగ మాట్లాడుదుము. వారి విషయమునఁ దగినంతశ్రద్ధను దీసికొనక వంకలు పెట్టుదుము. వారిభోజనము, చదువు, దేహపరిశ్రమ మొదలగువానియందు మనమ్మంచక యామోదప్రమోదములయందు మునిఁగి సంతుష్టిని బొందుచుందుము. కాని యప్పుడప్పుడు మన మీవిధమగు కార్యములను జెడుకార్యము లని స్పష్టముగఁ దెలిసికొనఁ జాలకపోయినను గొన్ని నిముసముల తర్వాతనయిన నీ కార్యములు చెడుకార్యములని వివేకము మనకు స్పష్టముగఁ జెప్పును. అప్పుడు మన మీవిధమగు నిర్దయ కార్యముల నేలచేసితిమని విచారింతుము, మఱియును నిర్దయ కార్యములపై నేవగలుగును. ఇందువలనఁ బరమేశ్వరుఁడు "దయ యుత్కృష్టవస్తువు, నిర్దయ హేయమగువస్తువు" అని వివేకము వలన మనకుఁ దెలియఁ జేయుచున్నాఁడు.

వివేకము ఈశ్వరుని యొక్క శక్తి. అందువలన డెట్టివాఁడో యాయన స్వభావ మెవిధముగ నుండునో మనము తెలిసికొందుము. ఆయన యెప్పుడు వివేకమువలన మనకు, దయ శ్రేష్ఠమగు వస్తువు నిర్దయ హేయమగువస్తు వని స్పష్టము

గఁ దెలియఁ జేయుచున్నాఁడో యప్పు డాయన దయామయుఁ డ
నుటకు నిస్సంశయము. ఆయన నిర్దయను హేయముగఁ జూచు
నని మనము బాగుగ గ్రహించితిమి. దయమీఁద శ్రద్ధను
నిర్దయమీఁద నశ్రద్ధను గలుగఁ జేయుచున్నవాఁడు నిశ్చయ
ముగ దయామయుఁడు. ఎవఁడయినను మనలను నిందించినగాని
మనవస్తువులలో దేనినయినను దొంగిలించినఁగాని, మన యా
మోదమునకు భంగము గలిగించినఁగాని, వానిమీఁద మన
కప్పుడప్పుడు విస్తారము గోపము వచ్చుచుండును. కాని మనము
వాని పనినిమాత్రమే యసహ్యించుకొనుట యుచితముగాని
యామనుష్యుని గూడ నసహ్యించుకొనుట యుచితముగాదు.
వాఁడును మనవంటి మనుష్యుఁ డనియును, ఈశ్వరుని సంతాన
మనియును, మనసోదరుఁ డనుసంగతిని మనము మఱచి
పోవుచుందుము. ఇందువలననే వానికి నయుక్తములగు కార్య
ములను యోజనలను జేయుచుందుము. మన జ్ఞానము మనోబల
మల్పమయిన కారణముననే యీవిధముగఁ జేయుచుందుము.
కాని యీశ్వరుఁడు సమస్తమును దెలిసికొనును. ఆయన కొంచె
మైనను భ్రమపడఁడు. ఆయన బలమునకుఁ గొంచెమైనను లోటు
లేదు. అందువలన నాయన మనమువలెఁ గోపమును గలిగి
యుంట యసంభవము. ఆయన కేమియును నభావము లేదు.
మనమువలె నాయన యామోద ప్రమోదముల కొఱకు నాతు
రుఁడై యుండఁడు. ఆయన కెవరు నష్టమును గలిగింపఁజాలరు.
తన యిచ్ఛానుసారము మనుష్యుఁడు ప్రవర్తింపనిచో దనయిచ్ఛా
నుసారము ప్రవర్తింప వలయునని వివేకమువలన దెలియఁజే
[illegible] మనుష్యుఁ డావిధముగఁ బ్రవర్తింపనిచో, నాయన

నేవిధమగునష్టమును లేదు. కాని యందువలన మనుష్యునకు మాత్రము నష్టము గలుగును. మనకు నష్టమును గలిగించు వానిమీఁదఁ గోపము చూపువిధమున నీశ్వరుఁడు మనమీఁదఁ గోపమునుజూపఁడు. మనుష్యుఁడు పాపకార్యములను జేసినను మనుష్యుఁడు తన సంతానమును మాట నెప్పుడును మఱచిపోఁడు. మనము మనుష్యుల నన్ని సమయములయందును జూచుచుండ లేము. ఏలయనఁగా మనుష్యుఁ డొంటరిగ నుండవచ్చును. ఒక మనుజుఁ డొకస్థలమున, నింకొక మనుజుఁడింకొక స్థలమున నుండవచ్చును. ఇందువలన నొకమనుజుని యింకొక మనుజుఁడు మఱచి పోవచ్చును. కనుక మనుజుఁడు సర్వకాలముల యందును మన మనస్సునందుండఁడు.

కాని యీశ్వరుఁడు సకల శరీరములయందును మనస్సులయందును నున్నాఁడు. మనలను బ్రతికించుచున్నాఁడు. మనలను సర్వదా రక్షించుచున్నాఁడు. ఏపనియందును మనలను మఱచుటలేదు. మనము పాపకార్యములను జేసినను మన మాయన సంతానమను మాటను మఱచిపోవువాఁడుగాఁడు. ఆయన యెప్పుడును మనకు నష్టమును గలిగించు యోచనను జేయఁడు. ఎప్పుడును నష్టమును గలిగింపఁడు. అపుడపుడు మనము మనుజులమీఁద నిర్దయను జూపించుట నష్టమును గలిగించుట సత్యమే కాని, యిదిమన యజ్ఞానఫలము, దుర్బలతాఫలము. సంపూర్ణజ్ఞానమును, సంపూర్ణ బలమునుగల యీశ్వరుఁడు నిర్దయుఁడగుటకు వీలు లేదు.

ఈశ్వరుఁడు ప్రేమించునని యాయనచేయు కార్యముల వలన మనము స్పష్టముగ గ్రహింపఁగలుగుదుము. తలిదండ్రు

రు మనలను ప్రేమించుచున్నారని మన మెట్లు గ్రహింపఁగలుగుదుము? తలిదండ్రులు మన కన్నముఁ బెట్టుదురు. వస్త్రము లిత్తురు, బొమ్మల నిత్తురు, పటము లిత్తురు, పుస్తకము లిత్తురు, మనలఁ జదివింతురు, మనకు జబ్బు గలిగినప్పుడీ జబ్బు కుదురవలయునని, యీశ్వరుని యెదుటఁ బ్రార్థనఁ జేయుదురు. మనకు శుశ్రూష చేయుదురు. ఈకార్యములనన్నిటిని జూచి వారు మనలను ప్రేమించుచున్నారని తెలిసికొందుము. వారు మంగళకరమగు పనులు చేయుటవలన మనలను ప్రేమించుచున్నారని స్పష్టముగఁ జెప్పినఁ జాలును. ఈశ్వరుఁడు సర్వదా మనకు మంగళమును గలిగించుచున్నాఁడు. మనకీ సంసారమునకేదేని ప్రయోజనమేమో యనఁగాఁ జూచుట వినుట నడచుట పనిచేయుట మొదలగు కార్యములు చేయుటకు తగు పట్టి యంత్రములతోడ మనల సృష్టించియున్నాఁడు. అనగాఁ గన్నులు, చెవులు, చేతులు, కాళ్లు, మొదలగువానిని నిర్మాణముచేసి మనలను సంసారమునకు దాగలందులకుఁగాను దయను చేసియున్నాఁడు. తల్లి గర్భమునం దతిజాగ్రత్తగ మనలను గాపాడియున్నాఁడు. పృథివికి రాఁగనే యాహారముగావలయును గనుక మనము రాక మునుపే మన తల్లిస్తనములయందుఁ బాలను బెట్టి యున్నాఁడు. సప్రయత్నముగ మనరక్షణము జరుగుటకు దలిదండ్రులకుఁ బుత్రవాత్సల్యమును గలిగించియున్నాఁడు. మనము పెద్దవారమయినను దలిదండ్రులకు మనపైని స్నేహము తఱుఁగదు. కనుకనే వారెల్లకాలమును మన మంగళములను జింతించుచుందురు.

ఈశ్వరుఁడు ఫలములను, ధాన్యములను, ప్రత్తిని బుట్టు నటులచేసి మనుష్యుని హృదయమున, వంట వస్త్రములు, తయారు చేసికొను బుద్ధిని బుట్టించియున్నాఁడు. ఇందువలన, మనము వస్త్రములను నాహారమును బొందుచున్నాము. ఆయన మనశరీరము బలముగ నుండవలయునని మాత్రమే భావింపలేదు. కనుక మనము సుఖమును బొందుటకుఁ దినుపదార్థములయందెంతో మాధుర్యమును బ్రసాదించియున్నాఁడు. వృక్షములు లతలు నాకాశము పశువులు పక్షులు మొదలగు వానికెట్టి సుందరవర్ణములను బ్రసాదించియున్నాఁడో చూడుము. మన జ్ఞానవృద్ధికొఱకును గురువులకు జ్ఞానశిక్షనిచ్చు శక్తి నిచ్చియున్నాఁడు. చిత్రకారులకుఁ జిత్రములు వ్రాయుశక్తి నిచ్చియున్నాఁడు. మనము ధార్మికులము గావలయునని సర్వదా వివేకమువలన ధర్మాధర్మములను బోధించుచుండుటయే కాక ధర్మోపదేశములను జేయుశక్తిని తల్లి తండ్రి గురువు ఉపాధ్యాయుఁడు మొదలగు వారలకుఁ బ్రసాదించియున్నాఁడు. మన మితరులను బ్రేమించుచు నితరుల ప్రేమకుఁ బాత్రులమగుచు సుఖులముగా నుండుటకు మనహృదయములు కోమలములగుటకును బ్రేమయభివృద్ధి నొందుటకును, దల్లి, తండ్రి, యన్న, తమ్ముఁడు, అక్క, చెల్లెలు, బంధువులు, మిత్రులు మొదలగువారిని మనకుఁ బ్రసాదించుటయే కాక దీనులమీఁద దుఃఖులమీఁద దయను మనకుఁ బ్రసాదించియున్నాఁడు. కాఁబట్టి యీశ్వరుని దయావిషయములను బూర్తిగఁ జెప్పుట కెవరితరమగును? విచారించిచూచిన కొలఁదిని నాయన దయకు సీమలేదని తెలిసికొనుచుందుము. మన లోపలను వెలుపల నుండు గణనాతీతవస్తువు లాయన

పరిపూర్ణదయను బ్రకాశము చేయుటలేదా?

సూర్యచంద్రులు, మేఘములు, వర్షములు, వాయువు అగ్ని, భూములు, వృక్షములు, ఇండ్లు, స్వజనము, ఆహారవస్త్రములు, పుస్తకములు, ఉపాధ్యాయులు, ఆచార్యులు, సమాజము రోగములు, ఔషధములు మొదలగు కార్యములను భావించి చూచినచో నీశ్వరుఁడు మనల నెటులు ప్రేమించుచున్నాఁడో తెలిసికొనఁగలుగుటయే కాక సర్వదా మనకు మంగళమునే గూర్చుచున్నాఁడనియుఁ దెలిసికొందుము. ఆయనవలె మనవిషయమున శ్రద్ధపుచ్చుకొను వారెవరును లేరు. పరమోపకారులగు తల్లి తండ్రి బంధువులు స్నేహితులు మొదలగు వారలు గూడ నప్పుడప్పుడు మఱచిపోవచ్చును. మనలను విడిచిపోవచ్చును. రాత్రింబవళు లనుక్షణము లేక ముహూర్త కాలమైన నీశ్వరుఁడు మనలను విడిచియుండఁడు. ఆయన సర్వదా వెంటనంటియుండి మనలను రక్షించుచుండును. అందఱిప్రేమకంటె నాయనప్రేమ మనమీఁద నత్యధికము.

ఎవఁడు మంగళేచ్ఛను గలిగి మంగళకార్యములను జేయుచున్నాఁడో యతఁడు మనలను సర్వదా ప్రేమించుచున్నాఁడనుమాటను సులభముగ గ్రహింపఁగలుగుదుము. కాని యీ వాక్యముతోఁడ నింకొకవాక్యమును మన మనమునం దుంచుకొనుట యావశ్యకము. చేదుమందును దినుట కష్టముగదా. కష్టమైనను దీనిని దినుటవలన మనకు మంగళముగలుగును. ఇందువలన సుఖముమాత్రమే మంగళకరముగాదనియు నప్పుడప్పుడు దుఃఖముగూడ మంగళకరమనియుఁ దెలిసికొనవలయును. కేవలము సుఖమును గలిగించుటవలననే ప్రేమ ప్రకాశమగున

నుటకువీలులేదు. అప్పుడప్పుడు దుఃఖమును గలిగించుటవలనను ప్రేమ ప్రకాశమగుచుండును. మనతల్లి మంచిఫలములను మంచి వస్త్రములను మనకిచ్చునప్పు డేవిధముగఁ బ్రేమ ప్రకాశమగుచుండునో యదేవిధముగఁ జేఁమమాను లిచ్చినప్పుడును, తప్పుకార్యములుచేసిన దండించునప్పుడును బ్రేమ ప్రకాశమగుచుండును. కాని యిట్టిసమయములలోఁ దెలివితక్కువబాలుఁడు సందర్భమును గ్రహింపఁజాలక తల్లినిర్దయను జూపించినదని తలంచును. మన మనేక సమయములలోఁ దెలివి తక్కువబాలుఁడు వలె యీశ్వరుని కార్యములను భావించుచుందుము. రోగము, లేక విపత్తులు గలిగించినచో మనపై నిర్దయఁజూపించుచున్నాఁడని తలంతుము. కాని యిట్లుపుమనుదలంచుట యుచితముగాదు.

ఎవఁడు నిర్దయ నసహ్యించుకొనునట్టులు మనలను బ్రేమించుచున్నాఁడో యతఁ డెప్పుడును నిర్దయుఁడగుటకు వీలులేదు. నిర్దయయనునది యాయనయందుండుట యసంభవమని సర్వదా జ్ఞప్తియందుంచుకొనవలయును. ఆయన మనమంగళార్థము సుఖదుఃఖములను గలిగించుచుండును. మన క్షేమంగళమును కూర్చుటకు నే దుఃఖమును బ్రసాదించుచున్నాఁడో మన మన్ని సమయములయందును గ్రహింపఁజాలము. కాని యొక్కొకప్పుడు గ్రహించుచుందుము. మన మప్పుడప్పుడు తలిదండ్రుల యుద్దేశములనే గ్రహింపఁజాలక పోయినప్పు డీవిశాల విశ్వమునకుఁ గర్తయగు వాని కార్యముల నభిప్రాయములను దెలిసికొనఁజాలకుండుటయం దాశ్చర్యమేమున్నది? ఆయన యేకార్యము జేయభిప్రాయమునఁ జేయుచున్నాఁడో దానిని జ్ఞానము వృద్ధియైన కాలఁదిని గ్రహింపఁగలుగుదుము. కాఁబట్టి మన

మాయన యభిప్రాయములను గ్రహించువఱకును, మనకు దయమీఁద శ్రద్ధను బుట్టించినాఁ డనియును నిర్దయమీఁద నశ్రద్ధను గలిగించినాఁ డనియును. క్షణ క్షణ మసంఖ్యోపకారములను జేయుచున్నాఁడనియును, దయామయుఁడు ప్రేమామయుఁడు మంగళమయుఁడు ననియును, విశ్వసించియుండుట యుత్తమము.

ప్రశ్నలు.

౧. దయ నిర్దయ విషయముల వివేక మేమి చెప్పుచున్నది?

౨. దీని కియుదుపమానములను జూపింపుము?

౩. ఈశ్వరుఁడు దయాళుఁడని తెలిసికొను విధ మెద్ది?

౪. మన మపుడపుడు మనుష్యులమీఁద దయను జూపుటకుఁ గల కారణ మేమి?

౫. ఇందువలన నేమి ప్రకాశమగును?

౬. ఈశ్వరుఁడు నిర్దయుఁడు గాఁడని తెలిసికొను విధ మెద్ది?

౭. మనల నీశ్వరుఁడు సర్వదా సంతానమని తలంచుచుండునని మన మెట్లు తెలిసికొనఁగలుగుదుము?

౮. మనుష్యుని ప్రేమ నెట్లు తెలిసికొనఁగలము?

౯. ఈశ్వరుని ప్రేమప్రకాశమానమగు నది కార్యములను జూపుఁడు.

౧౦. ఈశ్వరుఁడు మన జ్ఞాన ధర్మశిక్షలకొఱ కే కార్యములను జేయుచున్నాఁడో పదియుపమానములను జూపుఁడు.

౧౧. అందఱికంటెను నీశ్వరుని ప్రేమ యధికమని తెలిసికొను విధ మెద్ది?

౧౨. "అప్పుడప్పుడు దుఃఖమును గలిగించుటవలన నీశ్వరుని ప్రేమ ప్రకాశమాన మగుచుండును" అను దానిని నొకటి రెండుపమానముల మూలమున బలపఱుపుము.

౧౩. మనకీశ్వరుఁడేల దుఃఖమునుగలిగించుచున్నాఁడో దానిని సకల సమయములయందేల గ్రహింపఁజాలము?

౧౪. ఎప్పుడు దీనిని దెలిసికొనఁజాలమో యప్పు డీశ్వరుని దయావిషయమున నెట్లు భావించుట యుచితము?

సప్తమపాఠము. భక్తి

మనకుఁ దెలియని యనేకవిషయముల నుపాధ్యాయుని యొద్దఁ బ్రతిదిన మభ్యసించుచుందుము. అనఁగా ననేకశబ్దముల కర్థమును నేర్చుకొందుము. అనేక కథలు విందుము. అనేక దేశ చరిత్రలఁ దెలిసికొందుము. అనేకములగు లెక్కల నభ్యసింతుము. అనేక ధర్మసంబోధమగు వాక్యములను నేర్చుకొందుము. ఈవిధముగ నుపాధ్యాయునియొద్ద జ్ఞానలాభమును బొందుటవలన నుపాధ్యాయునిపై మన కెట్టి భావముండును? మనకుఁ దెలియని యనేక విషయముల నాయన దెలిసికొని యున్నాఁడనియు, అందువలన నాయన గొప్పవాఁడనియును మనము చిన్నవాండ్రమనియును దలంతుము. ఈ భావమునకే "భక్తి" యని చెప్పుదుము. నీతల్లి జబ్బువలన మంచమునుండి లేచుట లేదనుకొనుము. కొంచెము నీవు విసనకఱ్ఱతో విసరుమని నీతోఁ జెప్పినప్పుడు, నీవాటలయందు మత్తుఁడవై యుండి యామెమాటను

వినక లేక యొకటి రెండుమాటలు మాత్రము వినకట్లుగా విసరి యాటలకు వెళ్లితి వనుకొనుము. కాని నీ చెల్లెలాటలను మాటలను మాని యొక గంటకాలము నీతల్లి యొద్దఁగూరుచుండి వినవలెనో వినయముతో నీచెల్లిలిమీఁద నీకెటువంటి భావ ము దయించునో యోజించుకొనుము. నీ చెల్లెలు నీకంటె మంచి దని నీవు తప్పక తలఁతువు. కాఁబట్టి యామెవిషయమున నీకుఁ గల భావముపేరు భక్తి యందురు.

నీవును నీతోడి బాలుఁడును తరగతిగదిలో నాడుకొను నప్పుడు కిటికీ యద్దము బ్రద్దలైనదనుకొనుము. ఇట్టి కార్యమున కు నుపాధ్యాయుఁడు దండించునని నీవెఱిఁగియే యుందువు. అప్పుడు నీతోడిబాలునితో నీపని నావలన జరిగినదిగాదని చెప్పుద మని నీవు చెప్పినప్పుడు, నీతోడి బాలుఁ డబద్ధమును జెప్పుటకొక్క మాత్రమైనను సమ్మతింపక, "నేనబద్ధము చెప్పను. తప్పుపనిచేసి నప్పుడు శిక్షనుబొందుటయే యుత్తమము" అనుచు నుపాధ్యా యునితో నిజమును జెప్పినాఁడనుకొనుము. వానిపై నీకప్పుడు విరక్తి గలిగినఁ గలుగవచ్చునుగాని, నీవన్యాయమును చేసితి వనియును, నీతోడిబాలుఁ డుచితమగు కార్యమును జేసినాఁడని యును వివేకము చెప్పును. అంతట నీతోడిబాలునకు సత్యాశ నమధికము గనుక వాఁడు గొప్పవాఁడనియును నీవు తక్కువయని యును దెలిసికొందువు. కనుక వానియందు నీకుఁగల భావము పేరు భక్తి యందురు.

భక్తి యెట్టిదో దెలిసికొనుటకింకను బ్రయత్నింపుఁ డు. జ్ఞానమునందును, ధర్మమునందును, మనకంటె గొప్పవారి పైన మనకెటువంటి భావముండునో దానినే భక్తి యందురు.

"ఇతఁడు నాకంటె గొప్పవాఁడు" అనుమాట యెప్పుడును హృదయమునం దుండకపోవచ్చును. ఎవనికి ననేకవిషయములు దెలియునో యెవఁడువిస్తారముగఁ దెలిసికొనుటకుఁ బ్రయత్నించుచుండునో, యెవఁడు సత్యవాది, దయాళుఁడు, సాహసుఁడో యట్టివానిని, చూచినప్పుడుగాని, యట్టివాని చరిత్ర వినినప్పుడుగాని, వానియెడల మనకు భక్తి గలుగును. అతఁడు మనకంటె, శ్రేష్ఠుఁడా, నీచుఁడా, గొప్పవాఁడా, లేక కొలఁదివాఁడా యను సంశయము నన్ని సమయములయందును భావింపము. జ్ఞానము వలనఁగాని, చరిత్రవలనఁగాని, శ్రేష్ఠమానవునియెడల స్వభావసిద్ధముగ భక్తిగలుగును. భక్తిగలిగియుండుటయు నుచితము. భక్తిలేనివారికి ధర్మాధర్మజ్ఞానము లేదనికాని, లేక ధర్మాధర్మజ్ఞానమత్యల్పమనికాని, తెలిసికొనుఁడు. ధర్మాధర్మజ్ఞాన మున్నచో ధార్మికమానవులపైని భక్తి తనంతటఁ దానుగ నుదయించును. మనభక్తికిఁ బాత్రులగువారలు మనల నావరించియున్నారు. తల్లి, తండ్రి, అన్న, అక్క, తాత, అవ్వ, పినతండ్రి, పినతల్లి, పెదతల్లి, పెదతండ్రి, అత్త, మావ, తలిదండ్రుల స్నేహితులు మొదలగువారందఱును మనకంటె జ్ఞానవంతులు. ఎవరివ్యాసములు గ్రంథములు చదివి జ్ఞానమును ధర్మమును దెలిసికొనుచున్నామో వారును మనకంటె గొప్పవారు. ధార్మికజీవనుల చరిత్రములు మనకు భక్తిభాజనములు.

ఎవఁడీజగత్తునందలి సమస్తకార్యములను దెలిసికొనుచున్నాఁడో, యెవఁడీయాశ్చర్యకరమగు జగత్తును సృష్టించి రక్షించుచున్నాఁడో, యెవఁడు వివేకముచే ధర్మాధర్మములను దెలియఁజేయుచున్నాఁడో, యెవఁడెల్లప్పుడును మన మంగ

ఖార్థమై ప్రయత్నించుచున్నాఁడో యట్టిపరమేశ్వరుఁడు మన గభీరభక్తికిఁ బాత్రుఁడని సహజముగఁ దెలిసికొనఁ గలుగుదుము.

భక్తివలన మనస్సున కెట్టి యుపకారము గలుగునో భావించిచూతుము. ఉపాధ్యాయుని యధికజ్ఞానముఁజూచి భక్తి గనుపఱచుటవలన నట్టి యధికజ్ఞానమును సంపాదించవలయునను నిచ్ఛ గలుగును. నిజసుఖములను బరిత్యజించి పరసేవ చేయువాని మీఁద మనకు భక్తిగలిగినచో, నాయనవలె మనమును దయాశీలము గావలయునను నిచ్ఛమనకుఁగలుగును. నిజసుఖముల మఱచి పరసేవ చేయఁదలంతుము. శిక్షింపఁబడుదునని యెఱిఁగి యుండియు, నిజమునుజెప్పి నిజధర్మమును రక్షించుకొనిన సత్యవాదియు, సాహసియు నగు మనుజునిమీఁద భక్తిగలిగినచో, మనభీరుత్వము దూరమగును. సత్యముమీఁదఁ బ్రేమ హెక్కుటమగును. సత్సాహసము వృద్ధియగును. అనల్పజ్ఞానము, దయ, సాహసము, సత్యనిష్ఠ, ప్రేమ శీలత, సహిష్ణుత మొదలుగాఁగల సద్గుణములుగల వారిని జూచుటచేఁగాని లేక వారి చరిత్రలను జదువుటవలనఁగాని వారియందు మనకు భక్తియుదయించును. అందువలన మనమట్టి చరిత్రగలవాండ్రమగుదుము. ఇచ్ఛవలనను బ్రయత్నమువలనను మనచారిత్రము క్రమక్రమముగ నున్నతావస్థనుబొందును. సాధుపురుషుల సద్గుణములను వినక భావింపక చూడక వినియును వారియందు మనస్సునుజొప్పింపక భక్తికిఁ బాత్రమైన వారియందు భక్తిని జూపింపక, నింద హేళనము చేయువారలతి నీచస్వభావులనియును, వారతి నీచస్థితియందున్నారనియును, వారి చరిత్ర యున్నతిఁబొందదనియును దెలిసికొనవలయును.

ప్రశ్నలు.

౧. మనకంటె జ్ఞానాధికులెవరు? అట్టివారిమీఁద మన కెట్టిభావముండును? దీనిని యుపమానములతో బోధింపుఁడు.

౨. మనకంటె సత్యనిష్ఠయందెవ రధికులో యట్టివారి మీఁద మన కెట్టి భావముండును? ఇందుల కుపమానములఁ జూపుఁడు.

౩. భక్తియన నెట్టిది?

౪. నీభక్తికిఁ బాత్రులయిన పదిమంది పేరులు చెప్పుము.

౫. భక్తివలన మన కెట్టి యుపకారము గలుగును? అయి దుపమానములఁ జూపుఁడు.

౬. భక్తి లేనిచోఁ గలుగునష్టము లెవ్వి?

౭. మన గభీర భక్తికిఁ బాత్రుఁడెవఁడు?

అష్టమపాఠము — ఉపాసన.

ఈశ్వరుఁడందఱకంటెను మన గభీరభక్తికిఁ బాత్రుఁడని సప్తమపాఠమునఁ జదివియున్నాము. జ్ఞానులు మనభక్తికిఁ బాత్రులుగాని జ్ఞానుల జ్ఞానమంతయు నీశ్వరునినుండియే వచ్చియున్నది. మనమును నీశ్వరునినుండియే జ్ఞానమును బొందుచున్నాము. మనుష్యుఁడెంతజ్ఞానియైనను, బుద్ధిమంతుఁడైనను గ్రహించుటకును, దెలిసికొనుటకును వీలుగాని విషయము లనేకము లున్నవి. ఈశ్వరుఁడు జగత్తునకుఁ గర్తయగుటవలన నాయనకుఁ

తెలియని విషయములు లేవు. మఱియును నాయన సర్వజ్ఞుఁడు. సాధుపురుషుల జీవితములందును లోపములుండిన నుండవచ్చును. కాని యీశ్వరున కేవిధమగు లోపములు లేవనియును దోషరహితుఁడనియును నిష్పాపుఁడనియును సంపూర్ణపవిత్రస్వభావుఁడనియును దయామయుఁడనియును వివేకమువలన మనము గ్రహించుచున్నాము. ఇందువలనఁ బరమేశ్వరుఁడు మన గభీరభక్తికిఁ బాత్రుఁడు గనుక నాయనయం దధికభక్తిని జూపించుట యుచితమని మనము స్పష్టముగఁ దెలిసికొనవలయును.

ఈ విషయమున వివేకము మనకొక కర్తవ్యాంశమును బోధించుచున్నది. సత్యమును బలుకుట పరుల కుపకారమును జేయుట చమువ్రకొనుట మొదలగు కార్యములు ఉచితములని వివేకమువలనఁ దెలిసికొనువిధముననే యీశ్వరుఁడు సకలగుణములకు గుణియనియును సర్వదా మనలను రక్షించుచున్నాఁడనియును నెల్లప్పుడు మంగళమునే సంపాదించుచున్నాఁడనియును తెలిసికొనుచున్నాము. కాఁబట్టి మనపై నెవరికిఁ బరిపూర్ణదయయో యట్టివారిమీఁద భక్తిగలిగియుండ యుచితముగదా! ఆయనదయను భావించినను, నాయన గుణములను దలంచినను భక్తి తనంతటఁ దానుగనే హృదయమునం దుదయించును. ఆయనవిషయమున మనమెంత భావించిన నంతకంత భక్తి యుదయ మగుచుండును. ఈశ్వరుని విషయము నెక్కువగ భావించువారికి భక్తి యెక్కువగఁ గలుగుచుండును. తక్కువగ భావించువారికి భక్తి తక్కువ యగుచుండును.

ఈశ్వరుని విషయము నధికముగ భావించువారల మనస్సు భక్తిపూరితమైయుండును. కనుక నట్టివారికి, భక్తి పూర్ణ

స్థితికి వచ్చుట వలనఁ గన్నులు దెఱచినపుడెల్ల నానందాశ్రుధార ప్రవహించు చుండును. మాటిమాటికిని, మనమున గభీరభక్తి యుదయ మగుటవలన వారెప్పుడు నీశ్వరుని మఱచిపోరు. వారి మన మెప్పుడును భక్తిరస పూరితమై యుండును. ఈశ్వరుని విషయము నధికముగ భావించని వారలకు నధికభక్తి యుదయింప కుండుటయే కాక, యున్న కొంచెము భక్తియును స్వల్పకాలము మాత్రమే యుండును. పరిపూర్ణగుణములు గలిగి పరిపూర్ణదయను జూపించువాని మీఁద స్వల్పభక్తిని గలిగియుండుట యుత్తమమో, లేక, మన గభీరభక్తిని జూపించుట యుత్తమమో యోజించికొనుఁడు. కాని, మన మనస్సు చిన్నది. అందువలన నొకే కాలమున నేయీశ్వరుని సకలగుణములను భావింపఁజాలము. మనజీవితకాలమంతయు నాయనగుణగణములను లెక్కింపఁజాలము. ఆయనగుణగణములను భావించుటవలన మనమనస్సునం దాయనమీఁద భక్తి గలుగును. ఈభక్తి నాయన గుణములతోఁ బోల్చిచూచిన యెడల నత్యల్పమగును. ఒకఁడు నీకులక్షరూపాయ లప్పిచ్చినాఁ డనుకొనుము. నీవువాని యప్పును దీర్చుటకు నొకరూపాయ మాత్రమిచ్చినావనుకొనుము. ఇందువలన నీయప్పెంత స్వల్పముగఁ దీరినదో గ్రహింపుము. ఈశ్వరుఁడు మనమీఁద దయగలిగి ప్రేమ యను నంతము లేని యప్పును మనకిచ్చియున్నాడు. అందుకుఁ గొంచెము భక్తిని మన మాయన కిచ్చినయెడలఁ బైన చెప్పినటు లొకరూపాయకుఁ గూడఁ దక్కువ దీర్చినవార మగుదుము. సంపూర్ణముగ నాయన ఋణమును మనము దీర్చుకొనఁజాలము. ఎందువలన ననఁగా, నాయనగుణముల కంతము లేదుగదా! మన మెంత భక్తిగనుపఱచిన

ను మనభక్తికి సీమగలదు. కనుక మనము మాటిమాటికి నీశ్వరుని గుణకథాగానము చేయుచుండినయెడలఁ గ్రమక్రమముగ మనభక్తి వృద్ధియగుచుండును. ఈశ్వరుని విషయములను భావింపకకాని, యత్యల్పముగ భావించుచుఁగాని యీశ్వరునియందు భక్తి చూపకగాని యల్పముగఁ జూపువారువలెగాని, మన ముండుట యుచితముగాదు. మాటిమాటికి నీశ్వరునిగుణములను భావించుచు నీశ్వరభక్తిరసముతోడఁ బూర్ణమగుహృదయములు గలవారలము గావలయునని ప్రయత్నించుట మన విధాయకకృత్యము.

భక్తివలన మనకెట్టి యుపకారముగలుగునో దానిని సప్తమపాఠమునందుఁ జదివియున్నాము. మనకెవరిమీఁదభక్తి యుండునో వారివంటివారలము గావలయునను నిచ్ఛ మనకుఁ గలుగును. ఇందువలన నీశ్వరునిపై భక్తిగలిగి యుండుటవలన మనకెట్టియుపకారముగలుగునో దానిని సహజముగ గ్రహింపఁ గలుగుదుము. పరమేశ్వరునిజ్ఞానము, పవిత్రత, దయ మొదలగు వానిని భావించినకొలఁదిని, బరమేశ్వరునిపై భక్తి వృద్ధియగుచుండును. ఈశ్వరభక్తి వృద్ధియైనకొలఁదిని జ్ఞానులము సచ్చరిత్రులము పరోపకారులమును గావలయునను నిచ్ఛ గలుగుచుండును. కనుక నీశ్వరభక్తి ధార్మికులమగుట కెట్టియత్యుత్తమము నుపాయమో యూహించుకొనుఁడు. వివేకముయొక్క ప్రేరణలప్రకారము ప్రవర్తించుచు మనోవాక్కాయకర్మములయందు బాగుగనడచుకొనుచు, ధార్మికుఁడవగుటకుఁ బ్రయత్నించుటయే నీవిధాయకకృత్యము. ఈకర్తవ్యపాలనముకొఱకుఁ గల ప్రధానమార్గమును దెలిసికొనుఁడు. ఈశ్వరునియం దెంత

భక్తిపరుడవగుదువో యంతధార్మికుండ వగుదువు. సచ్చరిత్రుం
డవగుదువు. కాన నీశ్వరభక్తి వృద్ధినొందు మార్గము నన్వేషించి
తెలిసికొనుము.

భక్తి దేనివలనఁ గలుగునో దానిని సహజముగఁ దెలిసికొ
నఁగలుగుదుము. సుగుణములుగలవారిని జూచినఁగాని వారిని
గుఱించి విచారించినఁగాని వారిమీఁద మనకు భక్తి యుదయిం
చును. స్థిరమగుచిత్తముతో నొకనిమిషకాలము నీతల్లి ప్రేమ
ప్రకాశమానమగు కార్యములను భావింపుము. భావించినకొలఁ
దిని నీచిత్తము భక్తిరసపూరితమగును. కన్నులఁదెఱచిన జల
ప్రవాహము ప్రవహించును. కనుక నీశ్వరభక్తి నార్జింపవల
యునని నీవిట్లే చేయవలయును. ఈశ్వరుని కన్నులతోడఁ జూ
డఁజాలము. కాన నాయనకార్యములను నలుప్రక్కలఁ జూచు
చున్నను సకలసమయములయం దీసమస్తకార్యముల నాయన
చేయుచున్నాఁడని మనకు జ్ఞప్తియుండక పోవచ్చును. మనమనేక
సమయములలోఁ బనులతొందరవలన నాయనను మఱచు
చుందుము. సర్వదా నాయనను మఱచి తిరిగినను భక్తి యుద
యింపదు. ఇందువలనఁ బ్రతిదినమును నియమితసమయముల
యందు నిశ్చలచిత్తముతోడ నాయనగుణగణములను భావింప
వలయును. ఆయన సర్వదా మనలోపలను వెలుపల నున్నాఁడు.
ఆయనకు మనమనస్సులోని సంగతులు తెలియును. ఇందువలన
గేవల మాయన గుణకీర్తనమాత్రమే చేయక మనస్సులోని
సంగతులను జెప్పుటయుచితము. నీతల్లిగాని, నీస్నేహితుఁడుగాని
యితరగ్రామములయం దున్నప్పుడు వారివిషయమును భావిం
తువు. వారికి జాబును వ్రాయుదువు. కాని వారు నీయొద్దఁగూడ

చుండినచోఁ గేవలము వారివిషయమైన చింతనమును జేయుటవలన సంతుష్టినిబొందవు. వారితో మాట్లాడినగాని సంతుష్టిని బొందఁజాలవు. మాట్లాడుటవలనఁ బ్రేమయెక్కువయగును. అందువలన మనలోపలనున్న యీశ్వరునితో సాక్షాద్భావమున మాట్లాడుటయుచితము. సాక్షాద్భావమున నీశ్వరునితోడ మాట్లాడినచో సహజముగ భక్తియుదయించును. ఈశ్వరునితోడ సాక్షాద్భావమున మాట్లాడుటను "ఉపాసన" యందురు. ఈశ్వరుఁడు లోపలను వెలుపలను సమీపమున నున్నాఁడని తెలిసికొని యాయనతోడ మాట్లాడుట నుపాసనయని చెప్పుదురు.

ఉపాసనమేవిధముగఁ జేయవలయునో గమనింపుఁడు. (౧) స్థిరభావమున నీశ్వరుఁడు మనసమీపమునందున్నాఁడను దాని ననుభవములోనికిఁ దెచ్చుకొనవలయును. దీనినే ధ్యానమందురు. (౨) ఈశ్వరునిగుణగణములను వర్ణింపవలయును. అనఁగా నాయన జగత్తునకుఁ గర్తయనియు నాయనకు సమస్తము దెలియుననియు నాయన సమస్తమైన వారిని బ్రేమించుననియు నాయన పవిత్రుఁడనియును మొదలగు నాయన గుణగణములను దలంచుకొనవలయును. దీనినే యారాధనయందురు. (౩) మనలను రక్షింపవలయుననియును, బోషింపవలయుననియును, సత్యవాదులుగఁ జేయవలయుననియును, మొదలుగాగల కోరికల నీశ్వరునియెదుటఁ గోరుటను బ్రార్థనయందురు. ఆరాధన ధ్యానము, ప్రార్థన యనునీ మూడంగములును గలిసిన నుపాసన యగును.

అనుదినము దినమునకు రెండుమారులైన నుపాసనచేయుట యుచితము. ఉదయమున శాంతముగనుండును, మనస్సు

నిర్మలముగనుండును. అప్పటినుండియే దినకృత్యములఁ బ్రారం
భింపఁ బోవుదుము. కనుక నుదయ ముపాసన కుపయుక్తసమ
యము. ఉదయమునఁ బాగుగ నుపాసనను జేసినచో దినమంత
యు మనస్సునిర్మలముగ నుండును. కర్తవ్యములను బాగుగ నె
ఱవేర్తుము. కనుక నుదయముననే యుపాసన కర్తవ్యము. దీని
తర్వాత సాయంసమయముగూడ శాంతముగ నుండును. దిన
మంతయును బనిపాటలవలన మనస్సు చీకాకుగ నుండవచ్చును.
అందువలన సాయంకాలమునం దుపాసనను చేసి మనోనిర్మలత్వ
మును బొందుట యుచితము. దినమంతటిలో ననేక యబద్ధములు
పలికియుండవచ్చును. అన్యాయకార్యములు చేసి యుండవచ్చు
ను. ఇందువలన దినమంతటిలోను జేసిన పాపకార్యములకొఱకు
నీశ్వరుని సమీపమున క్షమింపవలయునని ప్రార్థించుటయేకాక
యెప్పుడు నిట్టికార్యములు చేయకుండునట్టులు ప్రసాదింపవల
యునని వేడవలయును. దినమంతటిలో నీశ్వరుఁడుమనమీఁదఁ
జూపించినదయాపూరసమును స్మరించి యాయనకుభక్తితోడఁ బ్ర
ణామమును జేయుట యుచితము. ఈకారణములవలన సాయం
సమయ ముపాసన కుపయుక్తకాలము. నియమితకాలమునగాక
సమయముదొరకినపుడెల్లను, ఈశ్వరునిగుణములను స్మరించుచు
మనలనురక్షింపవలయునని ప్రార్థన చేయుచుండుట యుచితము.
ముఖ్యముగ నాహారమును భుజింపబోవునప్పుడును, స్నానసమ
యమునను, ఇంటిపనికొఱకు మొదలిడినప్పుడును, నూతనవస్త్ర
ములు పుస్తకములు లిఖించునప్పుడును, నన్యాయకార్యము
లొనర్చునప్పుడును నాయనను విశేషముగ స్మరించుట కర్త
వ్యము.

ప్రశ్నలు.

౧. ఎందువలన నీశ్వరుఁడు సమస్తమైనవారికంటెను మనభక్తికిఁ బాత్రుఁడు.

౨. ఈశ్వరునిమీఁద భక్తిసంబంధమున మనకర్తవ్యమెద్ది?

౩. దేనివలన నీశ్వరభక్తి వృద్ధియగును?

౪. ఈశ్వరభక్తివలన మన కెట్టియుపకారములు కలుగును?

౫. ఈశ్వరభక్తి వృద్ధియగుటకెట్టి యుపాయముల నవలంబించుట యుచితము?

౬. దేని నుపాసనయని చెప్పుదురు?

౭. ఉపాసనకును, జింతనచేయుటకును గలభేదమేమి?

౮. ఉపాసనకుఁ ,దొడఁగి మనమేమిచేయవలయును?

౯. ఉపాసనాంగములను జెప్పుడు?

౧౦. దినమున కెన్నిమారు లుపాసనచేయుట యుత్తమము?

౧౧. ఎందువలనఁ బ్రాతఃకాల ముపాసనకుఁ దగినకాలము?

౧౨. ఎందువలన సాయంకాల ముపాసనకుఁ దగినకాలము?

౧౩. ఏయేసమయములయం దుపాసనను జేయుట యుచితము?

నవమపాఠము— తల్లి, తండ్రి.

అష్టమ పాఠమునందు భక్తిపాత్రులకు భక్తిని జూపించుట ఋణమునుదీర్చుకొనుటవంటిదె యని చదివియున్నాము. ఋణమును దీర్పకుండుటయెట్లధర్మమో గురుజనులకుభక్తిని జూపింపకుండుటయు నధర్మము. భక్తిని జూపించుటవలన మనస్సునకుపకారము గలుగును, చరిత్రబాగుపడునని తెలిసికొనియున్నాము. కనుక దలిదండ్రుల యెడభక్తిని జూపించుట యుచితము. ఇందువలన మనకెట్టియుపకారము గలుగుననువిషయమును విచారించుకొనుదము.

శిశువు గర్భమునందున్నప్పుడు తల్లి యనేకకష్టములం బొందును. శిశువుజన్మించినతరువాతఁ దలిదండ్రులు పొందుకష్టములను బూర్ణముగవర్ణించుట దుస్తరము. కాని, వారుశిశువు ప్రేమించుటవలన ధైర్యముతో సమస్తకష్టములను సహించెదరనుటను మీరుదెలిసికొనియే యున్నారు. అయినప్పటికి నీపుస్తకమునందీవిషయమును వర్ణించుటవలనఁ బ్రయోజనము గలదు. తలిదండ్రులు మనభక్తికిఁ బాత్రులనియును, మనలను బూర్తిగ ప్రేమింతురనియును మనలకుమితిలేనియుపకారములను జేసియున్నారనియును, పైపైన తెలిసికొనుటవలనను, విశేషముగ భావింపకుండుటవలనను, మన మనస్సొకవిధముగ నుండును. తలిదండ్రులు మనకొఱకుఁ జేసిన వానిని, జేయుచున్న వానిని, స్థిరముగభావించి చూచినచో మన మనస్సింకొకవిధముగనుండును. అనఁగా వారిపైనిమనభావము భక్తిరసపూరితమగును.

మఱియువారియెడలఁ జూపవలసినంతగా భక్తిని జూపించుట లేదనియును దెలిసికొందుము.

అనేకులు బాలురుబాలికలు తలిదండ్రుల ప్రేమవిషయమును భావింపరు. అందువలనఁ దలిదండ్రులపైని గనుపఱచవలసినభక్తిని గనుపఱుపజాలరు. మఱియును తలిదండ్రులయెడ ననేక సమయములయందు నగౌరవముఁ జూపెదరు. ఇందువలనఁ దలిదండ్రులు మనకొఱకుఁ జేసినదానిని జేయుచున్నదానిని సర్వదా స్మరించుట యుచితము.

ఒక్కొక శిశురక్షణకొఱకుఁ దలిదండ్రులు చేయుకార్యములను మీమీగృహములయందు మీరు చూచుచుందురు. శిశువునకు గొంచెమును దెలియదుగదా? దేనిని దినవలయునో యెచ్చట పరుండవలయునో యెఱుఁగఁడుగదా? అన్నము దినిపించుట, బట్టలుగట్టుట, పరుండఁబెట్టుట మొదలగు శిశువుయొక్క సంరక్షణకార్యములయందెప్పుడును దల్లి మునిఁగియుండును. రాత్రులపుడపుడు శిశువు మేల్కొనియుండును. ఇందువలనఁ దలిదండ్రులు మేల్కొని శిశువునకేది లోపమో కనుగొని యాలోపమును దీర్చుచుందురు. ఇందువలన నిదుర తక్కువయై తలిదండ్రులకు జబ్బు కలుగుచుండును. శిశువు కొంచెము పెద్దవాఁడై నడచుటకుఁ బ్రారంభించుచున్నపుడును, తలిదండ్రులు బాలుని జాగ్రత్తగఁ జూచుచుందురు. ఎక్కడికేగినాఁడో, పడినాఁడో, దెబ్బలు తగిలించుకొనినాఁడో యని యెంచి తలిదండ్రులాతురులై యుందురు. బాలుఁడు పెద్దవాఁడయిన కొలఁదిని దలిదండ్రుల విచారణ యెక్కువయగుచుండును. ఎచ్చటికేగినాఁడో యెట్టి చిక్కులను దగిలించు

కొనినాఁడో యేదుర్మార్గుల సహవాసమును బట్టినాఁడో, యేదుర్మార్గపు మాటలను బల్కుచున్నాడో, దుర్మార్గపు వ్యవహారములను జేయుచున్నాఁడో చదువుటయందు శ్రద్ధగ నున్నాఁడో లేఁదో యుపాధ్యాయుఁడు మొదలుగాఁగల మాన్యుల నుచిత రీతిని గౌరవించుచున్నాఁడో లేఁదో చెలియలు తమ్ముఁడు మొదలగు వారితోడ నిరుగుపొరుగువారితోడను బాగుగఁ బ్రవర్తించుచున్నాఁడో లేఁదోయని సర్వదా సంతాపించుచుందురు. సంతానము జబ్బుపడినను వారి తచదువులయందు శ్రద్ధ చూపించకున్నను, బ్రవర్తనము బాగుండకున్నను దలిదండ్రులకుఁ గలుగు మనఃక్లేశమును భావనచేసియును బూర్తిగఁ దెలిసికొనఁజాలము.

మనము శైశవమునను బాల్యమునను, దలిదండ్రుల కేవిధమగు నుపకారమును జేయుటలేదు. పెద్దవారలమైనతరు వాతఁగూడఁ దలిదండ్రుల కుపకారమును జేయఁజాలము. కాని తలిదండ్రులు మనమంగళము కొఱకు సర్వదా చింతించుచు నాతురులై యుండు విధమును భావించిచూచినచో నాశ్చర్యము గలుగక మానదుగదా? వారి తచదువులు నేర్పి కాని, డబ్బు సంపాదించుచు స్వపోషణమును జేసికొను సంతానముపైని గూడఁ దలిదండ్రుల ప్రేమ దూరమగుట లేదు. వారు సర్వదా మనమంగళమునే యోచించుచు, మనసుఖమున సుఖమును, మనదుఃఖమున దుఃఖమును బొందుచుందురు. మనము జీవించి యుండునంతకాలమును దలిదండ్రుల యొక్క ప్రేమ పూరిత నేత్రములు మనమీఁదనె యుండును. సంతానము మరణించిన ప్పుడు, తలిదండ్రులకుఁ గలుగు దుఃఖమును వర్ణించుట యసా

ధ్యము. సంతానమరణానంతరము గూడ వారిస్నేహము దూర
ముగాఁజాలదు. వారు బ్రతికియున్నంత కాలమును మరణించిన
సంతానమును మఱచిపోఁజాలరు.

మీరు ప్రత్యేకముగా మీమీతలిదండ్రుల ప్రేమను ప్ర
కాశమానము చేయుచుండు కార్యములను స్థిరభావమున మన
నము చేయుఁడు. ఎవరి తలిదండ్రులు సజీవులో వారు మహాభా
గ్యవంతులు గదా! మఱియును, తలిదండ్రు లమూల్యధనము
గనుక మనగభీరభక్తికిఁ బాత్రులైన తలిదండ్రులయెడ భక్తిఁ
జూపక, మన్నన చేయక, వర్తించువాఁడు మహాపాపి. కనుకఁదలి
దండ్రుల దయావిషయమును సర్వదా భావించుట యుచితము
ఉపాసనాసమయమున విశేషముపకారము గలుగును. వారి
దయావిషయమును సర్వదా భావించుచుండినచో వారిమీఁద
భక్తి నిలిచియుండును. భక్తి నిలిచియుండుటవలన వారిని నిర్ల
క్ష్యము చేయుట కిచ్చగింపము. కావునఁ దలిదండ్రుల విషయ
మున నీక్రింద వివరించు కర్తవ్యములను స్మరించుచుఁ బాలనము
చేయుచుండుట యుచితము.

౧ ప్రతి దినమును దలిదండ్రుల దయావిషయమును
భావించుచుండవలయును. ఉపాసనాసమయమున ముఖ్యముగ
భావింపవలయును.

౨ కొన్ని సంసారములలో నిద్దుర పోఁబోవునప్పుడును, నిద్దుర
నుండి లేచినపుడును దలిదండ్రులకు నమస్కరించుపద్ధతి గలదు.
అట్టిపద్ధతి నవలంబించుట మంచిది.

3 చేతనైనంతవఱకుఁ దలిదండ్రులు చేయు కార్యములలో
సహాయముచేయుట యుచితము. వారు చెప్పకపూర్వమె

చేయుటయుచితము. కాని, వారు చెప్పిన తరువాతనైనను జేయుట మంచిది.

౪ మనకంటె మనతలిదండ్రులెక్కువ దెలిసిన వారలని సర్వదాస్మరణయందుంచుకొనవలయును. వారుచేయుమని చెప్పిన పనిని వెనువెంటనేచేయుట యుచితము. చేయుమనిచెప్పిన నకార్యమునకుఁ గారణముదెలియకున్నను జేయుటయుచితము. తలిదండ్రులుచేయు సకలకార్యముల కారణములను బిడ్డలు గ్రహించుట యసంభవముగదా. ఆటలు పిల్లలకు మిగుల బ్రియములు. అందువలన నాటలువదలి యింకొక కార్యమును జేయుమని చెప్పినచోఁ బిల్లల మనస్సునకు విరక్తి గలుగును. కాఁబట్టి ముందుగా నీకార్యము, లన్యాయములు లేక, యనావశ్యకములని తోఁచవచ్చును. కనుకఁ దలిదండ్రులు చేయుమని చెప్పిన కార్యము, నీకుబాగుండని యెడల నీకిక్రింది విధమున భావించుట యుచితము. ఈపని నాసుఖమునకు నష్టమును గలిగించుచున్నది, కనుక నిది మంచిపనియని మనమునకుఁ దోఁచుట లేదు, అయినను దలిదండ్రులు దీనిని బాగుగఁ దెలిసికొనియే చెప్పియుందురు. కనుక నీకార్యమును జేయుట నా కుచితము.

౫. ఎప్పుడయినను దలిదండ్రులు చెప్పిన కార్యములు బాగుగయోజించి చూచినప్పుడుగూడ నన్యాయమని నీకుఁదోఁచినప్పుడును, నుపాధ్యాయులు జ్ఞానులైన ననేకులు గొప్పవారు నన్యాయమని చెప్పినప్పుడును, శాంతనమ్రభావములతోడ నీకార్యములను గుఱించి తలిదండ్రులతోడ ముచ్చటింపవలయును. ఏ తలిదండ్రులైన నజ్ఞానముచేత సంతానమున కబద్ధము పల్కవలయునని చెప్పినను భక్తిచూపించుట కుచితముగాని వా

రికి భక్తిచూపింపవలయునని చెప్పినను, వయసువచ్చిన సంతాన మీకార్యము నాకధర్మమని తోఁచుచున్నదని నమ్రభావము తోడఁ దలిదండ్రులకు విన్నవించుకొన వలయును. వివేకము నిషేధించుచున్న కార్యములను జేయుమని ధార్మికులగు తలిదండ్రులెప్పుడును బలవంతము చేయరు. వివేకము ప్రకారము ప్రవర్తించుటయే ధార్మికులగు తలిదండ్రుల యిచ్ఛ. మఱియుఁ దలిదండ్రులు వివేక వాణి ప్రకార మాజ్ఞాపించిన నాజ్ఞను బరిపాలించుట యుత్తమము గాని యెప్పుడైన సజ్ఞానముచేతఁ దలిదండ్రులు వివేక వాణికి వ్యతిరేకమగు కార్యములను జేయుమని బలవంతపఱచినచోఁ గూడ సుఖముతో నాకార్యమును బరిత్యజింపవలయును. కాని యిట్టిసమయము లందును గూడ కఠినమగు మాటలతోడను క్రియలతోడను దలిదండ్రుల మనమునకు బాధగలిగించుట యుచితము గాదు. వారియందేదైన దోషము గాన్పించినను గూడ వారికొఱకు మనము చేయవలసిన విధాయక కృత్యములను మఱచిపోవుట దోషము. మన మెల్లప్పుడును దలిదండ్రులు మన గభీరభక్తికిఁ బాత్రులని మనమునం దుంచుకొని సేవించుట ధర్మము.

౬. తలిదండ్రుల విషయమున సర్వదా వినీతభావముతో నడచుకొనుట యుత్తమము. కోపమునఁగాని విరక్తిబొంది గాని యెప్పుడును కఠినమగు మాటలచేతఁగాని ప్రవర్తనవలనఁ గాని దలిదండ్రుల మనసునొప్పించుట యుచితముగాదు.

౭. తలిదండ్రులు జబ్బుపడిన సమయమున విశేషశ్రద్ధతో శుశ్రూషను జేయుట యుచితము. అందువలన మనకెట్టి కష్టము గలిగినను ధైర్యముతో నాకష్టములను సహించుట

యుచితము. దలిదండ్రులు మనకుఁజేసిన యుపకారములతో మనముచేయు శుశ్రూషను బోల్చిచూచినచో మనము చేయు శుశ్రూష లెట్టివి యయినను నత్యల్పములని గ్రహింపఁగలుగు దుము. తలిదండ్రుల ఋణమును బూర్ణముగఁ దీర్చుకొనుట మనకసంభవము. అందువలన వారికి శుశ్రూషలుచేయు సమయము తటస్థించుట మన భాగ్యమని తలంచుట యుచితము. మఱియును శుశ్రూషలు చేయునప్పుడు మనకుఁ గష్టములు గలిగినను నాకష్టములు మంగళకరములని విశ్వసింపవలయును.

౮. ఎప్పుడైనను దలిదండ్రుల విషయమున నన్యాయముగ నడచుకొనినచో నప్పుడవి యన్యాయమని నీవు గ్రహించిన వెంటనే వారిని క్షమాపణగోరుట యుచితము. మఱియు నెప్పుడును దలిదండ్రుల విషయమున నన్యాయముగ నడచుకొనకుండునటులు మనమునకు దోహదఁజేయుచుండవలయునని సర్వదా భగవంతుని బ్రార్థించుచుండవలయును.

ప్రశ్నలు.

(౧) ఎందువలనఁ దలిదండ్రుల దయావిషయమును సర్వదా భావించుట యుచితము?

(౨) ఎంతవఱకుఁ దలిదండ్రుల దయావిషయమును వివరింపఁగలము?

(3) వారివిషయమున మనమెట్లు నడుచుకొనుట యుచితము?

(౪) వారుచేయుమని చెప్పినకార్యములకుఁ గారణములు దెలియనప్పు డేమిచేయుట యుచితము?

(౫) తలిదండ్రుల కస్వస్థతగలిగినప్పు డేమిచేయవల యును?

(౬) తలిదండ్రులు స్పష్టముగ వివేకమునకు విరుద్ధములగు కార్యములను జేయుమని చెప్పినప్పుడు మనమేమి చేయుట యుచితము?

(౭) తలిదండ్రులకు శుశ్రూషలు చేయునప్పుడు కష్టముగ నుండినచో నేమనిభావించుట యుచితము?

(౮) వారివిషయమున నన్యాయముగ నడచుకొనినచో నేమిచేయవలయును?

దశమపాఠము — ఉపాధ్యాయుడు.

పాఠశాలలో మీరు ప్రతిదిన మెన్నియో సంగతులు నేర్చికొందురు. వారము, మాసము, వత్సరమగు నప్పటి కెన్నిసంగతులు దెలిసికొందురో విచారించి చూడుడు. మీవిద్యాభ్యాసకాలమున ననేకశబ్దములు, వాక్యార్థములు కథలు కర్తవ్యములను దెలుపుసూత్రములు, దేశచరిత్రలు, మహాపురుషజీవితములు, వస్తుతత్త్వములు మొదలగువాని నభ్యసింతురు. ఈవిద్యాభ్యాసమువలన బాలకత్వము దూరమగుటయేకాక క్రమక్రమముగ జ్ఞానివియును, కార్యప్రవీణుడవును నగుదువు. ఇందువలన నీవొకసంసారమును బరిపాలింపగలవాడ వగుదువు. వర్తకము లేక, యుద్యోగము చేయగలుగుదువు. ఇతరులకు విద్య చెప్పగలిగియుందువు. వ్యాసములు పుస్తకములు వ్రాయగలిగియుం

డవు. మంచి భాషలో నుపన్యాసములిచ్చి దేశసేవ చేయఁగలిగి యుండుము. మఱియును నీసకల కర్తవ్యకార్యముల కొఱకు నీవు సమర్థుఁడ వగుము. ఈ సకల కార్యముల కుపయుక్తుఁడ వగుటకు నీవు ప్రతిదినమును వృద్ధిపొందుచుండుము. గురువుయొక్క ప్రసాదమువలన నీకీయుపకారములు గలుగుచున్నవి. గురువుయొక్క సహాయము లేనిచో నీవు వృద్ధిలోనికి రాఁజాలవని సర్వదా మనస్సునం దుంచుకొనుము.

తలిదండ్రుల గుణగణములను సర్వదా భావించుచుండు విధముననే యుపాధ్యాయుని గుణగణములను సర్వదా భావించుచుండుట యుచితము. ఇట్లు భావించుచుండినచో నుపాధ్యాయులయెడ భక్తి గలుగుటయే కాక భక్తి క్రమక్రమముగ వృద్ధిఁ బొందును. ఉపాధ్యాయుఁడు మీకంటె ననేకవిషయములను బాగుఁగ దెలిసికొనియున్నాఁడు. మీరు చేయఁజాలని కార్యముల నాయన సులభముగఁ జేయఁగలిగిన శక్తిని గలిగియున్నాఁడు. ఆయనకు మీయందుఁగల దయ, నాయన మీబాగును గోరుచుండు విధము, నాయన సాహాయమువలన శ్రేష్ఠమానవుఁడగుచుండుటయును, సర్వదా చింతించుచుండుఁడు. ఉపాధ్యాయుని యెడ భక్తిని జూపించుచుండుటవలన మహోపకారముగలుగును. భక్తినిజూపింప కుండుటవలన నెక్కువ యనిష్టము గలుగును.

జ్ఞానియెడల భక్తినిజూపించుట జ్ఞానము నాదరించుటయే కదా! జ్ఞానమునకు వెలలేదు. జ్ఞానలాభమును బొందినచో మనము శ్రేష్ఠమానవుల మగుదుము. జ్ఞానియెడల భక్తిని జూపించినకొలఁదిని మనస్సు జ్ఞానముయొక్క శ్రేష్ఠత్వమును

గ్రహించుచుండును. జ్ఞానముయొక్క శ్రేష్ఠత్వమును గ్రహించినకొలఁదిని జ్ఞానముమీఁద నాదరము గలుగుచుండును. ఉపాధ్యాయునికి భక్తినిజూపినకొలఁది నాతఁడు చెప్పువాక్యములయందు మనోయోగ మధికమగుచుండును. అందువలన జ్ఞానలాభమును బొందవలయునను నిశ్చయ మనురాగమును గలుగును. జ్ఞానముమీఁద ననురాగము గలిగినకొలఁదిని విద్యాభ్యాసమునందు మిక్కుటముగ బనిచేయుదుము. కావున నుపాధ్యాయునకు భక్తిని జూపించుటవలన మన కెట్టియుపకారము గలుగునో చూచితిరా! ఉపాధ్యాయునకు భక్తిని జూపనివారు జ్ఞానముయొక్క విలువను దెలిసికొనజాలకుండుటయేకాక జ్ఞానము నాదరింపరు. మఱియును శిక్షకుఁడు చెప్పుమాటలయందు వారి మనసుండదు. విద్యాభ్యాసమునం దుత్సాహమును జనింపదు. జ్ఞానము నాదరింపనివారు నుపాధ్యాయునికి భక్తిని జూపనివారును మూర్ఖులని మీరు స్పష్టముగఁ దెలిసికొనవచ్చును. ఉపాధ్యాయుని వాక్యములమీఁద మనసుంచక యుత్సాహముతోఁ జదువుకొననిచో మూర్ఖత్వమే నిలిచియుండును. అందువలన వయసు వృద్ధియైనకొలఁదిని జ్ఞానము వృద్ధిగాదు. బుద్ధి వికసింపదు. వ్రాతచదువులలో శక్తి వృద్ధిబొందదు. ఉపయుక్తుఁడగు మనుజుఁడును గాఁజాలఁడు. ఉపాధ్యాయునకు భక్తిని జూపించుటకును జూపింపకుండుటకును నెంతభేదము గలదో విచారించిచూడుఁడు. ఉపాధ్యాయునకు భక్తినిజూపనివాఁ డప్పు పుచ్చుకొని యప్పుతీర్చనివంటివాఁడు. కావున సర్వదా యుపాధ్యాయునియెడ భక్తినిజూపించుట యుచితము. ఉపాధ్యాయుని విషయమున భక్తిని ప్రకాశమానముచేయని చింతవలను

చింతింపకుము. అట్టిమాటలను వక్కాణింపకుము. అట్టికార్యములను జేయకుము. ఉపాధ్యాయుని విషయమున నీక్రిందవివరించిన నియమములను సర్వదా స్మరణయందుంచుకొనుట యుచితము. (౧) ప్రతిదినము ఉపాధ్యాయుని ప్రథమ దర్శనమునను ఉపాధ్యాయునియొద్ద సెలవు గైకొనునప్పుడును వందనములను జేయుము. (౨) ఉపాధ్యాయుని సమీపమునఁ జేతులు, కాళ్లు తల మొదలగు నవయవములనుఁ గదలింపక స్థిరముగఁ గూర్చుండుము. (౩) ఉపాధ్యాయుని యెదుట బిగ్గరగ మాటలాడకుము (౪) ఉపాధ్యాయునితోడ మాట్లాడునప్పుడు "అయ్యా, ఆజ్ఞ" అను సన్మానసూచకమగు శబ్దముల నుపయోగింపుము. (౫) మాట్లాడునప్పు డాయన మొగమువంక నెగాదిగఁ జూడకుము. ఇట్లు చూచుటవలన వినయము ప్రకాశముగాదు. అందువలనఁ దలనుఁ గొంచెమువంచి మాటలాడవలయును. (౬) ఆయన వాక్యములను మనోయోగసహితముగ వినవలయును. మాటలాడునప్పుడు దిక్కులుచూడకుము. శ్రద్ధగ వినుచుండుము. ఈసమయమునం దెవరైనను నిన్నుఁ బిలచినచో వారిపిలుపును మనమునకు రానీయఁగూడదు. ఇతరకార్యము లేక యితర వాక్యములయందు మనస్సుంచుటయు నావశ్యకమైనచో నాయన యనుమతిని బొందవలయును. (౭) ఉపాధ్యాయుడు మాటలాడునప్పుడు మాటలాడకూడదు. ఆయన మాటలాడునంతవరకును నిశ్శబ్దముగ వినుచుండవలయును. ఆయన మాటలాడుట పూర్తియైనపిమ్మట చెప్పఁదలచినదానిని చెప్పవలయును. (౮) ఉపాధ్యాయునితోడ నేవిధమగు పరిహాసమును జేయఁగూడదు. ఉపాధ్యాయుడు పరిహాసపుమాటలను పల్కి

ననుమాఱుపలుకఁగూడదు. ఆయన పెద్దవాఁడుగనుకఁ బరిహాసముచేయుట కాయన కధికారముగలదు. కాని యాయనను బరిహాసముచేయుటకు నీ కధికారము లేదు. (౯) ఉపాధ్యాయుడు చెప్పినపాఠమును శ్రద్ధతోఁ జదువుము. పాఠమును శ్రద్ధతోఁ జదువనిచో నీకు నష్టముగలుగుటయెకాక యుపాధ్యాయునియం దలక్ష్యము చూపినవాడవగుదువు. కానఁ బాఠమును శ్రద్ధగఁ జదువుచుండవలయును. (౧౦) ఉపాధ్యాయుని సమ్ముఖమునఁ దోడివిద్యార్థులకు కథలు, పరిహాసములు చెప్పి నవ్వఁగూడదు. ఇటులు చేసినచో నుపాధ్యాయునియెడ నగౌరవమును జూపించినవాడవగుదువు. నీతోడి విద్యార్థియొద్దనుండి నీ కేదయిన వస్తువును దీసికొనవలసివచ్చినప్పుడుగాని యవశ్యమగు నొకటి రెండు మాటలను మాట్లాడవలసివచ్చినప్పుడుగాని మెల్లమెల్లగ నడుగుము. విస్తారముగ మాట్లాడవలసియుండినచో నుపాధ్యాయుని యనుమతినిఁబొంది మఱిమాట్లాడుము. (౧౧) ఉపాధ్యాయుని విషయమున సాహసకార్యమునుగాని తప్పుపనినిగాని చేసినప్పుడు వెంటనే నమ్రభావమున నుపాధ్యాయుని క్షమాపణమును వేడుము. (౧౨) ఉపాధ్యాయుఁడు నీవు చేసినతప్పుపనికి శిక్ష నువిధించినచో నాశిక్షను వెంటనే స్వీకరింపుము. నీవు తప్పుపనిచేయ లేదని దలంచినచో సమయమున్నయెడల నీనిర్దోషిత్వమును మనవిచేసికొనుము. కాని సమయము లేనందువలన నుపాధ్యాయుడు నీమాటల వినుట కిచ్ఛగింపనియెడలఁగాని యుపాధ్యాయునకుఁ దెలియఁజెప్పుటకు నీకు సాధ్యముగానియెడలఁగాని నిర్దోషివనితలఁచుచు నుపాధ్యాయుఁడువిధించు శిక్షనుబొందుము. ఆయననీకంటె ననేకసంగతులను

బాగుగఁ దెలిసికొనియున్నందున నాయన భ్రమపడుటకంటెను నీవు భ్రమపడుట కెక్కువ యవకాశముండును. అప్పుడప్పు డాయనయును భ్రమపడవచ్చును. అయిన నాయనవిధించు శిక్షను బొందుట కర్తవ్యము. ఇందువలన నీకు గష్టముకలిగినను గలుగవచ్చును. కాని యుపాధ్యాయునిమాటలు విననిచో నీకును నీతోడి విద్యార్థులకును మిక్కుటమగు నష్టముగలుగును. విద్యార్థు లుపాధ్యాయునిమాటలు విననిచో వారిని శిక్షించుటకును వృద్ధిలోనికిఁ దీసికొనివచ్చుటకు నుపాధ్యాయునకు వీలుండదు. (౧౩) మీగృహమునందుఁగాని యుపాధ్యాయుఁడెప్పుడు లేనప్పుడుగాని యాయన పేరును లేక యుపాధిని యుచ్చరింపవలసి వచ్చినచో పేరుచివరను "గారు" అను పదమును గలిపి మాట్లాడవలయును. అనగా నుపాధ్యాయుడుగారని మాటలాడుకొనవలయును. కేవలము పేరుతో నుపాధితో మాత్రము పిలువగూడదు. అనగా "ఉపాధ్యాయుడు" అని పిలువఁగూడదు. "వచ్చినాఁడు వెళ్ళినాఁడు"అని యుపాధ్యాయునిగుఱించి మాటలాడక "వచ్చినారు వెళ్ళినారు"అని మాటలాడవలయును. (౧౪) ఉపాధ్యాయుని నితరులయెదుట నెప్పుడును నిందించగూడదు. ఉపాధ్యాయుడు మాట్లాడునప్పుడును నడచునప్పుడును నేవిధమగు లోపములు గనుపడినను నాలోపముల నితరులకొద్ద జెప్పి నవ్వఁగూడదు. గేలిచేయఁగూడదు. (౧౫) తలిదండ్రులకును బుత్రులకును గల సంబంధ మెంత తెగకయుండువిధమున నే శిష్యునకు నుపాధ్యాయునకును గల సంబంధ మెంత తెగకయుండవలయును. స్వతంత్రుడైన పుత్రుడు దలిదండ్రులకు భక్తిని జూపించువిధమున నే యుపాధ్యాయుని

యొద్దఁజదువు మానినతరువాతఁ గూడ శిష్యుఁడువిధాయకముగ నుపాధ్యాయునకు భక్తిని జూపింపవలయును. అనేకస్థలములలో దలిదండ్రులకంటెఁ బుత్రుఁడు గుణవంతుఁడును విద్వాంసుడును గావచ్చును. కాని తలిదండ్రులమీఁదభక్తి యణుమాత్రమైనను దఱుఁగదు. ఇటులే యుపాధ్యాయునికంటె శిష్యుడు క్రమక్రమముగ నెక్కుడువిద్య నభ్యసింపవచ్చును. కాని యుపాధ్యాయునకుఁ బూర్వమువలెనే భక్తినిజూపించుట యుచితము. మఱియు జేతనైనంతవఱకు సహాయమునుజేయుచు శుశ్రూషలు చేయుచుండుట కర్తవ్యము.

ప్రశ్నలు.

(౧) ఎందువలననుపాధ్యాయుఁడుమనభక్తికిఁబాత్రుఁడు?

(౨) ఉపాధ్యాయునిపై భక్తినిజూపించుటవలన మనకెట్టి యుపకారము గలుగును?

(3) వారికి భక్తి చూపింపని యెడల మనకుఁ గలుగు నష్టమెద్ది?

(౪) ఉపాధ్యాయుని విషయమున మనకర్తవ్యములలో మొదటిదైనదానిని జెప్పుఁడు.

(౫) ఆయన యుపదేశములయందు మనసుంచు సమయమున నెట్టినియమములకు లోఁబడియుండవలయును?

(౬) ఆయనతో మాట్లాడునపు డే రెండునియమముల ప్రకారముండవలయును?

(౭) తొమ్మిదవ పదవ నియమములెవ్వి?

(౮) ఉపాధ్యాయుని విషయమున నన్యాయముగఁ బ్రవర్తించినచో నేమిచేయవలయును?

(౯) ఉపాధ్యాయుఁడు పిలుచునప్పు డేనియమము ననుసరింపవలయును?

(౧౦) మిగత రెండునియమము లెవ్వియో చెప్పుము.

ఏకాదశపాఠము—ఆచార్యుఁడు.

సమాజమందిరము, నీతివిద్యాలయము, బ్రహ్మవిద్యాలయము, మొదలగు ధర్మవిద్యను బోధించుస్థలములయందును, మనగృహములయందును, ధర్మవిద్యను బోధించువారి నాచార్యులని చెప్పుదురు. ధర్మాధర్మములయొక్కయు సత్యాసత్యములయొక్కయు స్వరూపము నాచార్యుఁడే మనకుఁ దెలియఁజెప్పును. ఆచార్యుఁడు మనవివేకమును బ్రజ్ఞను బ్రకాశింపఁజేయును. బయటివస్తువులను జూచుటకు, మనకన్ను లెంత ప్రయోజనకరములో లోపలితత్త్వమును జూచుటకుఁ బ్రజ్ఞ యంత ప్రయోజనకరము. కన్నులు లేనియెడల బయటివస్తువులను జూడఁజాలని విధముననే వివేకము ప్రజ్ఞ లేనియెడల ధర్మాధర్మములను సత్యాసత్యములను దెలిసికొనఁజాలము. వివేకము ప్రజ్ఞ యాత్మకుఁగన్నులవంటివి. ఆత్మయొక్క కన్నులను బ్రకాశమానముగఁ జేయువారికంటె మనకు మహోపకారులెవ్వరు? ఆచార్యుఁడు మనమంగళమును గోరుచుండును. మనము సచ్చరిత్రులము గావలయుననియును నీశ్వరుని దెలిసికొని భక్తియుక్త

లము గావలయుననియును సర్వదాయాచార్యుఁడు గోరుచుండును. నానాప్రకారములఁ బ్రయత్నించుచుండును. మనకు మోక్షోపకారియును, జ్ఞానమునను జరిత్రవలనను మనకంటె చాలగొప్పవాఁడును నగు నాచార్యుఁడు మనగభీరభక్తికిఁ బాత్రుఁడు. ఆయనయెడల మనము భక్తి జూపినకొలదిని మనకు మంగళము చేకూఱుచుండును. ఉపాధ్యాయుని సంబంధమునఁ జెప్పిన నియమములన్నిటి ప్రకారము నాచార్యుని విషయమునఁ బ్రవర్తించుచుండుటయేకాక యాచార్యుని విషయమునఁ బ్రవర్తింపవలసిన విశేషకర్తవ్యము లింకనుగలవు. కనుక నాచార్యుని విషయమున నీక్రిందినియమముల ప్రకారము ప్రవర్తించుచుండుట కర్తవ్యము. (౧) ఆచార్యుని దర్శనము గృహమందుగాని యితరస్థలములందుగాని యయినప్పుడు, నాయనయొద్ద సెలవుగైకొను నప్పుడును భక్తితోడఁ బ్రణామమును జేయుచుండవలయును. (౨) ఆచార్యుని నానుకొని కూరుచుండవలదు. ఆచార్యునకుఁ గొంచెము దూరమునందుఁ గూర్చుండవలయును. (౩) ఆచార్యుని యెదుట నమ్రభావమున నుండుము. (౪) ఆచార్యుని యుపాసన లేక యుపదేశము పూర్తియై యాయన లేచునంతవరకును లేచి రాఁగూడదు. లేచివచ్చినచో నాయన విషయమున నీ వన్మానము ప్రకాశమగును. కనుక లేచిరాకుండుటకు సిద్ధపడి యుపాసనాస్థలమునకుఁ బోవలయును. అత్యావశ్యకమగు కార్యముండి లేచివచ్చుట తటస్థించినచోఁ బిమ్మట నాచార్యుని క్షమాపణమును గోరుటయుచితము. (౫) ఉపదేశము పూర్తియయిన తర్వాత సంగతులన్నియు మరల చెప్పఁగలుగునంత శ్రద్ధతో నుపదేశమును వినవలయును. ఉప

దేశము యొక్క భావమును దినచర్య పుస్తకమునందు వ్రాసి యుంచుకొనుట యుత్తమము. (౬) ఉపదేశములోని సంగతులు తెలియనిచో నాచార్యుని బ్రశ్నించి సంగతులు దెలిసికొనుటకుఁ బ్రయత్నింపుము. ఆయనతోడ ననావశ్యకమగు వాదము చేయకుము. ఆయనను వాదమునందు నోడింపవలయునను ప్రయత్నము చేయవలదు. (౭) ఆచార్యుని యుపదేశమును విన్నమాత్రముననే యూఱడిల్లవలదు. ఉపదేశములోని విషయములను జింతనచేసి వాని ప్రకారము నడచుకొనుటకుఁ బ్రయత్నింపుఁడు. (౮) ఆచార్యుఁడు, ప్రజ్ఞావివేకముల వలన దెలిసికొని మనకు ధర్మాధర్మములను నీశ్వరుని నాత్మను బోధించుచుండును. ఇందువలన నాయన యుపదేశములను గ్రహించుచుండుట యుచితము. ఆయన సత్యములని ధర్మములని చెప్పువాని ననేక సమయములయందు మనమును ప్రజ్ఞావివేకముల వలన సత్యములు ధర్మములని తెలిసికొనుచుందుము. అప్పుడప్పుడు దెలిసికొనఁజాలకపోవచ్చును. కాని మన జ్ఞాన మత్యల్పమగుటవలన నాయన వాక్యములలోని సత్యము గ్రహింపఁజాలకున్నామనియుఁ గ్రమక్రమముగ గ్రహింపఁ గలుగుదుమనియు భావించి యుపదేశమును స్వీకరించుట యుచితము. ఆచార్యుఁడు చెప్పిన వానిలో నేదయిన నొకటి యెంతవిచారించినను స్పష్టముగ భ్రమలోఁ గూడుకొన్నదని తోఁచినప్పుడా భ్రమతోఁ గూడుకొనిన దానిని స్వీకరింపకుండుట యుచితము. మఱియును స్పష్టముగ దేనిని భ్రమతోఁ గూడుకొన్న వాక్యమని తెలిసికొనుచున్నామో దానిని యంగీకరించుట యసంభవము గదా. కాని యాచార్యుఁడేదియో యొక భ్రమవాక్యమును

చెప్పినాఁడని భక్తిని జూపకుండుట యుచితముగాదు. (౯) ఆచార్యునియొద్దఁ గనుపడుదోషముల నవలంబింపఁగూడదు. వాని నితరులతోఁ జెప్పి నిందింపఁగూడదు. ఆయన వివేకవంతుఁడును బ్రజ్ఞావంతుఁడు నగుటవలన, నిజదోషములను దెలిసికొనుననియును, లేక శీఘ్రముగ గ్రహింపగలుగుననియును త్వరలో వానిని బరిత్యజించుననియును విశ్వసించియుందుము. ఆయన లోపములకు దుఃఖానుభవమును బొందుచు నాలోపములను దూరముచేయవలయునని పరమేశ్వరునిఁ బ్రార్థింపుము. సామాన్యమగు లోపములనుబట్టి యాయన యుపదేశములను మఱచిపోకుము. ఆయన విషయమున భక్తిహీనుఁడవు గాకుము. (౧౧) నీ సాధ్యమైనంతవఱకు నాచార్యునకు శుశ్రూష చేయుము. తలిదండ్రులమీఁదఁ జూపుభక్తికిఁ దక్కువగాని భక్తిని నాచార్యుని మీఁదఁ జూపుము. ఆయన సంసారములోని వారినందఱను నీసంసారములోని వారివలెఁ జూచుచు నాయన చనిపోయినప్పుడును, లేక, గృహమునందు లేనప్పుడును. గష్టములు సంభవించినప్పుడును సర్వవిధముల వారికి సహాయమును జేయుచుండుము.

మనకు నియమిత ప్రకారము ధర్మోపదేశము చేయువారుగాక ధర్మోపదేశము చేయువారింకను ననేకులు గలరు. జ్ఞానమువలనను జరిత్రవలనను గొప్పవారగు వారియొద్దనుండి మన మనేకసంగతులు గ్రహించుచుందుము. ఇట్టివారందఱును మన భక్తికిఁ బాత్రులు. మనము వారి ధర్మోపదేశములను సత్యములనియు నుపకారకములనియును, విశ్వసించి గ్రహించి పాలనము చేయుచుండుట మనకుఁ గర్తవ్యము. ఇందువలన జగ

త్తునందలి సమస్తమైన వివేకవంతులును, బ్రజ్ఞావంతులును, మనకు నాచార్యులు లేక, యుపదేష్టలవంటివారై యున్నారు. కాని వారియందు నేకొంచె మన్యాయము నసత్యమును గాన్పించినను బరిత్యజింపవలయును.

ప్రశ్నలు.

౧. ఎవరి నాచార్యుఁడందురు?

౨. ఆచార్యుఁడు మన కేమి యుపకారమును జేయును?

౩. "వివేకము, ప్రజ్ఞ, యాత్మకు నేత్రముల వంటివి" అనఁగా నేమి?

౪. ఆచార్యుని విషయమున మొదటి మూఁడు కర్తవ్యము లెవ్వి?

౫. ఆచార్యుని యుపదేశములను వినునప్పుడు పాలింపవలసిన రెండు నియమము లెవ్వి?

౬. ఆచార్యుని యుపదేశములను బాలించు విషయముఁన నియమము లెవ్వి?

౭. ఆచార్యుని విషయమునఁ జివర రెండునియమము లెవ్వి?

౮. నియమితముగ ధర్మోపదేశమును జేయువారు గాక తక్కినవారి విషయమున మనకర్తవ్యము లెవ్వి?

ద్వాదశపాఠము—శాస్త్రములు.

పరమేశ్వరుఁడు మానవ హృదయములందు సత్యమును ప్రకాశింపఁ జేయుచున్నాఁడనియు, సాధుత్వమును మంచికోరికల నుదయింపఁ జేయుచున్నాఁడనియు, నిదివఱకే చెప్పియున్నాము. ఈవిధముగ నీశ్వరుఁడు మానవుల హృదయములం దెన్నియో సత్యములను బ్రకాశింపఁ జేయుచున్నాఁడు. మఱియు నెంతయో సాధుభావమును బోధపఱిచియున్నాఁడు. ఇంకను దెలియఁజేయుచున్నాఁడు. మన భాగ్యమెట్టిదియో యోచించి చూచుకొనుఁడు. ప్రపంచములోని మానవులా మంచిమాటలను నష్టము గానీయక యత్నముతో జాగ్రత్తఁ జేసియున్నారు. మంచివాక్యములను యత్నముతోడ వ్రాసియుంచిన గ్రంథములును, మనుష్యునియొక్క కర్తవ్యములను గుఱించి వ్రాయఁబడియున్న గ్రంథములను శాస్త్రములని చెప్పుదురు. శాస్త్రములు జీవములేని వస్తువులే కాని, శాస్త్రములను లిఖించినవారలు మనభక్తికి పాత్రులగుటవలనను, శాస్త్రములయందు, వారి యుపదేశములును, జీవితవిషయములును వ్రాయఁబడి యుండుటచేతను శాస్త్రములు మనకుఁ బరమాదరణీయమైన వస్తువులు. ఉపాధ్యాయునియొక్కయు నాచార్యునియొక్కయు నుపదేశములను వినుటవలన నుపకారమును బొందు విధముననే శాస్త్రములను జదువుకొనుటవలన మన ముపకారమునుబొందుదుము. మన మనేక సమయములయందు కర్తవ్యములనుమఱచి పోవుచుందుము. మఱియు నప్పుడప్పుడు దెలిసినవానినిగూడ

మఱచి పోవుచుందుము. శాస్త్రములు వీనినన్నిటిని మనకు మఱవకుండఁ జేయుచుండును. మన మనేక సమయములలో యోచించనందువలనఁ గర్తవ్యములను దెలిసికొనఁజాలని వార మగుదుము. శాస్త్రములు చదువుటవలన మన మనమునందు విచారణ ప్రారంభమగును. అందువలన నుజ్జ్వలరూపమున మన కర్తవ్యములను దెలిసికొనఁ గలుగుదుము. సహాయము లేక విచారించుటవలన మన మనేక సత్యములను దెలిసికొనఁజాలక పోదుము. శాస్త్రములను జదువుటవలన జ్ఞానులయొక్క యున్నత భావములు మనమునఁ బ్రవేశించును. వారు చెప్పిన సత్యములను దెలిసికొందుము. ముఖ్యముగ శాస్త్రములయందు సాధువులయొక్క యుత్కృష్టచరిత్ర విషయములను జదువుటవలన, మనమును వారివలె నుత్కృష్టచరిత్రగలవార మగుటకుఁ బ్రయత్నింతుము. ఈకారణముల వలన శాస్త్రములను శ్రద్ధతోఁ జదువుట మన కర్తవ్యము.

నిన్నెఱిఁగిన యేబాలుఁడైనను నితరులయెదుట, నిందించినచోఁ నాబాలునిమీద నీకుఁ బూర్తిగఁ గోపము వచ్చినదనుకొనుము. వాఁడు నీకుఁ గనుపడినప్పుడు కఠినమగు మాటలచే వానిని దిట్టితి ననుకొనుము. తిట్టినతరువాత మంచిపనిని జేసినానని దలంప వచ్చును. కాని యొకపుస్తకమును జదువుటకుఁ బ్రారంభించి యందులో "అపకారికి, నపకారము చేయుటమంచిదిగాద"నియును నందువలన వానిమనస్సు మిక్కిలి చెడుననియును వానిలో నపకారము చేయవలయునను నిచ్ఛమఱింత వృద్ధిఁబొందుననియును, వానిని గోపింపక యుపకారముఁ జేసినచో వాఁడు నిజదోషములను శీఘ్రముగఁ దెలిసికొని తన చెడు

స్వభావమునకు సిగ్గును దుఃఖమును బొందు మనియును గల యుపదేశమును జదివినప్పుడు నీవుచేసినపని బాగుగనుండ లేదనియు నిఁకముందెప్పుడు నిట్టి కార్యములను జేయుట యుచితము గాదనియుఁ దెలిసి కొందువు. కథలతోడను నవ్వులతోడను వినోదములతోడను గాలము వృథాపుచ్చుట యనుచితమని నీకుఁ దెలిసియుండవచ్చును. నీవేదయిన పుస్తకముసంపుఁ గాలము, నిమిషముల తర్వాత నిమిషములు గంటల తర్వాత గంటలు గతించి పోవుట నీకుఁ దెలియు దనియును బోయిన కాలమెప్పుడును రాదనియును బెక్కండ్రు వ్యర్థముగాఁ గాలమును బోగొట్టుకొనుచున్నారనియు నామోదప్రమోదముల క్రింద వ్యర్థముగఁ బోయిన కాలమును జ్ఞానము సంపాదించుట కొఱకు గాని, ధర్మవిచారణయందుఁగాని లేక పరోపకారమునకుఁగాని వినియోగపఱచినచో, నీకు నితరులకు నెంతయో మేలుగలుగుననియును, గాలమును వృథాపుచ్చుటవలనఁ గలుగు నష్టము నీ జీవితమునం దెప్పుడును బూర్తిగా దనియును, మొదలు గాఁగల సంగతులను జదివిన తర్వాత నీమనస్సు నిద్రనుండి లేవకుండునా! వ్యర్థముగఁ గాలమును బుచ్చినందులకు విచారింప కుందువా! ఇఁక ముందెప్పుడును గాలమును వృథాపుచ్చనని స్థిరసంకల్పము చేసికొనకుందువా!

దుష్టులు సాధుమానవుల నెట్టి కష్టములను బెట్టినను నిప్పులలోఁ బడఁద్రోసి తగులఁబెట్టినను, అసత్యవ్యవహారములకు సమ్మతించక తమప్రాణములకంటెను సత్యము నెక్కువగఁ బ్రేమించి సత్యమును రక్షించుకొనుచు వచ్చిరని చదువునప్పుడు మనకు సత్యమునం దధికానురాగమును, నసత్యవ్యవహారము

లయం దసహ్యతయును గలుగ కుండునా? ధనము సుఖము గల సంసారము లందలి స్త్రీపురుషులు నిజసుఖములను బరిత్యజించి వైద్యాలయము లందలి రోగులకును బిచ్చివాండ్రు వైద్యాలయములయందలి పిచ్చివాండ్రకును, కారాగారాముల యందలి ఖైదీలకును సేవలు చేయుచు దినములు, దినములు గడపినారని చదువునప్పుడు మనస్సునం దుత్సాహము వృద్ధిగాకుండునా? సోమరితనము వదలి మానవసేవం జేయుటకు స్థిర సంకల్పము గలుగదా!

ఇందువలన శాస్త్రములను బఠించినచో మనకెట్టియుపకారము గలుగునో తెలిసికొనం గలుగుదుము. కావునం బరమోపకారకము లైన శాస్త్రములను జిరస్నేహితులనుగం దలంచి యుండుట యుచితము. ఎప్పుడును శాస్త్రములను నిర్లక్ష్యము చేయం గూడదు. శాస్త్రములను జదువుటయం దెప్పుడు నశ్రద్ధ చేయ గిట్టదు. ఉపాధ్యాయులును, నాచార్యులును చేయునుపదేశములను శాస్త్రములయందలి మంచివాక్యములను, దృష్టాంతములను మనస్సు నెదుట నెప్పుడు నుంచుకొనువారలకు, దుష్టభావములు దుష్టములగు తలంపులును మనమునందుం బ్రవేశింపవు. పాఠశాలలోం జదువుట యందును, ఇంటిలోం బనిపాటలయందును గొంతకాలము గడపి, మిగత కాలము వ్యర్థముపుచ్చుటవలనను, బనికిమాలిన కోరికలు, పనికిమాలిన మాటలు నవ్వులు మొదలగువానితోం గడుపుచుండువాని మనస్సు, అన్యాయపుం గోరికలతోం బూర్ణమైయుండును. మఱియును వారు, సహజముగం బరులను నిందించుట యందును బరులకపకారము చేయుటకును బూనుకొందురు.

కాన బాలకాలయందు జదువవలసిన నియమితగ్రంథ ములు కాక నియమానుసారముగ శాస్త్రగ్రంథములను జదువు కొనుచుండవలయును. సమయము దొరికినపుడెల్లను సాధు పురుషుల జీవనచరిత్రములు నుపదేశపూరితమగు గ్రంథములను జదువుకొనుచుండవలయును. శాస్త్రములను జదువుటయందు నీ క్రింది నియమములను బాటించుటయుచితము. (౧) ఏశాస్త్రము ను జదువుటవలన నీకుపకారముగలుగునో దానిని నీవుస్థిరపఱ చుకొనుట కఠినము. కనుక దల్లితండ్రి యాచార్యుడు మొద లగు జ్ఞానులు చెప్పినశాస్త్రములను జదువుకొనుము. (౨) ప్రథ మము దినమున కొకమారైనను శాస్త్రమును జదువుము. మన కుపకారకరమగు కార్యమును శ్రద్ధతో జేసినకొలది నది మంచిది. అందువలన దినమునకొకమారు శాస్త్రమును జదువుట గొప్ప లోనిది కాదు. ప్రతిదినమును జదువనిచో జదువుట కభ్యాసము కుదురదు. మఱియును, ప్రతిదినమును సదుపదేశములు సదు పమానములు మనమునకు రానిచో మనమనస్సు నీచత్వమును బొందును. (3) శాస్త్రములను గ్రహించుచు చదువుము. చదువునప్పుడు తెలియని యంశముల నాచార్యుడు మొదలగు వారియొద్దనడిగి తెలిసికొని చదువుకొనుము. శాస్త్రములయం దలి యుపదేశములను జింతన చేయుటయే కాక పాలనముచే యుటకు బ్రయత్నింపుము. (౪) ఒకగ్రంథము నొకమారు చదివిన తర్వాత దిరిగి చదువుటవలన బ్రయోజనము లేదని తలంపగూడదు. ధర్మగ్రంథములను మాటిమాటికిని జదువుట వలన గ్రంథములందలి సదుపదేశములు సదుపమానములు చిర దినముల వఱకును మనస్సునందు నిలిచి యుండును. అందువలన

మనస్సు పవిత్రమగును. చరిత్రము బాగుపడును. ధార్మికమానవు లందఱును మంచి మంచి శాస్త్రగ్రంథములను బెక్కుమాఱులు పఠించియున్నారు. మహాపురుషుల జీవితచరిత్రముల నన్నిటిని జదివియున్నారు. ఈ చదువు, వారి చరిత్రోన్నతికి ముఖ్యకారణమని తెలిసికొనుము. ౧౫, ప్రజ్ఞావివేకముల ప్రేరణమువలన శాస్త్రకర్తలు శాస్త్రములను రచియించియున్నారు. కనుక శాస్త్రములను జదివినచో మనప్రజ్ఞావివేకములు ప్రకాశమానము లగునుగాన శాస్త్రములు మన కాదరణీయములు. ప్రజ్ఞావివేకములు మనకు మాననీయము లగుటవలన శాస్త్రములు ముఖ్యముగ మనకు మాననీయములు. వివేకము దేనిని చేయుమని ప్రేరేపించుచుండునో యేది ధర్మమో దానిని జేయుట యుచితము. ప్రజ్ఞ దేనిని జెప్పునో దానిని సత్యమని విశ్వసించుట యుచితము. కాని, యేదయిన పుస్తకమునందుఁ జెడుకార్యములు చేయుమని యుపదేశములున్నచో వానిని బాలనము చేయనక్కఱలేదు. మఱియు నే గ్రంథమునందైనను భ్రమతోఁ గూడుకొన్న వాక్యము లున్నచో వానిని విశ్వసించుట యుచితముగాదు. స్వల్పదోషములు స్వల్పభ్రమలును గలవని విస్తారజ్ఞానపూర్ణములును బరమోపకారకములును నగు శాస్త్రముల నాదరింపకుండుట యుచితముగాదు.

ప్రశ్నలు.

౧. దేనిని శాస్త్రమందురు?

౨. ఎందువలన మనకు శాస్త్రము లాదరణీయములు?

౩. శాస్త్రమును జదువుటవలన మన కెట్టి యుపకారము గలుగును?

౪. శాస్త్రములను జదువుటవలనఁ గలుగు నుపకారములను గొన్నిటిని జెప్పుము.

౫. శాస్త్రములను జదువుటను గమనింపవలసిన నియమము తెల్పు.

త్రయోదశపాఠము—ముక్తి, ఉన్నతి.

వివేకము వలన నీశ్వరేచ్ఛను దెలిసికొన నగునని నీకుఁ దెలియ దనుకొనుము. ఈ పుస్తకమును జదువుటవలన నీ సంగతిని గ్రహించినా ననుకొనుము. కనుక నీవు పుస్తకమును జదివి నీ యజ్ఞానమునుండి, ముక్తిలాభమును, బొందితివి. నీ మనస్సును బంధించిన యజ్ఞానబంధనము లీపుస్తకమును జదువుట వలన విడిపోయినవి. అట్లుగా, జ్ఞానము లేని నీవు జ్ఞానమును బొందితివి. పూర్వముకంటె జ్ఞానము వృద్ధియగుటవలన నీవు జ్ఞానోన్నతి లాభమును బొందితివి. ఈకార్యమును రెండుభావములుగఁ జెప్పవచ్చును. (౧) ముక్తిని బొందుట (౨) ఉన్నతిని బొందుట.

నీ చెల్లెలిమీఁద నీ కంతగాఁ బ్రేమ లేదనుకొనుము. స్వల్పకారణములవలన నామెతోఁ బోట్లాడుట సంభవించిన దనుకొనుము. సామాన్యమైన యన్యాయకార్యమును జేసినందువలన నామెమీఁద నీకు విస్తారము కోపము గలిగిన దనుకొనుము. ప్రేమ లేకుండుటయునుఁ గోపము చెందియుండుటయును గొప్ప యధర్మములని నీవు దెలిసికొనునప్పుడు కోపము రాకుండుటకుఁ

బ్రయత్నింతువు. నీవామెకు ఫలాహారములను బెట్టి యాడుకొను వస్తువులనిచ్చి పాఠమును జెప్పుట మొదలగు కార్యములను జేసినచో నీకామెయెడల విస్తారము ప్రేమగలుగును. కార్యము వలనఁ బ్రేమ కుదిరినది. నీమనస్సునందుఁ గోపము పోయినది. మనస్సునందుఁ బ్రేమప్రవేశించినది. ఈకార్యమునుగూడ రెండు విధములుగ వర్ణింపవచ్చును. (౧) ఆప్రేమ కోపము నుండి ముక్తిలాభమును బొందినావు. (౨) ప్రేమోన్నతి లాభమును బొందినావు. ఒకనికి మనస్సునందహంకారము ప్రబలముగఁ గల దనుకొనుము. అనఁగా, నేను బాగుగఁ బాఠమును నొప్పగింపఁగలను, బాగుగ లెక్కలను వేయఁగలను, బాగుగ వ్యాసములు వ్రాయఁగలను, బాగుగ సంగీతము పాడఁగలనని సర్వదా భావించుచు నెప్పుడును బంధువుల యొద్దను స్నేహితుల యొద్దను దన సమర్థతను జెప్పుకొనుచు, నెల్లప్పుడు దన్నుఁదాను బొగడుకొనుచుండు ననుకొనుము. వాఁడొకదినమున నుపాధ్యాయుని వలన, నా యహంకారము చెడులక్షణ మనియును, నీ యహంకారము గలవారలు మహాపాపులనియును, వినినప్పటి నుండియు నహంకారమును విడుచుటకుఁ బ్రయత్నించు చుండునుగదా మఱియును వాఁడు తనకంటె బాగుగ వ్యాసములు వ్రాయగలవారును జక్కఁగ సంగీతమును బాడఁగలవారు నగు బాలురను జూచినప్పుడుఁ గొంచె మప్పగించఁ గలిగినను వ్రాయఁగలిగినను పాడఁగలిగిన నాకొంచెము శక్తియును వారి నిజశక్తి గాదనియు నీశ్వరుఁడు సర్వదా మన మనస్సునకును, శరీరమునకును శక్తి నిచ్చుటవలన మన మీకార్యములను జేయఁగలుగుచున్నామనియును, నాయన యొక్క నిమిషము శక్తినీయని యెడల మన స

మస్తకార్యములును నిలిచిపోవుననియును మొదలగు సంశయములను భావనచేసి యీశ్వరుని సమీపమునఁ బ్రార్థనఁ జేయుటవలనవాఁ డహంకారమునకు దూరమగును. వాని మనమున వినయము ప్రవేశించును. దీనిని రెండు విధములుగఁ జెప్పవచ్చును. (౧) అహంకారమునుండి ముక్తిలాభమును బొందినాఁడు. (౨) వినయమువలన నున్నతి లాభమును బొందినాఁడు.

మీరిపుడు ముక్తియని దేనినందురో యున్నతియని దేనినందురో గ్రహించియె యుందురు. "ముక్తి" "ఉన్నతి" యనునవి యొకటే వస్తువని తెలిసికొనుఁడు. మొదటి యుపమానమును జ్ఞానసంబంధమునను, రెండవ యుపమానము ప్రేమసంబంధమునను, మూఁడవయుపమానము పవిత్రతసంబంధమునను, సూచించి యున్నాను. అజ్ఞానమును విడనాడి జ్ఞానమును బొందుట యప్రేమను వదలి ప్రేమలాభమును బొందుట యపవిత్రతను ద్యజించి పవిత్రతాలాభమును బొందుటపేరే ముక్తియందురు. మఱియును దీనిపేరే యున్నతియందురు. ముక్తిలాభమును బొందుట, జ్ఞానము ప్రేమ పవిత్రతలవలన నున్నతిలాభమును బొందుటయే మనకుఁ బరమ మంగళప్రదము. ఇదియె మనజీవితము యొక్క ప్రధానకార్యము. ఈకార్యము రాఁగల కాలమున నెప్పుడో యొకప్పుడు చేయవచ్చునను కార్యముగాదు. ఈకార్యమును మన మెప్పుడును చేయుచున్నాము. మఱియును, జేయుచుండవలయును. మీరు ప్రతిదినము పాఠమును జెప్పించుకొని చదువుటవలన మీరజ్ఞానమునుండి ముక్తిలాభమును బొందుదురు. మఱియును జ్ఞానోన్నతిని బొందుదురు. ప్రతిదినము తల్లి, తండ్రి, అన్న, అక్క, తమ్ముఁడు, చెల్లెలు మొదలగువారికి సేవ

చేయుటవలన నప్రేమనుండి ముక్తిని బొందుదురు. మఱియును ప్రేమోన్నతి లాభమును బొందుదురు. ప్రతిదినమును చెడు కోరికలు చెడుమాటలు చెడుకార్యములు పరిత్యజించి మంచి కోరికలు మంచిమాటలు మంచికార్యములు చేయుచుండుటవలన నపవిత్రతనుండి ముక్తిని బొందుదురు. పవిత్రోన్నతిలాభమును బొందుదురు. ముక్త్యున్నతుల లాభములను బొందుటయే మనయొక్క సకలకార్యములకును లక్ష్యము. మనము దీనికొఱకై యనేక కార్యములను జేయుచున్నాము. అన్ని సత్కార్యములందును దీనిలాభమును బొందుచున్నాము. ఈశ్వరుఁడందఱ మనస్సులయందుండి వివేకము మూలమున ధర్మాధర్మములను దెలియఁజేయుచున్నాఁడు. ప్రజ్ఞమూలమున సత్యాసత్యములను దెలియఁజేయుచున్నాఁడు. సకలదేశములయందును సకలకాలములయందును ప్రజ్ఞావివేకములవలన నడుపఁబడుచుండిన జ్ఞానులు సాధుపురుషులు ననేకోపదేశములుచేసి శాస్త్రములు లిఖించి మనకు మహోపకారము నొనర్చియున్నారు. మన మీసమస్తమైన సాధుపురుషుల యొక్కయు శాస్త్రముల యొక్కయు సహాయమును బొందుటవలన ముక్తియున్నతుల లాభములను బొందుదుము. దయామయుఁడును సమస్తమైన వారిని ప్రేమించువాఁడు నగు నీశ్వరుఁ డెల్లమానవులకును ముక్తిని ప్రసాదించును. ముక్తినుండి యెవరిని వంచింపఁడని సహజముగ మనము దెలిసికొనవచ్చును.

ఈశ్వరుఁడు సమస్తదేశములయందును సమస్తకాలములయందును సకలసాధుపురుషులను సకల శాస్త్రములను నేర్పాటు చేసియున్నాఁడు. అందువలన నెవరో యొక సాధుపురుషుని యు

పదేశమును మాత్రమేకాని యేదో యొక శాస్త్రమును మాత్ర
మేకాని మన్నించనందువలన ముక్తిరాదనుట సత్యముగాదు.
సత్యప్రేమ పవిత్రతలే ముక్తి. ఏ యాచార్యునివలనఁ గాని యే
శాస్త్రములవలనఁగాని దీనిలాభమును బొందినను బొందకున్నను
నిదియొక వస్తువే. ఆచార్యులు శాస్త్రములు భిన్నాభిప్రాయ
మును బొందవచ్చునుగాని సత్యము మాత్రము భిన్నముగాదు.
“ఈశ్వరప్రియకార్యములు చేయుట యుచితము” ఇది యొక
సత్యము. దీనివలనముక్తిగలుగును. ఈవాక్యమును మన దేశము
నందుజన్మించిన యాజ్ఞవల్క్యమునియును, యూదుదేశమునందు
జన్మించిన సాధుపురుషుడగు యేసుక్రీస్తును నరబ్బీదేశమునందు
జన్మించిన సాధుపురుషుఁడగు మహమ్మదును జెప్పియున్నారు.
ఈసత్య ముపనిషత్తులు, బైబిలు, ఖొరానులయందును వ్రాయ
బడియున్నది. ఈసత్యమును ముగ్గురు సాధుపురుషులు చెప్పుట
యందును మూఁడుశాస్త్రముల యందలి వ్రాఁతలయందును
గొంచెమైనను భిన్నముగాక యేకత్వమును బొందుచున్నది.

ఇందువలన నీ సత్యము నెవరి ముఖమునుండి వినినను,
నేశాస్త్రమును జదివి తెలిసికొన్నను మనకు ముక్తిగలుగును.
ఈ సత్యమును క్రైస్తవులయొక్క బైబిలునుండియే దీసికొన
వలయుననియు, నటుగానిచో ముక్తిరాదనియు నెవరైనఁ
జెప్పవచ్చును గాని యీమాటలు నిజముగావని సహజముగఁ
దెలిసికొందుము. ప్రేమను బవిత్రతను నుపదేశించిన సాధుపురు
షులే దేశమువారైన నేకాలమువారైనను సత్యము ప్రేమ పవి
త్రతనుగూర్చి వ్రాయఁబడియుండిన శాస్త్రము లేదేశములోని
వైన నేకాలమునందలి వైనను మన గభీరభక్తికిఁ బాత్రములు.

ముక్తికి సహాయముచేయు విషయము లెచ్చట దొరికినను మన మాదరముతోడ గ్రహించుట యుచితము.

ప్రశ్నలు.

౧. దేనిని ముక్తియందురు?

౨. దేనిని ఉన్నతియందురు?

౩. ముక్తి, యున్నతి యొకటేయని యుపమానముల వలన ఋజువుచేయుము.

౪. జ్ఞానోన్నతి కొక యుపమానమును జూపుము.

౫. ప్రేమ పవిత్రతల కొక యుపమానమును జూపుము.

౬. ప్రతిదినమును ముక్తిలాభమును బొందవలయునను వాక్యమున కర్థమును జెప్పుము.

౭. దేనివలన ముక్తి గలుగును?

౮. "ఏదోయొక శాస్త్రమును మన్నించ నందువలన ముక్తిరాదు" అనువాక్యమునందలి భ్రమను జూపింపుము.

౯. మహాపురుషులు సాధువులు, భిన్నభిన్న శాస్త్రములు నను నీ విషయమున మనకర్తవ్యమెద్ది?

చతుర్దశపాఠము—పరకాలము.

ఆత్మ, శరీరము వేఱువేఱు పదార్థములని మీరు పంచమపాఠమునందుఁ జదివియున్నారు. కాన నీ భిన్నత్వమును

బాగుగ గ్రహింపుడు. ఆత్మ శరీరమును దెలిసికొనును. మఱియును దన్నుఁదాను జ్ఞాతయని తెలిసికొనును. కాని శరీరము తన్నుఁ దాను దెలిసికొనఁజాలదు. ఆత్మనుగూడఁ దెలిసికొనఁజాలదు. ఆత్మ శరీరమును నడిపించును. మఱియును శరీరము మూలమున నన్యవస్తువులను నడిపించునుగాని, శరీరము తన్ను దానుగాని, యేకొంచము నైనవానిఁగాని నడిపింప జాలదు. శరీరమింకొకదాని వలన నడిపింపఁబడును. అనఁగా శరీరము “జడము” ఆత్మ “చేతనము” ఇదియే వీని భేదము.

ఆత్మ శరీరములు భిన్నములైనప్పుడు శరీరము నష్టమైనచో నాత్మకూడ నష్టమగునని తలంచుట యుచితము గాదు. మరణించినచో శరీరము యొక్క సమస్త కార్యములు నిలిచిపోవును. ఉచ్ఛ్వాస నిశ్వాసములు నడచుట, రక్తము క్రిందికి మీఁదికిఁ బారుచుండుట మొదలుగాఁగల కార్యము లన్నియు నాఁగిపోవును. ఇందువలన నాత్మగూడ మరణించినదని చెప్పుటకుఁ గారణములులేవు. జ్ఞానము, ప్రేమ, భక్తి, మంచికోరికలు, మంచిప్రతిజ్ఞలు మొదలగు కార్యములన్నియును ఆత్మవైయున్నవి. కాని, శరీరమునకు లేవు. ఈసకల కార్యములు నాత్మ శక్తివలన నగుచున్నవి.

ఈశ్వరుఁడు మనలఁ బ్రేమించుచుండువిషయము షష్ఠపాఠమునందుఁ జదివియున్నారు. ఈశ్వరుఁడు తాను బ్రేమించుచుండువారినెందులకుఁ జంపివేయును; ప్రేమాస్పదమైనవానినెప్పుడును దనయొద్ద నుంచుకొనుటకు నిచ్ఛగలుగును. వానిని దూరముగనుంచినచో మిక్కుటమగు కష్టము గలుగును. ఇందువలన వానిని జంపివేయుట యసంభవము. ఈశ్వరుఁడు

మనశరీరము నెప్పుడో యొకప్పుడు నశింపఁజేయు ననుటకు సందియము లేదు. శరీరముతోఁగూడ నాత్మనుసయితము నశింపఁజేసినచో నీశ్వరుఁడు కఠినుఁడని చెప్పవలసివచ్చును. ఆయనను దయామయుఁడని చెప్పుటకువీలు లేదు. దయామయుఁడును మనలఁ బ్రేమించువాఁడును మనమంగళమును గోరుచుండువాఁడును, నగు నీశ్వరుఁడు మనలను జంపివేయుననుటను గొంచమైనను విశ్వసింపరాదు.

ఆయనమనచేతఁ జేయించుకార్యములను జూచినచో మనలను జంపివేయునని నమ్ముటకు వీలు లేదు. ఆయనజగత్తునం దేవిధమగువ్యవస్థనుఁగల్పించియున్నాఁడో యాయనజగత్తు నేవిధముఁగ నడిపించుచున్నాఁడో భావించిచూడుము. ఇందువలననన్నియాత్మలయొక్క క్రమాగతజ్ఞానము, ప్రేమ, భక్తి, పవిత్రత, మొదలగు మంచిగుణము లన్నియును, గలుగుచున్నవి. ఈక్రమోన్నతివిషయమును మీరు బాగుఁగ యోజించి చూడుఁడు. పిత, మాత, ఆచార్యుఁడు, ఉపాధ్యాయుఁడు, శాస్త్రములు మొదలగువాని సహాయమున మనము క్రమాగతముగ ధర్మశిక్షను బొందుచున్నాము. విద్యాభ్యాసము, ఉపాసన, మంచికోరికలు, మంచికార్యములు, మొదలగువాని మూలమున నాత్మ క్రమముగ, జ్ఞానియును, ప్రేమగలదియును, బవిత్రము నగుచున్నది. ఈయున్నతియే మనకుఁ బరమమంగళప్రదము. ఈమంగళముకొఱకుఁ గాను మనము నేకసమయములం దనేక కష్టములను బడుచుందుము. విద్యనభ్యసించుటకెన్నియో కష్టములను బొందవలయునుగదా. చెడుకోరికలు చెడుతలంపులు దూరము లావుట కెంతయో

యాయాసమును బొందవలయునుగదా. ఇతరులకు శుశ్రూష
లు చేయుటవలన నెంతయో శ్రమగలుగునుగదా.

ఆత్మ యున్నతిని జెందుటకు మనమెన్నియో కష్టములను ధైర్యముతో సహింతుము. మనయున్నతి లాభమును బొందుటయే యీశ్వరేచ్ఛయని సహజముగఁ దెలిసికొనఁ గలుగుదుము. ఆయన కీయిచ్ఛ లేనిచో వివేకమువలన నెల్లపుడును ధార్మికులుగండని చెప్పుచుండడు. మనము ధార్మికులముగావలయునని యాయన తలఁపకున్న యీ యసంఖ్యేయ వస్తువులను జేసి యుండఁడు.

కనుక నసంఖ్యోపాయములతో మన యాత్మోన్నతి నిమిత్తము సదుపాయములను జేసియున్న యీశ్వరుఁ డాత్మలను జంపివేయునను విషయమును భావించి చూచిన విశ్వసింపనగునా? రెండుమూఁడు దినముల తరువాతఁ జంపవలయునను కోరికగల వాఁడు మనయున్నతి కన్ని వస్తువులను సిద్ధముచేయఁడు. ఈప్రయత్నములవలన నాత్మను చిరకాలము రక్షించి, క్రమాగతోన్నతి కెక్కఁ జేయుటయే యీశ్వరేచ్ఛయని ప్రకాశమానమగుచున్నది. ఆత్మవినాశమువలన జ్ఞానము, ప్రేమ, పవిత్రత, నష్టమగును. ఎంతో ప్రయత్నముతోడ జ్ఞానమును బవిత్రతను బ్రేమను సమకూర్చిన యీశ్వరుఁ డొక్కపెట్టున వీనినన్నిటిని వినాశము జేయుననుమాట విశ్వసింపఁదగినదిగాదు. ఇందువలన నాత్మకు మరణము లేదని తెలిసికొనుచున్నాము. ఈశ్వరుఁడు చేయు నాశనము వలనను దీనికి నాశనము లేదు. శరీరము నాశనమైనపిమ్మట నీశ్వరుఁడాత్మ నేయుపాయమున నున్నతికిం దెచ్చునో, యేభావమున నుంచునో యనుసంశయమును మనము నిశ్చిత

రూపమునఁ దెలిసికొనఁజాలక పోవచ్చును. స్పష్టముగ గ్రహింప లేక పోవచ్చును. కాని యీశ్వరున కాత్మయందుఁగల యపార ప్రేమనుబట్టియు నాత్మయొక్క క్రమోన్నతిని నాత్మకు మరణము లేదని మనముస్పష్టముగఁ దెలిసికొనుచున్నాము. మరణమునకుఁ బూర్వమందును, బరమందు నాత్మగలదు.

ప్రశ్నలు.

౧. ఆత్మకును శరీరమునకును భేద మెక్కడ?

౨. "శరీరనాశనముతోఁబాటు ఆత్మనాశనమును బొందును" ఈ వాక్యమునందు గల భ్రమను జూపుఁడు.

౩. ఎందువలన నీశ్వరుఁడు మనలనువినాశము చేయఁడు?

౪. ఆత్మయొక్క క్రమోన్నతి యను వాక్యమున కర్థ మేమి?

౫. ఈశ్వరుని యిచ్ఛ క్రమోన్నతియని యెటులు తెలిసికొన నగును?

౬. ఆత్మయొక్క క్రమోన్నతిని జూచి పరకాల సంబంధమున నేమి గ్రహింపఁగలుగుదుము?

పంచదశ పాఠము—జాతిభేదము.

మనుష్యులంద ఱీశ్వరపుత్రులు. అందువలన, నేమనుష్యుఁడును మన యసహ్యతకుఁ బాత్రుఁడుగాఁడు. సమస్తమైన వారిని నొకతండ్రియొక్క బిడ్డలువలె భావించి ప్రేమించుట యు

చితము. చేతనైనంతవఱకు నెల్లవారికి నుపకారమును జేయుట యుచితము. ఒకయర్థమున మనుష్యులెల్లరు నొకేజాతివారు అనఁగా మనుష్యజాతి అయినను భిన్న భిన్న దేశములయందు వాసముచేయుచుండుట వలనను భిన్న భిన్న భాషలను మాట్లాడుచుండుట వలనను నితర కారణముల వలనను మనుష్యులలో మనుష్యులకు భేదము లేర్పడినవి.

ఇంగ్లండు దేశవాసులకును నాంధ్రదేశవాసులకును గల భేదము మనము సహజముగఁ దెలిసికొనఁ గలుగుదుము. వారి వేషభాషలకు నాకారమునకును, మనవేషభాషలకు నాకారమునకును భేదముగలదు. ఇంక ననేకవిషయములలో వారికిని మనకును భేదముగలదు. ఈకారణములవలన వారికిని మనకును జాతిభేదమేర్పడినది. వారింగ్లీషుజాతివారు. మన మాంధ్రజాతివారము. కాని జాతిభేదమున్నదని వారిని రోఁతగఁజూడఁజనదు. వారు మనలనట్లుచూడఁజనదు. మనము హేయముగఁ జూడకుండుటయేకాక వారితో మనము మిక్కిలి స్నేహముగ నుండవలయును. మనగృహములయం దచ్చటచ్చట జరుగు వివాహములలో మర్యాదగల యింగ్లీషుజాతిలోని స్త్రీ పురుషులు మన ప్రక్కను గూర్చుండుటను మీలోఁగొందఱు చూచియుండవచ్చును. ఇందేవిధమగునష్టమును లేదు. పరిశుభ్రమగు వస్త్రములను ధరించి పరిశుభ్రముగనుండు భిన్నజాతి మనుష్యులు మనతోఁగూర్చుండి భుజించుటవలనఁగాని, మన భోజనపదార్థములు ముట్టుకొనుటవలనఁగాని యేవిధమగు దోషమునులేదు. ఎవరైనను వారిని భిన్నజాతివారని యసహ్యించుకొనినను, వారి సరసను గూర్చుండి భుజించుట కిష్టపడనియెడల నట్టివారి యస

హానము మిక్కిలి యన్యాయ్యమని స్పష్టముగఁ దెలిసికొనవలయును.

మనదేశమునందుఁ బూర్వకాలమునుండియు దేవపూజ చేయుచుండువారిని బ్రాహ్మణులని చెప్పుచుండిరి. పూర్వపురుషులు బ్రాహ్మణులై యున్నవారు దేవతాపూజచేసినను జేయకున్నను బ్రాహ్మణులని పిలువఁబడుచున్నారు. సేవకావృత్తియం దుండువారిని శూద్రులని చెప్పుచుండిరి. పూర్వపురుషులు శూద్రులై యున్నవారు సేవావృత్తియందున్నను, ఉండకున్నను, శూద్రులని చెప్పంబడుచున్నారు. నీవు బ్రాహ్మణవంశజుఁడవనుకొనుము. నీస్నేహితుఁడు శూద్రవంశజుఁ డనుకొనుము. మీపూర్వ పురుషులు భిన్నభిన్న వ్యాపారములు చేయుచుండిరనుకొనుము. ఇప్పుడును మీ యిరువురి తండ్రులు భిన్న భిన్న వృత్తులయం దున్నారనుకొనుము. కాని మీరిరువురు నాంధ్రులు. ఇందువలన నింగ్లీషువానికిని నీకును గలభేద మిచ్చట లేదు. ఇచ్చట వృత్తివలననే భేదమేర్పడినది. ఈ కార్యభేదము వలన నీవును నీ స్నేహితుఁడును భిన్నజాతీయులుగారు. మీరిరువురు నొకజాతివారే. మీరిరువు రాంధ్రజాతిలోని వారనుట సత్యము. ఇంగ్లీషువారును ఆంధ్రులును సహపంక్తిని గూర్చుండుటకును భుజించుటకును నేవిధమగు నభ్యంతరమును లేనప్పుడు మీరిరువు రాంధ్రులును, గూర్చుండుటలోను భుజించుటలోను నణుమాత్రమైనను దోషము లేదు. నీవు నీ స్నేహితుని శూద్రుఁడని చెప్పి యసహ్యించుకొని వానితో భుజింపకుండుట మిక్కిలి యన్యాయ్యము. ఈవిధముగ నసహ్యించుకొనుట యీశ్వరేచ్ఛగాదు.

చాకలిపని మొదలగు కార్యముల చేయుటకు విస్తారము విద్యాబుద్ధు లనావశ్యకములు. ఈకార్యములను గొందఱు నీచ కార్యములని చెప్పుటయెకాక యీపనులను జేయువారిని నీచ మానవులనియు నల్పులనియును జెప్పుచుందురు. ఈవిధముగఁ బలుకుట న్యాయముగాదు. ఏకార్యమును జేయువారాకార్యమును జేయనిచో మనపని సాఁగదుగదా. మనకు మిక్కిలి ప్రయోజనకరమగు కార్యములను నీచకార్యములని చెప్పుటతగదు. అన్యాయకార్యములను నీచకార్యములని చెప్పుట యుత్తమము. అన్యాయకార్యములు చేయువారిని నీచమానవులని చెప్పుట యుత్తమము. ఇందువలన, మంగలి, చాకలి, కూలి మొదలగు వారి నెప్పుడును నీచులని చెప్పఁగూడదు. అసహ్యించుకొనఁ గూడదు.

మంచివస్త్రములు ధరించిన శుచియగు చాకలిస్త్రీ మీగృహమునకు వచ్చినదనుకొనుము. నీవాసమయమున భుజించుచుందువు. ఏదోయొక కారణమున నిన్ను ముట్టుకొన్న దనుకొనుము. ఇందువలన నన్నము మైలపడినదని పాఱవేసినచో భ్రమయును నన్యాయము నగును. ఆమెను నసహ్యించుకొనుటకు నే విధమగు కారణమును లేదు. ఆమె నిన్నుఁదాకుటవలన నీయన్నమునకుఁ గొంచమైనను నష్టముగలుగలేదు. కనుక నీశ్వర సంతానము నీవిధముగ నసహ్యించుకొనుట పాపమని తలఁచి యసహ్యమును విసర్జింపుము. ఈవిధముగ నసహ్యించుకొనుటను మనదేశమునం దనేకులలోఁ జూచుచున్నాము. జాతిభేదము లేనిచోట జాతిభేదమును గల్పించియున్నారు. ఇందువలన నొక జాతియింకొకజాతిని నసహ్యించుకొనుచున్నది. కనుక నిట్టిజాతి

భేదములనుగూర్చి చెప్పువారి మాటలనువిని భ్రమపడవలదు. మనస్సునం దన్యాయమగు నసహ్యతను వృద్ధిచేసికొనవలదు.

మీరు చిన్నవాండ్రగుటవలన వివాహమనఁగ నేమియో బాగుగ గ్రహింపఁజాలక పోవచ్చును. కాని వివాహము వలన రెండుకుటుంబములకు సంబంధము స్థిరపడుననుకొలఁదిసంగతిని గ్రహింపుఁడు. ప్రేమవలనను వచ్చుచుఁ బోవుచుండుటవలనను నొకచోట భుజించుచుండుటవలనను సంబంధము దృఢతరమగుచుండును. కొన్ని కొన్ని కుటుంబములవారికి వివాహసంబంధము గలుగుటవలన నాకుటుంబములకు శుభముగలుగుటను జూచియున్నాము. వినుటవలనను యోచించుటవలనను దెలిసికొనుచున్నాము. సుచరిత్రయును ధర్మభావమును విద్యాబుద్ధులునుగలిగి మర్యాదగల కుటుంబములైనచో నీరెండు కుటుంబములవారికి వివాహసంబంధమున కేవిధమగు నాటంకము లేదు. రెండు కుటుంబములలోని పూర్వులు భిన్నభిన్న వృత్తులు గడిపియుండిరనుటవలన వివాహసంబంధమును గల్పించుకొనుట కేవిధమగు నాపత్తియును లేదు. కాని మనదేశమునందలి వార లీవిధమగు కార్యములను ప్రోత్సహింపకుండుటయేకాక యసహ్యించుకొనుటను మీరు చూచుచునేయున్నారు. భేదములేని చోట భేదమును గల్పనచేసియున్నారు. జాతిభేదము లేనిచోట జాతిభేదమును గల్పనచేసియున్నారు. ప్రీతి సద్భావముండవలసిన స్థలమున ననర్థదాయకమగు నసహ్యతను దెచ్చుకొని ప్రీతి సద్భావముల వృద్ధికి భంగము గలిగించియున్నారు. కనుక వారు చెప్పుమాటలను విని భ్రమపడవలదనియు, నన్యాయమైన యసహ్యతకు మనమున స్థానము నీయవలదనియుఁ గార్యముల

యందును బ్రకాశము చేయవలదనియుఁ దిరిగి చెప్పుచున్నాను.

ఒకదేశవాసులలో నొక జాతీయులలో వృత్తిభేదములను బట్టి మిథ్యయగు జాతిభేదములను గల్పించుకొనుటవలన దేశమునకు మితిమీరిన నష్టముగలిగినది. ఏకజాతీయులు మనమందఱ మొకజాతివారమను నేకాభిప్రాయమును గలిగియున్నచో విశేషముపకారము గలుగును. పరస్పర సహాయమువలన ధనము, సుఖము, రక్షణధర్మోన్నతి మొదలగు వానితోడ జాతి యుంతయుఁ దులఁదూఁగుచుండును. మన దేశమునందు మనమందఱ మొకజాతివారమను నభిప్రాయమత్యల్పము. మిథ్యయగు జాతిభేద మతిప్రబలము. ఇందువలన మనజాత్యున్నతి కనేకాటంకములు గలుగుచున్నవి. ఒకశ్రేణిమనుష్యులు మిగత శ్రేణులవారి నందఱను నన్యజాతివారనుకొనుట వలన పరస్పరము తమవాండ్రని భావించుటలేదు. ఇందువలన నొకరికొకరు సహాయమును జేసికొనుచుండుటలేదు. మీరు పెద్దవాండ్రయిన కొలఁదిని నీసంగతిని బాగుగఁ దెలిసికొనఁగలుగుదురు. ఈ దేశానిష్టకరమును కృత్రిమమునగు జాతిభేదమును మనస్సునందును గార్యములయందును సహృదయతతోడఁ ద్యజింపుడు. దేశీయులనెల్లరను మీవారలుగ భావించి ప్రేమింపుఁడు. దేశీయుల సేవకు మీయంతట మీరు నియుక్తులుగండు. సమస్తజాతులవారి నీశ్వరపుత్రులని నమ్మియాదరింపుఁడు. దేశీయులకు మీ సాధ్యమైనంతవఱ కుపకారమొనర్చుచుండుడు.

ప్రశ్నలు.

౧. ఎల్లమనుష్యుల యెడలను మనకుఁగల కర్తవ్యమెద్ది?

౨. జాతిభేదము లెందువలన గలిగినవి?

౩. భిన్నజాతి మానవులయెడల మనకుఁగల కర్తవ్య మెద్ది?

౪. భిన్న భిన్న కార్యములవలననే కదా జాతిభేదము లేర్పడినవి?

౫. భిన్న భిన్న కార్యములను జేయువారిలోఁ బరస్పరము గమనింపవలసిన కర్తవ్యము లెవ్వి?

౬. ఏకార్యము లొనర్చుటవలన నీచమానవుఁడగును?

౭. అనేకు లేఁసు కార్యములను జేయుచుండువారిని నీచమానవులనుచున్నారు? అట్టివారి విషయమున మనకుఁగల కర్తవ్య మెద్ది?

౮. రెండు కుటుంబములవారుం జేయు విషయములలో సమత్వమున్నచో, వివాహసంబంధము లుండవచ్చును?

౯. భిన్న భిన్న వ్యాపారములు చేయు కుటుంబములవారికి వివాహసంబంధము లుండవచ్చునా, లేదా?

౧౦. ఈ దేశమునం దెట్టి జాతిభేదము నడచుచున్నది? అందువలన నేయేనష్టములు గలుగుచున్నవి?

షోడశపాఠము — బ్రాహ్మధర్మము.

మీరు "బ్రహ్మ" మను శబ్దమునకును, "ధర్మము" అను శబ్దమునకును నర్థమును దెలిసికొనియేయుందురు. మీజ్ఞానము వృద్ధియైనకొలఁదిని నీశబ్దముల కర్థమును రాను రాను నెక్కువగ

గ్రహించుచుందురు. ఇప్పటికి మీరు దెలిసికొనియున్న దానివలన "బ్రాహ్మధర్మము" అను సమస్తపదమున కర్థము కొంత కొంత తెలిసికొనవచ్చును. బ్రాహ్మలనఁగా బ్రహ్మయున్నాఁడని విశ్వసించువారును బ్రహ్మోపాసన చేయువారు నని యర్థమగును. "ధర్మ" మనఁగా కర్తవ్యమని యిదివఱకే తెలిసికొనియున్నారు. సత్యమును బలుకుట యీశ్వరునియందు భక్తినిజూపుట, మానవులను బ్రేమించుట మొదలగు కర్తవ్యమునకును "ధర్మ"మని జెప్పువిధముననే యొకచోఁజేరిన కర్తవ్య సమూహమునకును "ధర్మ"మని చెప్పవచ్చును. బ్రాహ్మలేమిచేయుటయుచితమో వానినిగతపాఠములయందుఁ గొంతవఱకుఁ దెలిసికొని యున్నారు బ్రాహ్మల ప్రధానకర్తవ్యము లీగ్రంథమునందుఁ జెప్పఁబడియున్నవి. ఈకర్తవ్యసమూహము నొకచోఁ జేర్చిన నగు కర్తవ్యసమిష్టికి "బ్రాహ్మలయొక్క ధర్మము" లేక "బ్రాహ్మధర్మ"మని చెప్పినఁ జాలును. అట్లైనచో "బ్రాహ్మ ధర్మ"మనగా బ్రాహ్మలయొక్క కర్తవ్యసమిష్టి లేక బ్రహ్మముగలఁడని విశ్వసించువారి కర్తవ్య సమిష్టి యని యర్థమగుచున్నది.

కాని "ధర్మ"మను మాటకు మతమొక యర్థముగలదు. అనఁగా నీశ్వరుని విషయమునను లేక కర్తవ్య విషయమునను దేనిని విశ్వసించుచున్నామో దేనిని మన్నించుచున్నామో దానిని "మత"మని చెప్పుదురు. ఇట్లైనచో ధర్మమనుమాటకు నీశ్వరునియొక్క లేక కర్తవ్యవిషయమున బ్రాహ్మల మతమని యింకొకయర్థము. ఈశ్వరుఁడున్నాఁడు. ఆయన నుపాసనచేయుట యుచితము మానవుల బ్రేమించుట యుచితము మొదలగు నియమానుసారముగ బ్రవర్తించుటయే యీశ్వరవిషయ

మునను, కర్తవ్యవిషయములలోను మన మతమై యున్నది. మన మీసకల మతసమిష్టినే "మాధర్మ"మని చెప్పుచున్నాము. ఇటులయినచో, బ్రాహ్మధర్మమను పదమునకు నీశ్వరవిషయ కర్తవ్య విషయములయందు బ్రాహ్మల మతమని యింకొక భావము తేలుచున్నది. ఈశ్వరునియందును కర్తవ్యవిషయము లందును బ్రాహ్మలమతమును నీపుస్తకమునందు సంగ్రహముగఁ దెలియఁజేసి యున్నాను. ఈక్రింద నుదహరించు ప్రధానాభిప్రాయములే బ్రాహ్మధర్మము.

(౧) ఆత్మయొక్క స్వాభావికశక్తి వలన సాక్షాద్భావమున నీశ్వరుని, మఱియుఁ గర్తవ్యములను దెలిసికొనుట. ఈ స్వాభావిక శక్తినే వివేకము ప్రజ్ఞ యని చెప్పియున్నాను. (౨) జగత్తున కొక కర్తగలఁడు. ఆయనయొక్క జ్ఞానము ప్రేమ, శక్తి పవిత్రిత యనంతములు. (౩) ఈశ్వరోపాసనము ను చేయుట యుచితము (౪) ఆత్మకు నాశనము లేదు. అనంతముగ వృద్ధినొందుచుండును (౫) జగత్తునందలి సకలశాస్త్రములును, నాచార్యులును, మనభక్తికిఁ బాత్రులు. కాని వివేకమునకును, బ్రజ్ఞకును సరిపడు నుపదేశములను మాత్రమే గ్రహింపవలయును.

ఈశ్వరుని విషయమునను కర్తవ్యవిషయములయందును మానవసముదాయ మొకవిధముగ విశ్వసించుటలేదు. ధర్మవిషయమున భిన్నములగు నమ్మకములుగలవు. కొన్ని కొన్ని నమ్మకముల సముదాయమునకు బ్రాహ్మధర్మమని చెప్పుచున్నటులే భిన్నములగు నమ్మకములుగల సాంప్రదాయములకు భిన్న భిన్న నామములుగలవు. ఈ భిన్న భిన్న సమిష్టికి భిన్న భిన్న ధర్మ

ము లనుచున్నాము. జగత్తునందు నడుచుచున్న ముఖ్యధర్మములతోఁడ బ్రాహ్మధర్మము కొంతవఱకుఁ గలిసియుఁ గొంత వఱకుఁ గలియకయు నున్నది. ఈసకలధర్మముల శాస్త్రముల యందు ననేకసత్యములును, మంచియంశములునుగలవు. కనుక మీరు సమయముదొరకినపుడెల్లను భక్తితో నాయామతగ్రంథములను జదువుచుండవలయును. జ్ఞానియును ధార్మికుఁడునగు వాఁడే ధర్మావలంబియైనను మన పరమభక్తికిఁ బాత్రుఁడని మనమునం దుంచుకొనుఁడు.

ప్రశ్నలు.

౧ "బ్రహ్మ" యను శబ్దమున కర్థమేమి?

౨ "ధర్మ"మను శబ్దమునకుఁగల రెండర్థములను జెప్పుము.

౩ "బ్రాహ్మధర్మము" అను పదమున కర్థమేమి?

౪ బ్రాహ్మధర్మముయొక్క ప్రధానములగు సత్యము లెవ్వి?

౫ "భిన్నభిన్నధర్మములు" అనుపదమున కర్థమేమి?

౬ పరధర్మముల యొక్క శాస్త్రములవిషయమునను నాచార్యుల విషయమునను మన కర్తవ్యమేది?

సప్తదశపాఠము—బ్రాహ్మసమాజము.

పలువురుగలసి బ్రహ్మోనుపాసనచేయు మందిరమును "బ్రాహ్మసమాజ"మని మీలోఁ గొందఱనుకొనుచుండవచ్చును.

ఇట్టిమందిరము, ననేకులు బ్రాహ్మసమాజమని పిలుచుచుండుట సత్యమే కాని బ్రాహ్మసమాజముయొక్క నిశ్చితార్థమిదిగాదు. బ్రాహ్మసమాజ మనుశబ్దమునకు రెండుమూఁడర్థములుగలవు. పదిమంది మనుష్యులుపాసనముచేయుట కొకస్థలమునకుఁ జేరునప్పు డాయుపాసకులను బ్రాహ్మసమాజమని చెప్పుకొప్పును. ఇందువలన బ్రాహ్మసమాజమనఁగా బ్రహ్మోపాసనకుఁ జేరుమనుష్య సముదాయమని యర్థమగుచున్నది. కనుక బ్రహ్మోపాసకమండలి యనియును జెప్పవచ్చును. సమాజము లేక మండలియను శబ్దముల యర్థ మొకటియే. అనఁగా దళము లేక మిళితవ్యక్తి సమూహమని యర్థము. ఇందువలన బ్రాహ్మసమాజమనఁగా నీశ్వరోపాసకదళమనియును జెప్పవచ్చును. ఇట్టి సమాజము లనేకములుగలవు. ఎల్లసమాజములు నియమిత ప్రకార మీశ్వరోపాసనను జేయుచుండును. అన్ని సమాజములకు నుపాసనా మందిరములుగలవు. ఇట్టి గృహములను లేక మందిరములను బ్రాహ్మసమాజములని పిలువఁజనదు.

మాజమందిరమని కాక, యుపాసనామందిరమని కాని పిలుచుట యుచితము. ఈశ్వరోపాసనకు సమాజముగఁ జేరువారలుపాసనచేయుటయే కాక యనేకసమయములయందు ధర్మ యకమగు చర్చను జేయుచుందురు. ఈచర్చయందు బ్రాహ్మధర్మమును పాలనము చేయువిధమును గూర్చి మాట్లాడుకొనుటయే కాక పలువిధములగు ప్రయత్నములను గూడఁ జేయుచుందురు. కనుక బ్రాహ్మధర్మపాలనము కొఱకుఁ జేయు ప్రయత్నములను బ్రాహ్మధర్మసాధనములని చెప్పుదుము. బ్రాహ్మధర్మ సాధనముచేయుట కనుకూలముగనుండునటు లొక్కొక

దళము పనిచేయుచుండును. బ్రాహ్మమత దీక్షితులు గానివార లను బ్రాహ్మమతదీక్షితులను జేయుట కొక్కొక్క దళముపనిచేయు చుండును. ఇతరులకు బ్రాహ్మధర్మమును గురించి బోధించుట ను బ్రాహ్మమతదీక్ష నిచ్చుటను, బ్రాహ్మధర్మ ప్రచారమందురు. ఇందువలన బ్రాహ్మసమాజమనగాఁ బరస్పర సహాయముతోఁడ బ్రాహ్మధర్మసాధనమును జేయుట బ్రాహ్మధర్మ ప్రచారమును జేయుటయునియు నర్థమగుచున్నది. ఈవిధమగు సమాజము లనేకములుగలవు. ఎల్లసమాజములను బ్రాహ్మసమాజములని చె ప్పరాదు. బ్రాహ్మసమాజమనఁగానే యొకప్రకాండమైన వస్తువని మనమునకు గోచరమగును. సకలస్థానములయందున్న బ్రాహ్మ సమాజములన్నియును, నే బ్రాహ్మసమాజమునను సభ్యులుగాఁ జేరకయున్న బ్రాహ్మధర్మావలంబు లందఱును గూడియున్నది యీ బ్రాహ్మసమాజమని యర్థము. అనఁగా బ్రాహ్మమతావలంబు లందఱియొక్క సమిష్టి లేక సమాజము.

"బ్రాహ్మసమాజము" అనుమాటకుఁ గలరెండవ యర్థ ముప్రకారము బ్రహ్మసాధక దళములు లేక బ్రాహ్మధర్మ ప్ర చారక దళములును నగు బ్రాహ్మసమాజములు భిన్న భిన్న స్థానములయందుఁ గలవు. కొన్నికొన్ని స్థలములయందు రెండు మూఁడు సమాజములుగలవు. కలకత్తాయందు, ఆది బ్రాహ్మ సమాజము భారతవర్షీయ బ్రాహ్మసమాజము (నవవిధానము) సాధారణ బ్రాహ్మసమాజము అనిమూఁడు బ్రాహ్మసమాజ ములుగలవు. కలకత్తాయందలి మూఁడు సమాజములకుఁ జెం దిన బ్రాహ్మమతావలంబు లున్నటులే యితరస్థలముల యం దును మూఁడుసమాజములకును జెందిన బ్రాహ్మమతావలం

బులు గలరు. భిన్న భిన్న సమాజము లెందువలన నేర్పడినవను విషయమును మీరు క్రమక్రమముగ గ్రహింప గలుగుదురు. ఏ బ్రాహ్మ సమాజమునకుఁ జెందియున్నను, బ్రాహ్మసామాజికులైన మాత్రమున విశేషభావమున స్వకుటుంబములోని వారివలె జూచుము. సమస్తమైనవారిని నీశ్వరపుత్రులుగ భావించి సోదరునివలె బ్రేమింపుము. ఒక సంసారములోని వారలు స్వభావసిద్ధముగ విశేషభావమునఁ బరస్పరము బ్రేమించుచుందుట వలనఁ బరస్పర ముపకారము గలుగుచుండు విధము నేకముకై ధర్మావలంబులు పరస్పరము ప్రేమించుచుండిన యెడల బ్రాహ్మధర్మసాధనకును, ప్రచారమునకును మిక్కిలి సహాయము గలుగును. భిన్న భిన్న బ్రాహ్మసమాజము లన్నిటికొక సంబంధముగలదు. ఆ సంబంధమువలనఁ బరస్పర ముపకారము గలుగుచున్నది. ముఖ్యముగ భిన్న భిన్న సమాజములకు సంబంధించిన జ్ఞానులయు సాధువులయు నుపదేశములు గ్రంథములమూలమున సకలసమాజములవారికి నుపకారకము లగుచున్నవి. కాన బ్రాహ్మమతావలంబు లందఱును మన వి[illegible]మకుఁ బాత్రులు. మఱియును బ్రాహ్మసమాజములలోనిజ్ఞా సాధువులు మొదలగువారలు మనవిశేషభక్తికిఁ బాత్రులు.

ఈపుస్తకము సమాప్తమైనది. మీరు శ్రద్ధతో నీపుస్తకమును మాటిమాటికిని జదువుచు దీనిలోఁ జెప్పిన ప్రకారము నడుచుకొందురను నాశయమున నున్నాను. ఈశ్వరుడు మిమ్ములను శ్రేష్ఠులగు బ్రాహ్మలను బ్రాహ్మికలనుగాఁ జేయుగాక! మీరు ప్రేమకలవారును నిష్కల్మష చిత్తులును కర్మిష్ఠులును నగు (బ్రాహ్మలు బ్రాహ్మికలు) నై దేశసేవయందు నియుక్త

లగుదురుగాక యని పరమేశ్వరుని ప్రార్థించుచున్నాను.

(౧) "బ్రాహ్మసమాజ"మను పదమున కెన్ని యర్థములు కలవు?

(౨) ప్రథమార్థమేది?

(౩) ద్వితీయార్థమేది?

(౪) "బ్రాహ్మధర్మసాధన" అనగా నర్థమేమి?

(౫) "బ్రాహ్మధర్మ ప్రచారము" అనగా నర్థమేమి?

(౬) "బ్రాహ్మసమాజము" దీనికి సాగాదవయర్థ మెద్ది?

(౭) బ్రాహ్మసమాజము మీఁద మన కేవిధమగు భావ ముండుట యుచితము?

(౮) ఇట్టిభావమునఁ గలుగఁగల యుపకారమెద్ది?

(౯) భిన్న భిన్న సమాజముల మధ్యగల సంబంధమెట్టిది?

ఓం శాంతిః! శాంతిః!! శాంతిః!!!

బ్రహ్మకృపాహి కేవలం.